RNI No. APTEL/2006/17880 www.bharathasakthi.com



# భారత శక్తి®

తెలుగు దినపత్రిక

VOICE OF INDIAN



Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి: 20 సంచిక:14 హైదరాబాద్, ఆదివారం, 22 జూన్ 2025 పేజీలు: 12 వెల: 1.00

## యోగా ప్రపంచ దేశాలను కలిపింది: మోదీ

విశాఖ: విశాఖలో అంతర్జాతీయ యోగా దినోత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా ప్రధాని నరేంద్ర మోదీ హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రధానికి సీఎం చంద్రబాబు జ్ఞాపికను బహూకరిం చారు. అనంతరం ప్రధాని మోదీ ప్రసంగించారు.

"అందరికీ అంతర్జాతీయ యోగా దినోత్సవ శుభాకాంక్షలు. యోగా ప్రపంచ దేశాలను ఏకం చేసింది. యోగా దినోత్సవ ప్రతిపాదనకు 175 దేశాలు మద్దతిచ్చాయి. 175 దేశాల్లో యోగా చేయడం సాధారణ విషయం కాదు. యోగా అనేది మానవతను పెంచే సామూహిక ప్రక్రియ. గత పదేళ్లలో కోట్ల మంది జీవితాల్లో యోగా వెలుగులు నింపింది. గ్రామగ్రామాల్లో యువకులు యోగాను అనుసరిస్తున్నారు. యోగాకు వయసుతో పనిలేదు.. యోగాకు హద్దులు లేవు" అని మోదీ అన్నారు.

"ప్రకృతి సౌందర్యానికి, ప్రగతికి చిరునామా విశాఖపట్నం. ప్రకృతిలో మనిషి భాగస్వామి అని యోగా గుర్తు చేస్తుంది. యోగాతో వ్యక్తిగత క్రమశిక్షణ అలవడుతుంది. యోగా ద్వారా నేను అన్న భావన మనంగా మారుతుంది. మనం అన్న భావన మానవత్వాన్ని పెంచుతుంది. ప్రపంచంలో అశాంతి, అస్థిరత పెరుగుతున్నాయి. యోగా వల్ల శాంతి స్థిరత్వం సాధించవచ్చు" అని మోదీ పేర్కొన్నారు.



నెలన్నర రోజుల్లో యోగాంధ్రను విజయవంతం చేయడంలో మంత్రి లోకేశ్ పాత్ర కీలకమైందని.. కొత్త కార్యక్రమాల రూపకల్పనలో ఆయన చొరవ ప్రశంసనీయమని ఈ సందర్భంగా మోదీ కొనియాడారు.

విశాఖ వేడుకల్లో పాల్గొనడం అద్భుతం

"యోగా కేవలం వ్యాయామం కాదు.. అదొక జీవన విధానం. ఈ ఏడాది విశాఖలో యోగ దినోత్సవ వేడుకల్లో పాల్గొనడం అద్భుతం" అని మోదీ ఎక్స్‌లో పేర్కొన్నారు.

## 'అసలైన సినిమా మిగిలే ఉంది'.. గడ్కరీ ఆసక్తికర వ్యాఖ్యలు

వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో తన పాత్రపై కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ( ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. గత 11 ఏళ్లలో చూసింది కేవలం న్యూస్ రీల్ మాత్రమేనని, అసలైన సినిమా ఇంకా మిగిలే ఉందని వ్యాఖ్యానించారు. ఏదేమైనా తాను చేయాల్సిన పనులను



పార్టీ నిర్ణయిస్తుందని, ఏ బాధ్యతలు అప్పగించినా నిర్వర్తించేందుకు సిద్ధంగా ఉన్నానని చెప్పారు.

"ఇప్పటివరకు చూసిందంతా న్యూస్ రీల్ మాత్రమే. అసలైన సినిమా ఇంకా ప్రారంభం కాలేదు. కార్యకర్తలు ఏం చేయాలి, బాధ్యతలు ఏంటనే విషయాన్ని పార్టీ నిర్ణయిస్తుంది. పార్టీ అప్పగించిన బాధ్యతలను నేను నిర్వర్తిస్తా. ఇటీవల రోడ్ల పనుల కంటే వ్యవసాయం ఇతర సామాజిక కార్యక్రమాలపై నేను ఎక్కువగా దృష్టి సారిస్తున్నా" అని కేంద్ర మంత్రి పేర్కొన్నారు. 11ఏళ్ల మోదీ పాలన గురించి ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన గడ్కరీ.. విదర్భలో రైతుల ఆత్మహత్యలను ఆపేందుకు కృషి చేయాలన్నదే తన కోరిక అన్నారు.

తలసరి ఆదాయం విషయంలో ప్రపంచంలో తొలి పది దేశాల్లో భారత్ ఎందుకు లేదని అడిగిన ప్రశ్నకు స్పందిస్తూ.. దేశ జనాభా ఇందుకు కారణమన్నారు. జనాభా నియంత్రణను భాషా లేదా మతపరమైన సమస్యగా కాకుండా ఆర్థిక సమస్యగా చూడాలన్నారు. చాలా అభివృద్ధి జరుగుతున్నా.. ఫలితాలు మాత్రం అందరికీ అందడం లేదన్నారు. ఇందుకు జనాభా పెరుగుదలే కారణమన్నారు. గత రెండు పర్యాయాల్లో మోదీ ప్రభుత్వం సాధించిన అనేక విజయాలను ఈ సందర్భంగా గడ్కరీ ప్రస్తావించారు.

## భూ సమస్యలపై రాష్ట్ర వ్యాప్తంగా 8.58లక్షల దరఖాస్తులు: మంత్రి పొంగులేటి

హైదరాబాద్: భారాస ప్రభుత్వ హయాంలో భ్రష్టుపట్టిన రెవెన్యూ వ్యవస్థను ప్రక్షాళన చేసే పనిలో ఉన్నట్టు రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. రెవెన్యూ సదస్సులు ముగిసిన సందర్భంగా ఇవాళ అధికారులతో మంత్రి పొంగులేటి సమీక్ష నిర్వహించారు. ఈ ఏడాది ఏప్రిల్ 14న భూ భారతి చట్టాన్ని సీఎం రేవంత్‌రెడ్డి ఆవిష్కరించారని, దశలవారీగా ఈ చట్టాన్ని అమల్లోకి తీసుకొచ్చినట్టు పేర్కొన్నారు. మొదటి విడత ఏప్రిల్ 17 నుంచి 30వ తేదీ వరకు నాలుగు మండలాల్లో, రెండో విడతలో మే 5 నుంచి 28 వరకు 28 మండలాల్లో, మూడో విడతలో ఈనెల 3 నుంచి 20 వరకు మూడో విడతలో సదస్సులు నిర్వహించినట్లు వివరించారు. ఈ మూడు విడతల్లో రాష్ట్ర వ్యాప్తంగా 593 మండలాల్లో 10,725 రెవెన్యూ సదస్సులు నిర్వహించగా 8.58 లక్షల దరఖాస్తులు వచ్చినట్లు మంత్రి తెలిపారు.

అత్యధికంగా ఖమ్మం జిల్లాలో 67వేలు, భద్రాద్రి కొత్తగూడెంలో 61వేలు, వరంగల్‌లో 54 వేలు, జయశంకర్ భూపాలపల్లిలో 48వేలు, నల్గొండలో 42 వేల దరఖాస్తులు వచ్చినట్లు పేర్కొన్నారు. రెవెన్యూ సదస్సులకు ముందురోజే ఆయా గ్రామాల్లో రైతులకు ఉచితంగా దరఖాస్తులు ఇచ్చామని, ఎమ్మార్వోల



ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి రెవెన్యూ అధికారులే ప్రజల వద్దకు వచ్చి ఎలాంటి రుసుము లేకుండా దరఖాస్తులను స్వీకరించారని వివరించారు. స్వీకరించిన వాటికి రశీదులు అందజేయడం జరిగిందని, వచ్చిన దరఖాస్తుల్లో ఇప్పటివరకు 3.27 లక్షల దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేసినట్లు తెలిపారు. మిగిలిన వాటిని కూడా త్వరితగతిన ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు.

## ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డికి రిమాండ్

వరంగల్ : హుజూరాబాద్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డికి.. కోర్టు జుడిషియల్ రిమాండ్ విధించింది. 14 రోజుల పాటు రిమాండ్ విధిస్తూ జడ్జి తీర్పు వెలువరించారు. దీంతో కౌశిక్ రెడ్డిని పోలీసులు ఖమ్మం జిల్లా జైలుకు తరలించనున్నారు. కౌశిక్ రెడ్డి అరెస్ట్‌పై ఉదయం నుం హైడ్రామా కొనసాగింది. కౌశిక్‌ది అక్రమ అరెస్ట్ అంటూ బీఆర్ఎస్ నేతలు ఆందోళన చేపట్టారు. ప్రభుత్వం బీఆర్ఎస్ నేతలపై కేసులు పెట్టి కక్ష సాధిస్తోందంటూ ఆరోపించారు.




కమలాపూర్ మండలంలో గ్రానైట్ క్వారీ వ్యాపారిని బెదిరించి డబ్బులు డిమాండ్ చేశారనే ఆరోపణలపై కౌశిక్ రెడ్డిపై పోలీసులు వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో సుబేదారీ పోలీసులు శనివారం తెల్లవారుజామున శంషాబాద్ ఎయిర్ పోర్ట్ లో కౌశిక్ రెడ్డిని అదుపులోకి తీసుకున్నారు.

కౌశిక్ రెడ్డికి రిమాండ్ విధించడంపై పలువురు నేతలు స్పందించారు. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతీకార రాజకీయాలకు పాల్పడుతోందని ఆరోపించారు. న్యాయపరంగా ఎదుర్కొంటామని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే వినయ్ భాస్కర్ మాట్లాడుతూ కౌశిక్ కడిగిన ముత్యంలా బయటకు వస్తారని చెప్పారు. మాజీ ఎంపీ వినోద్ కుమార్ మాట్లాడుతూ కేసులను న్యాయపరంగానే ఎదుర్కొంటామని పేర్కొన్నారు.

## డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపుతాం: డీజీపీ జితేందర్

హైదరాబాద్: డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపుతామని తెలంగాణ డీజీపీ జితేందర్ హెచ్చరించారు. డ్రగ్స్ వల్ల చాలా అనర్థాలు జరుగుతాయని అన్నారు. యవత వీటి బారిన పడొద్దని.. విలువైన జీవితాన్ని కోల్పోవద్దని సూచించారు. డ్రగ్స్ ఫ్రీ తెలంగాణ కోసం ప్రభుత్వం, పోలీసులు కృతనిశ్చయంతో పని చేస్తున్నారని అన్నారు. ఇవాళ(శనివారం) తెలంగాణ నార్కోటిక్ బ్యూరో ఆధ్వర్యంలో డ్రగ్స్ అవేర్నెస్ వీక్‌ని డీజీపీ జితేందర్ ప్రారంభించారు. జూన్ 21వ తేదీ నుంచి 26వ తేదీ వరకు యాంటీ డ్రగ్ అవేర్నెస్ వీక్ నిర్వహిస్తున్నారు.

వారోత్సవాల్లో భాగంగా డ్రగ్స్ వినియోగం వల్ల వచ్చే అనర్థాలపై విద్యార్థులకు నార్కోటిక్ బ్యూరో అవగాహన కల్పించనుంది. డ్రగ్ అవేర్నెస్ వీక్‌లో హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరిచందన, %ు+ూచీదీ% డైరెక్టర్ సందీప్ శాండిల్య, వివిధ కళాశాలల విద్యార్థులు, ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీజీపీ జితేందర్ మీడియాతో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో దురదృష్టవశాత్తూ యువత డ్రగ్స్‌కు అలవాటు పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. డ్రగ్స్ మెంటల్ హెల్త్‌తో పాటు ఫిజికల్ హెల్త్‌ను నాశనం చేస్తుందని చెప్పారు. విద్యార్థులు మీ జీవితం అనే పుస్తకంలో మంచి విషయాలు మీరే రాసుకోవాలని సూచించారు. నో టు డ్రగ్స్ అనే నినాదం జనాల్లోకి తీసుకెళ్లాలని అన్నారు. ఫ్రెండ్స్, కుటుంబ సభ్యుల్లో ఒక్కో విద్యార్థి పదిమందికి సే నోటు డ్రగ్స్ అని చెప్పాలని డీజీపీ జితేందర్ కోరారు.

మాదక ద్రవ్యాల జోలికి వెళ్లవద్దు:సందీప్ శాండిల్య

విద్యార్థుల మాదక ద్రవ్యాల జోలికి వెళ్లవద్దని %ు+ూచీదీ% డైరెక్టర్ సందీప్ శాండిల్య అన్నారు. విద్యార్థులు తల్లిదండ్రులకు పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని కోరారు. విద్యార్థులతో యాంటీ డ్రగ్ సోల్జర్స్‌గా సందీప్ శాండిల్య ప్రమాణం చేయించారు. డ్రగ్స్ వ్యతిరేకంగా పని చేస్తామని, మాదక ద్రవ్యాల జోలికి వెళ్లమని విద్యార్థులు ప్రమాణం చేశారు.




విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి: కలెక్టర్ హరిచందన

పాఠశాలల్లో డ్రగ్స్‌ని గుర్తిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరిచందన సూచించారు. విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని కోరారు. డ్రగ్స్‌కి వ్యతిరేకంగా పని చేస్తామని విద్యార్థులతో కలెక్టర్ హరిచందన ప్రమాణం చేయించారు. సే నోటు డ్రగ్స్ అనే నినాదం అందరికీ చేరేలా చేయాలని అన్నారు. డ్రగ్స్ ఫ్రీ తెలంగాణ కోసం విద్యార్థులు అందరూ పని చేయాలని కలెక్టర్ హరిచందన కోరారు.

## శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ విస్తరణకు గ్రీన్‌సిగ్నల్

హైదరాబాద్, జూన్ 21,

తెలంగాణ రాజధాని హైదరాబాద్‌లో అంతర్జాతీయ విమాన సేవలకు కేంద్రంగా ఉన్న శంషాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం భారీ విస్తరణకు సిద్ధమవుతోంది. ప్రయాణికుల రద్దీ, విమాన రాకపోకలు గణనీయంగా పెరిగిన నేపథ్యంలో.. జిఎంఆర్ హైదరాబాద్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ ఈ విమానాశ్రయాన్ని సుమారు రూ.14,000 కోట్లతో విస్తరించాలని యోచిస్తోంది. రానున్న కాలంలో హైదరాబాద్‌ను అంతర్జాతీయ కనెక్టివిటీకి ఒక కీలక కేంద్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ఈ బృహత్తర ప్రాజెక్ట్ ను చేపడుతున్నారు. ఈ విస్తరణ.. నగరం ఆర్థిక వృద్ధికి, ప్రపంచ వేదికపై దాని స్థానాన్ని మరింత బలోపేతం చేయడానికి గణనీయంగా దోహదపడనుంది. 2008లో ప్రారంభమైన శంషాబాద్ విమానాశ్రయం.. అతి తక్కువ కాలంలోనే భారతదేశంలో అత్యంత రద్దీగా ఉండే విమానాశ్రయాలలో ఒకటిగా మారింది. దీని ప్రస్తుత సామర్థ్యం పెరుగుతున్న ప్రయాణికుల సంఖ్యకు సరిపోవడం లేదు. హైదరాబాద్, దేశంలోనే వేగంగా అభివృద్ధి చెందుతున్న ఐటీ, ఫార్మా, లాజిస్టిక్స్ కేంద్రంగా మారడంతో.. అంతర్జాతీయ, దేశీయ ప్రయాణాల డిమాండ్ గణనీయంగా పెరిగింది. ఈ నేపథ్యంలో.. ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడానికి, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా విమానాశ్రయాన్ని సిద్ధం చేయడానికి విస్తరణ అవసరమని గుర్తించింది. ఈ విస్తరణ ప్రణాళికలో భాగంగా.. ప్రయాణికుల సౌకర్యార్థం ఒక కొత్త టెర్మినల్, విమానాల రాకపోకలను సులభతరం చేయడానికి ఒక అదనపు రన్‌వేను నిర్మించబోతున్నట్లు తెలుస్తోంది. ఈ నూతన మౌలిక సదుపాయాలు విమానాశ్రయం కార్యాచరణ సామర్థ్యాన్ని గణనీయంగా పెంచుతాయి. వచ్చే ఏడాది ప్రారంభంలోనే విస్తరణ పనులను మొదలుపెట్టి.. 2029 నాటికి వాటిని పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ



కాలపరిమితిలో.. పనులు వేగంగా, సమర్థవంతంగా పూర్తి చేయడానికి ఉఊఎంఒ కృషి చేయనుంది. రూ.14,000 కోట్ల భారీ పెట్టుబడి కేవలం మౌలిక సదుపాయాల పెంపుదలకు మాత్రమే పరిమితం కాదు.. ఇది రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై బహుముఖ సానుకూల ప్రభావాన్ని చూపుతుంది. విమానాశ్రయం విస్తరణ పనుల ద్వారా ప్రత్యక్షంగా.. పరోక్షంగా వేలాది మందికి ఉద్యోగావకాశాలు లభిస్తాయి. నిర్మాణ రంగం, లాజిస్టిక్స్, హాస్పిటాలిటీ, ఇతర అనుబంధ పరిశ్రమలకు ఇది ఊతమిస్తుంది. అంతేకాకుండా.. మెరుగైన వాయు కనెక్టివిటీ పర్యాటక రంగానికి, వాణిజ్య కార్యకలాపాలకు, అంతర్జాతీయ పెట్టుబడులను ఆకర్షించడానికి దోహదపడుతుంది.

ఈ విస్తరణ ప్రాజెక్టులో సుస్థిరత అంశాలకు కూడా ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. పర్యావరణ అనుకూల సాంకేతికతలు, స్మార్ట్ ఎయిర్‌పోర్ట్ ఫీచర్లను ఉపయోగించి భవిష్యత్ అవసరాలకు ధీటుగా విమానాశ్రయాన్ని తీర్చిదిద్దాలని జీఎంఆర్ భావిస్తోంది. రానున్న పదేళ్లలో హైదరాబాద్ దేశంలోనే అతిపెద్ద ఆర్థిక శక్తుల్లో ఒకటిగా మారాలనే లక్ష్యంతో ఈ విమానాశ్రయం విస్తరణ ఒక కీలకమైన సాధనంగా నిలుస్తుంది. ఇది హైదరాబాద్‌ను ప్రపంచ పటంలో మరింత ప్రముఖంగా నిలుపుతుంది.

భారత శక్తి
VOICE OF INDIAN

## యోగా విరామ బటన్

ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా విశాఖ నగరంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించింది. ఈ కార్యక్రమంలో లక్షలాది మంది పాల్గొన్నారు. అలాగే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కూడా ఈ కార్యక్రమం కోసం ప్రత్యేకంగా విచ్చేసి.. యోగాంధ్రలో పాల్గొన్నారు. యోగా కేవలం వ్యక్తిగత సాధన మాత్రమే కాకుండా, ప్రపంచ భాగస్వామ్యానికి మాధ్యమంగా మారాలని, ప్రతి దేశం, సమాజం యోగాను తమ జీవన విధానంలో, ప్రభుత్వ విధానంలో భాగంగా చేసుకోవాలని ప్రధాని మోదీ ఆకాంక్షించారు. 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ప్రపంచవ్యాప్తంగా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపిన ఆయన, యోగా కేవలం వ్యాయామం కాదని, అదొక జీవన విధానమని అన్నారు. "యోగా అంటే సరళంగా చెప్పాలంటే కలవడం. ఇది ప్రపంచాన్ని కలిపింది'' అని ఆయన తెలిపారుయోగా ప్రపంచాన్ని కలిపింది. 175 దేశాల్లో యోగా చేయడం సాధారణ విషయం కాదు. ఇది మనతోనే సాధ్యమైంది. ప్రపంచవ్యాప్తంగా కోట్ల మంది జీవనశైలిని యోగా మార్చింది. నేవీకి చెందిన నౌకల్లో యోగాసనాలు వేస్తున్నారు. యోగా అందరి కోసం. ప్రగతి, ప్రకృతి సంగమస్థలి విశాఖ నగరం. చంద్రబాబు, పవన్, లోకేష్‌కు అభినందనలు. వన్ ఎర్త్.. వన్ హెల్త్ థీమ్‌తో ఈ సారి యోగా డే జరుపుకుంటున్నాం. ప్రపంచంతో మనం అనుసంధానం కావడానికి యోగా ఉపయోగపడుతుంది.అందరి క్షేమమే నా కర్తవ్యమని భారతీయ సంస్కృతి నేర్పుతుంది. ప్రపంచం ఏదో ఒక సమస్యను ఎదుర్కొంటుంది. ఈ పరిస్థితుల్లో యోగా శాంతికి తోడ్పడుతుంది. యోగా మనలో మానవత్వం పెంచుతుంది. వ్యక్తిగత క్రమశిక్షణకు యోగా ఒక అద్భుత సాధనం. నేను నుంచి మనం అనే భావనకు తీసుకెళ్లే ఆయుధం. ఒబేసిటీ అనేది ప్రపంచానికి పెద్ద సమస్య. తీసుకునే ఆహారంలో నూనె పదార్థాలను 10 శాతం తగ్గించాలి. యోగాను ఒక ఉద్యమంలా తీసుకెళ్లాలి. అందరికి యోగాతో ప్రతి రోజు మొదలవ్వాలి." అని ప్రధాని మోదీ అన్నారు. ప్రధాన మంత్రి మోదీ మాట్లాడుతూ, జూన్ 21వ తేదీని అంతర్జాతీయ యోగా దినోత్సవంగా గుర్తించాలని ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీకి భారతదేశం ఒక తీర్మానాన్ని సమర్పించిన రోజును గుర్తు చేసుకున్నారు. చాలా తక్కువ సమయంలో, ప్రపంచంలోని 175 దేశాలు మన దేశంతో నిలబడ్డాయి. నేటి ప్రపంచంలో ఈ ఐక్యత మరియు మద్దతు సాధారణ సంఘటన కాదు" అని ఆయన అన్నారు. సమకాలీన కాలంలో భౌగోళిక రాజకీయ అశాంతి మరియు ప్రాంతీయ అస్థిరతను ప్రస్తావిస్తూ, మోదీ "యోగా మనకు శాంతి దిశను ఇస్తుంది" అని అన్నారు. "మానవాళికి శ్వాస తీసుకోవడానికి, సమతుల్యం చేయడానికి మరియు తిరిగి సంపూర్ణంగా మారడానికి యోగా ఒక విరామ బటన్" అని ఆయన అన్నారు. యోగాను శతాబ్దాల నుంచి ఋషులు ఆచరిస్తున్నారు. ప్రస్తుతం, ప్రపంచం మొత్తం యోగా ప్రాముఖ్యతను అర్థం చేసుకుంది. దానిని అంగీకరించింది. నేడు, దేశంలోనే కాదు, ప్రపంచవ్యాప్తంగా ప్రజలు యోగాభ్యాసం ద్వారా తమను తాము ఆరోగ్యంగా ఉంచుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. యోగా బరువు తగ్గడానికి ఒక మార్గం మాత్రమే కాదు. యోగాభ్యాసం సమయంలో, అనేక రకాల ఆసనాలు, కార్యకలాపాలు చేస్తుంటారు. ఇది ఒక వ్యక్తికి శారీరకంగా, మానసికంగా ప్రయోజనం చేకూరుస్తుంది.క్రమం తప్పకుండా యోగా చేయడం వల్ల శరీర నొప్పి, శరీర భంగిమ, అనేక ఆరోగ్య సమస్యలు మెరుగుపడతాయి. బహుశా అందుకే నేటి కాలంలో, పిల్లల నుంచి వృద్ధుల వరకు, ప్రతి ఒక్కరూ తమ ఫిట్‌నెస్ దినచర్యలో యోగాను చేర్చుకోవడానికి ఇష్టపడతారు. కానీ మీరు యోగా నుంచి నిజంగా ప్రయోజనాలను పొందుతున్నారో లేదో తెలుసుకోవడం కూడా చాలా ముఖ్యం. కాబట్టి ఈ వ్యాసంలో ఇప్పుడు మనం యోగా వల్ల కలిగే ప్రయోజనాలు తెలుసుకుందాం.మీరు యోగాను క్రమం తప్పకుండా, సరిగ్గా సాధన చేసినప్పుడు, అది మీ శరీరం వశ్యతను మెరుగుపరుస్తుంది. మీ కీళ్ళు, కండరాలలో కదలిక పరిధి పెరుగుదలను మీరు గమనించవచ్చు. మీ కాలి వేళ్లను తాకడం, వెనుకకు వంగడం లేదా గతంలో కష్టంగా అనిపించిన భంగిమలను చేయడం మీకు సులభం అనిపించవచ్చుమీరు క్రమం తప్పకుండా యోగా సాధన చేసినప్పుడు, అది మీ శరీర భంగిమను కూడా మెరుగుపరుస్తుంది. ఇప్పుడు మీరు మీ భంగిమ గురించి ఎక్కువ ఆలోచించాల్సిన అవసరం లేదు. కానీ మీరు నిలబడటం లేదా నిటారుగా కూర్చోవడం అవసరం. మీ వెన్నెముక అమరిక మెరుగుపడుతుంది. మీరు వంగడం వంటి సమస్య నుంచి కూడా దూరం అవుతారు. అంతే కాదు, శరీర భంగిమ సరిగా లేకపోవడం వల్ల కలిగే మెడ నొప్పి, వెన్నునొప్పి వంటి సమస్యలను కూడా దూరం చేస్తుంది. యోగా సాధన ప్రారంభించినప్పుడు, కొన్ని రోజుల్లోనే మీలో మార్పును మీరు అనుభూతి చెందడం ప్రారంభిస్తారు. యోగా ఆరోగ్యానికి మేలు చేసినప్పుడు, కొన్ని సానుకూల మార్పులు కనిపించడం ప్రారంభిస్తాయి. ఉదాహరణకు, ఇది శరీర శక్తి స్థాయిని పెంచుతుంది. మీరు రోజంతా మరింత చురుకుగా ఉంటారు. మీరు త్వరగా అలసిపోయినట్లు లేదా బలహీనంగా అనిపించదు. యోగాభ్యాసం ప్రారంభించినప్పుడు, అది మీ జీర్ణవ్యవస్థపై కూడా సానుకూల ప్రభావాన్ని చూపుతుంది. మీ జీర్ణ అవయవాలకు మంచి మసాజ్ ఇచ్చే అనేక యోగాసనాలు ఉన్నాయి. ఇది రక్త ప్రసరణ, ఆక్సిజన్‌ను కూడా మెరుగుపరుస్తుంది. అటువంటి పరిస్థితిలో, ఒక వ్యక్తి మలబద్ధకం వంటి జీర్ణ సంబంధిత సమస్యలను తక్కువగా ఎదుర్కోవలసి ఉంటుంది. మీ ప్రేగు కదలిక మునుపటి కంటే మెరుగ్గా ప్రారంభమైతే, మీరు యోగాభ్యాసం నుంచి ప్రయోజనాలను పొందుతున్నారని అర్థం.

# పాపం కన్నా...

గుంటూరు, జూన్ 21, (

సీనియర్ నేత కన్నా లక్ష్మీనారాయణకు వచ్చే ఎన్నికలలో సత్తెనపల్లి నియోజకవర్గం సీటు దక్కుతుందా? లేదా? అన్న చర్చ జరుగుతుంది. ఇప్పటికే టీడీపీ నాయకత్వం ఆయనను దూరం పెట్టి మరీ వచ్చే ఎన్నికలకు ఆయనకు సత్తెనపల్లి నియోజకవర్గం టిక్కెట్ ఇచ్చేందుకు కూడా సిద్ధపడకపోవచ్చంటున్నారు. అందుకు అనేక కారణాలున్నాయని చెబుతున్నారు. కన్నా లక్ష్మీనారాయణ వయసు రీత్యానే కాకుండా ఇక జనంలో పెద్దగా తిరగలేని పరిస్థితి ఉంది. ప్రస్తుతం టీడీపీలో అంతా యువత మంత్రమే ప్రధానంగా వినిపిస్తుంది. ముఖ్యంగా టీడీపీకి పట్టున్న గుంటూరు జిల్లాలో టీడీపీ హైకమాండ్ ఎవరికి టిక్కెట్ ఇచ్చినా అది నిజంగా వారికి వరంగానే చెప్పాలి. సీనియర్ నేతగా, కాపు సామాజికవర్గంగా కన్నా లక్ష్మీనారాయణకు తిరుగులేదు. ఎందుకంటే ఒకప్పుడు కాపు సామాజికవర్గానికి కన్నాయే బ్రాండ్ అంబాసిడర్. అయితే జనసేన అధినేత పవన్ కల్యాణ్ రాజకీయాల్లోకి ఎంట్రీ ఇచ్చిన తర్వాత అదికూడా పోయింది. కాపు నేత అంటే ఇప్పుడు పవన్ కల్యాణ్ మాత్రమే ఆ సామాజికవర్గానికి కనపడుతున్నారు. ఇక జిల్లా కూడా కన్నా లక్ష్మీనారాయణకు ఇబ్బంది కరంగా మారింది. కమ్మ సామాజికవర్గం నేతలు ఎక్కువగా ఉన్న ఈ జిల్లాలో ప్రధానంగా టీడీపీలో ఉంటే జిల్లా పార్టీపై కూడా పట్టు చిక్కే అవకాశం లేదు. ఎందుకంటే సీనియర్ నేతలు ఎందరో ఈ జిల్లాల్లో పసుపు పార్టీలో ఉండటంతో పాటు వారి మాట చెల్లుబాటు అవుతుంది తప్పకన్నామాటను ఎవరూ ఖాతరు చేయరు. రాయపాటి సాంబశివరావు వంటి బలమైన నేతలనే వయసు ప్రభావంతో ఆయనను పార్టీ పక్కన పెట్టేసిన విషయాన్ని కొందరు గుర్తుచేస్తున్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేసిన కన్నా లక్ష్మీనారాయణ తర్వాత ఆ పదవీకాలం పూర్తికావడంతో పాటు తనకు రాజకీయ పదవులు ఏవీ దక్కవన్న నిర్ణయానికి వచ్చిన కన్నా 2024 ఎన్నికలకు ముందు టీడీపీలో చేరారు. అప్పటి క్యాలిక్యులేషన్స్ ప్రకారం కన్నా లక్ష్మీనారాయణకు సత్తెనపల్లి నియోజకవర్గం టిక్కెట్ ను పార్టీ ఇచ్చింది. గెలిచిన తర్వాత మంత్రి పదవి ఆశించినా, ఆయనకు దక్కకపోవడానికి అనేక కారణాలున్నాయి. సామాజికవర్గంతో పాటు జిల్లాలో అప్పటికే కీలక నేతలకు మంత్రి పదవులు దక్కడంతో కన్నా ఆశలు గల్లంతయ్యారు.... ఇకవచ్చే ఎన్నికల నాటికి కన్నా స్థానంలో కోడెల శివరాం పేరును ఖరారు చేసే అవకాశాలున్నాయని పార్టీ లో పెద్ద టాక్ నడుస్తుంది. ఎందుకంటే గుంటూరుజిల్లాలోకమ్మ సామాజికవర్గంలో కోడెల కుటుంబాన్ని రాజకీయంగా తొక్కేసిందన్న అభిప్రాయం బలంగా వినిపిస్తుంది. కోడెల శివప్రసాద్ కు పల్నాడుజిల్లాలో ఒక ప్రత్యేకమైన గుర్తింపు ఉంది. ఆయన చనిపోయిన తర్వాత కుటుంబాన్ని చేరదీయకపోవడంపై కమ్మ సామాజికవర్గంలో అగ్రస్థానం లో ఉన్న వారు కూడా అసంతృప్తి వ్యక్తం చేస్తుండటంతో వచ్చే ఎన్నికల్లో సత్తెనపల్లి టిక్కెట్ ను కోడెల శివరాంకు టిక్కెట్ ఇచ్చే అవకాశముందని చెబుతున్నారు. నియోజకవర్గాల పునర్విభజన జరిగి సంఖ్య పెరిగినా కూడా టీడీపీ వచ్చే ఎన్నికల్లో యువతకే ప్రాధాన్యత ఇవ్వాలన్న లక్ష్యంతో ఉందని,అందువల్ల కన్నా లక్ష్మీనారాయణకు సత్తెనపల్లి కూడా దూరం అవుతుందన్న కామెంట్స్ బలంగా వినపడుతున్నాయి. మరి కన్నా లక్ష్మీనారాయణ రాజకీయ భవిష్యత్ ఎలా ఉంటుందన్నది చూడాలి

# పేరంట్స్ ను వదిలేసిన వారికి బుద్ధిచెప్పిన ఆర్డీఓ

కడప, జూన్ 21

ఆస్తులు చేతికి వచ్చే వరకు అమ్మానాన్న ఆస్తులు చేతికి వచ్చిన తర్వాత మూసలోళ్లు చేతకాని వాళ్లు అయిపోతున్నారు. వృద్ధాప్యంలో వారిని సరిగా చూసుకోవాల్సిన బిడ్డలు పట్టించుకోని ఘటనలు చాలా చూశాం. అలాంటి బిడ్డలకు గట్టిగా బుద్ధి చెప్పారు జమ్మలమడుగు ఆర్డీవో సాయిశ్రీ. ఆస్తులు ఉన్నా లేకపోయినా కన్నవాళ్లను చూసుకోవడం పిల్లల బాధ్యత అని చెప్పుకొచ్చారామె. ప్రొద్దుటూరుకు చెందిన మాలేపాటి మోహన్‌రావు, గౌరమ్మ దంపతులు ఏదో చిన్న వ్యాపారం చేసి డబ్బులు కూడబెట్టారు. ఐదుగురు కుమార్తెలకు పెళ్లిళ్లు చేశారు. వయోభారంతో వ్యాపారం సాగడం లేదు. దీంతో దాన్ని ఆపేశారు. తమను సాకుతారన్న ఆశతో రంగయ్యగారి సత్రంవీధిలో ఉన్న ఇంటిని ఏడాది క్రితం పిల్లలకు రాసి ఇచ్చేశారు. ఈ మేరకు గిఫ్ట్ డీడ్ రాసి ఉంచారు. ఆస్తి తమ చేతికి రావడంతో కుమార్తెలు తమ నిజస్వరూపం చూపించారు. తమ పేరు మీద ఆస్తి వచ్చేసరికి తల్లిదండ్రులను పట్టించుకోవడం మానేశారు. తిండి కూడా పెట్టడం లేదు. వాళ్ల అనారోగ్య సమస్యలకు మందులు కూడా ఇవ్వకుండా హింసించారు. వేరే గత్యంతరం లేకపోవడంతో ఆ ముసలిదంపతులు స్వచ్ఛంద సంస్థలు, ఇరుగుపొరుగువారి సహాయంపై ఆధారపడ్డారు. వాళ్లు వేస్తే తినడం లేదంటే పస్తులు ఉంటున్నారు. ఇలా ఎన్నిరోజులు ఇబ్బంది పడటమో అర్థం కాకపోవడంతో ఆ దంపతులు ఇద్దరూ కొన్ని రోజుల క్రితం వృద్ధాశ్రమంలో చేరారు. అక్కడ చేరిన తర్వాత పిల్లలు పూర్తిగా పట్టించుకోవడం మానేశారు. కనీసం ఎలా ఉన్నారనే ధ్యాస కూడ లేకుండాపోయింది. ఎన్ని రకాలుగా విషయానని చేరవేసినా బిడ్డల ప్రవర్తనలో మార్పు రాలేదు. దీంతో కొందరి సలహా మేరకు ఉన్నతాధికారులను ఆశ్రయించారు మోహన్‌రావు, గౌరమ్మ దంపతులు. స్థానికంగా ఉన్న అధికారులతో మాట్లాడి విషయాన్ని ఆర్డీవోకు చేరవేశారు. మోహన్‌రావు, గౌరమ్మ దంపతులు విషాద గాథను విన్న ఆర్డీవో సాయిశ్రీ వెంటనే స్పందించారు. ఈ దంపతులతోపాటు వారి కుమార్తెలకు నోటీసులు జారీ చేశారు. అయినా వాళ్లు రాలేదు. ఫిబ్రవరి 22,మార్చి 12, 29, ఏప్రిల్ 19వ తేదీల్లో విచారణ జరిపారు. ఏ విచారణకి కూడా ఐదుగురు కుమార్తెల్లో ఒక్కరంటే ఒక్కరు కూడా రాలేదు. మోహన్‌రావు, గౌరమ్మ దంపతులపై తమ బిడ్డలకు ఏ మాత్రం ప్రేమ ఉందో తెలుసుకున్నారు అర్డీవో. వాళ్లను సరిగా చూసుకున్న ఆధారాలు కూడా లేకపోవడంతో కీలక నిర్ణయం తీసుకున్నారు. కుమార్తెలకు ఇచ్చిన గిఫ్ట్ డీడ్‌ను రద్దు చేస్తున్నట్టు తెలిపారు. తిరిగి ఆ ఇల్లు మోహన్‌రావు, గౌరమ్మ దంపతులకు దక్కేలా ఉత్తర్వులు జారీ చేశారు. అనంతరం ఆ పత్రాలను ఆ వృద్ధ దంపతులకు ఇచ్చారు.

## సింహాచలంలో ప్రముఖులు

సింహాచలం

ప్రముఖ పుణ్యక్షేత్రం సింహాచలం శ్రీ వరాహా నరసింహా స్వామిని రాష్ట్ర రోడ్లు భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి దర్శించుకున్నారు.మంత్రితో పాటు నేడు సింహాద్రి అప్పన్నను దర్శించు కున్న పలమనేరు ఎమ్మెల్యే అమ ర్నాథ్ రెడ్డి, గిద్దలూరు శాసనసభ్యు లు ముత్యపు అశోక్ రెడ్డి, భాష్యం ప్రవీణ్, పులవర్తి నాని, మారిటైమ్ బోర్డు చైర్మన్ దామచర్ల సత్య, కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి , యువరాజ్, ప్రసాద్, విశాఖ మేయర్ పీలా శ్రీనివాస్ రావు.శ్రీ వరాహ లక్ష్మీనర సింహ స్వామి వారిని దర్శించుకు న్నారు వీరికి ఆలయ కార్యనిర్వహణాధికారి వేంద్ర త్రినాథరావు డి ఈ ఓ రాధ సహాయ కార్య నిర్వహణ అధికారి రమణమూర్తి ప్రోటోకాల్ ఏఈఓ ఎన్. అనందకుమార్. ఆల య ప్రధాన అర్చకులు శ్రీనివాసచార్యులు, సీనియర్ సహాయకులు సూర్యనారాయణ ఆలయ పిఆర్ఓ నాయుడు వేద పండితులు నాదస్వర వేదమంత్రాలతో స్వాగతం పలికి ముందుగా స్వామివారి కప్ప స్తంభము ఆలింగనం చేసుకున్నారు. అనంతరం నాదస్వరలతో వేదమంత్రాలతో బేడా మండపము ప్రదక్షిణ తదుపరి స్వామివారి అంతరాలయ దర్శనం అనంతరము వేద పండితులచే వేద ఆశీర్వచనము ఇచ్చి ఆలయ కార్య నిర్వహణ అధికారి వేంద్ర త్రినాథ రావు స్వామివారి చిత్రపటం ప్రసాదాలను బహుకరించారు.

# ఏపీలో రఫ్ఫా..రఫ్ఫా రాజకీయాలు

విజయవాడ, జూన్ 21,

ఆంధ్రప్రదేశ్ లో ప్రస్తుతం రాజకీయాలు ప్రతి రోజూ హీటెక్కుతున్నాయి. ఎన్నికలయి ఏడాది పూర్తి కాక ముందే అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య మాటల యుద్ధం మొదలయింది. 2019లో టీడీపీ పార్టీ ఓడిపోయినప్పుడు కూడా ఇంతే.ఏడాదిలోనే అప్పుడు కూడా రాజకీయాలు వేడెక్కాయి. ఎన్నికల వరకూ కొనసాగాయి. ఇప్పుడు కూడా అదే పరిస్థితి కనిపిస్తుంది. తాజాగా మాజీ ముఖ్యమంత్రి పల్నాడు జిల్లా పర్యటనతో మరింత హీటెక్కాయి. రప్పా రప్పా రాజకీయాలు నడుస్తున్నాయి. పుష్ప సినిమాలో డైలాగులు నేరుగా పొలిటికల్ స్క్రీన్ పై ప్రత్యక్షమవుతున్నాయి. మాటల యుద్ధం మొదలయింది. ఇద్దరు ఎవరికి వారు తగ్గేదిలేదు అన్నట్లుగానే చంద్రబాబు, జగన్ వ్యవహరిస్తున్నారు. ప్రధానంగా యువతను ఆకట్టుకునేందుకు ఇలాంటి నినాదాలతో నేతలు ముందుకు వెళుతున్నారా? అన్నఅనుమానం అందిరిలోనూ కలుగుతుంది.జగన్ పల్నాడు జిల్లాలో పర్యటనలో ఇద్దరు మరణించారని, వారి మృతి జగన్ కారణమని టీడీపీ నేతలు అంటున్నారు. అయితే 2024 ఎన్నికలకు ముందు కందుకూరులో,గుంటూరులో తొక్కిసలాట జరిగి పదుల సంఖ్యలో అమాయకులు మరణించిన విషయాన్ని వైసీపీ నేతలు తమ సోషల్ మీడియా పోస్టుల ద్వారా గుర్తు చేస్తున్నారు. నాడు ఇరుకు సందుల్లో పెట్టి జనం వచ్చారని నమ్మించే ప్రయత్నం చేయబట్టే కందుకూరులో అంత మంది మరణించడానికి కారణమని నాడు అధికారంలో ఉన్న వైసీపీ చెప్పి రాష్ట్రమంతటా సభలు, సమావేశాలపై ఆంక్షలు విధిస్తే, నేడు జగన్ పర్యటనపై ఆంక్షలు విధిస్తూ మూడు వాహనాలకు, వందమందికిమించి వెళ్లడానికి వీలు లేదని చెబుతోంది. మానవతను పెంపొందించే సామూహిక ప్రక్రియ అధికారంలో ఎవరున్నా... నాడు జగన్ అయినా నేడు చంద్రబాబు అయినా ఒకటే లక్ష్యం. సభలకు, సమావేశాలకు, పర్యటనలకు ఎక్కువ మంది జనం వచ్చినట్లు కనపడితే అది సామాన్య ప్రజలపై ప్రభావం పడుతుందేమోనన్న ఆందోళన కట్టడి చేయడానికి కారణమంటున్నారు. ప్రధానంగా ప్రధాన మీడియా మరుగున పడిపోయి సోషల్ మీడియా విస్తృతంగా పెరిగిన నేటి కాలంలో పర్యటనలకు హైప్ రావడం ఇష్టం లేకనే ఇలాంటి అనవసర ఆంక్షలు పెడుతున్నారన్న కామెంట్స్ వినపడుతున్నాయి. నాడు జగన్ ఏపీలో రాజకీయ సభలు, సమావేశాలకు ఏకంగా ఒక జీవోను విడుదల చేశారు. దానిపై అప్పట్లో చంద్రబాబు న్యాయపోరాటం చేశారు.నేడు చంద్రబాబు ప్రభుత్వంలో కూడా అదేరకమైన ఆంక్షలు విధిస్తుండటంతో ఏపీ పాలిటిక్స్ నిజంగానే రప్పా రప్పాగానే నడుస్తున్నాయంటున్నారు. ఇద్దరిలో ఎవరూ సుద్దపూసలు కాదు. పుణ్యాత్ములు కాదన్నది సామాన్యుల మాటగా వినిపిస్తుంది. ఇక వైసీపీ అధికారంలోకి రాగానే జాతరలో పొట్టేళ్లను నరికినట్లు రప్పారప్పా నరికేస్తామంటూ జగన్ పల్నాడు పర్యటనలో ఫ్లెక్సీలు వెలిశాయి.అయితే ఆ ఫ్లెక్సీపట్టుకుంది గతంలో టీడీపీ కార్యకర్త అని వైసీపీనేతలు చెబుతున్నారు. అసలు రప్పా రప్పా అంటూ పుష్పసినిమాడైలాగు చెబితే తప్పేంటి.. అడ్డంగా తల అటు ఇటూ ఊపినా కేసులు పెట్టడం కామన్ అయిందని వైసీపీ అధినేత జగన్ వ్యాఖ్యానించారు. ఇదేమి రాజకీయం అంటూ ప్రశ్నించారు. దీనికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కౌంటర్ ఇస్తూ నాయకులకు హుందాతనం ఉండాలని, ఒకవైపు యోగా డే వేడుకలు జరుగుతుంటే మరికొందరు రప్పా రప్పా అంటున్నారన్నానిఎద్దేవా చేశారు. ఒకప్పుడు ఊళ్లలో గ్రామ దేవతలకు పొట్టేళ్లను బలి ఇచ్చేటప్పుడు రప్పా రప్పా అనేవారని, ఇష్టానుసారంగా టెర్రరిజం క్రియేట్ చేస్తే ఊరుకోబోమని చంద్రబాబు స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. దీంతో మొత్తం మీద ఏపీలో రప్పా రప్పారాజకీయం ఎటువైపు దారి తీస్తుందోచూడాలి.

## యోగా మన పురాతన వారసత్వ సంపద..

### ఆత్మను, శరీరాన్ని ఏకం చేసే కార్యం యోగాను పాటిద్దాం యువతను, విద్యార్థులకు మాజీ పార్లమెంట్ సభ్యులు బూర నర్సయ్య గౌడ్ పిలుపు

ఇబ్రహీంపట్నం జూన్ 21

యోగా మన పురాతన వారసత్వ సంపద అని, ఆత్మను, శరీరాన్ని ఏకం చేసే కార్యం యోగాను పాటిద్దాం అని బువనగిరి మాజీ పార్లమెంట్ సభ్యులు బూర నర్సయ్య గౌడ్ పిలుపు నిచ్చారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గం తుర్కంజల్ మున్సిపాలిటీలోని శాంతినికేతన్ స్కూల్ గ్రౌండ్‌లో నిర్వహించిన 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన యువతను, విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ శారీరక మానసిక ఒత్తిడిని తగ్గించే యోగాను నిత్యం ఆచరిస్తు ప్రపంచానికి మన సంస్కృతి యొక్క గొప్పతనాన్ని చాటుదామన్నారు. ×"యోగత్ ఆరోగ్యం భవతి"×యోగా అనేది మనసు, శరీరం మరియు ఆత్మను సమతుల్యం చేసే దివ్య సాధనం. భగవద్గీతలో శ్రీకృష్ణుడు "సమత్వం యోగ ఉచ్యతే" (2.48) అని, సమతుల్యతే యోగమని ఉపదేశించారు. కర్మ యోగ, జ్ఞాన యోగ, భక్తి యోగ, ధ్యాన యోగల ద్వారా జీవితంలో శాంతి, స్థిరత్వం మరియు ఆరోగ్యాన్ని సాధించవచ్చని గీత సూచిస్తుందన్నారు.ప్రతిరోజూ యోగాసనాలు, ప్రాణాయామం, ధ్యానం సాధన ద్వారా ఒత్తిడిని అధిగమించి, ఆరోగ్యాన్ని పెంపొందించుకోవచ్చు. ముఖ్యంగా యువత, విద్యార్థులు ఆరోగ్యం, మానసిక ఏకాగ్రత మరియు ఉన్నత లక్ష్యాల సాధన కోసం యోగాన్ని అలవరచుకోవాలని కోరాను.ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నిరంతర కృషి ఫలితంగా యోగా ఈ రోజు ప్రపంచవ్యాప్త ఉద్యమంగా మారి, గ్లోబల్ హార్మోనీ మరియు శాంతికి సాధనంగా రూపొందిందన్నారు.

# లోకల్ బాడీ ఎలక్షన్స్ కు ప్రిపేర్...

ఏలూరు, జూన్ 21, (న్యూస్ పల్స్)

ఆంధ్రప్రదేశ్ లో రాజకీయాలు మామూలుగా లేవు. ఇక వచ్చే ఏడాది స్థానిక సంస్థల ఎన్నికలు జరిగే అవకాశాలున్నాయి. మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు, పంచాయతీలు ఇలా స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో కూటమి పార్టీలు, వైసీపీ అమితుమీ తేల్చుకోవడానికి సిద్ధమయ్యాయి. పంచాయతీ ఎన్నికలకు సంబంధించి పెద్దగా ఇబ్బంది ఉండదు. అందులో పార్టీ సింబల్ ఉండదు. కాకపోతే పార్టీ బలపర్చిన అభ్యర్థులే గెలిచి సర్పంచ్, ఉప సర్పంచ్ లుగా ఎన్నికవుతారు. మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల్లో మాత్రం ఖచ్చితంగా పార్టీ సింబల్ ఉండటం, బీఫారాలు కూడా ఉండటంతో వీటి ఫలితాలు అధికార, విపక్ష పార్టీలు రాజకీయాలపై ఒక అంచనాకు వచ్చేందుకు అవకాశముంటుంది. సహజంగానే అధికార పార్టీకి... స్థానిక సంస్థల ఎన్నికలు సహజంగా అధికార పార్టీకి అనుకూలంగా ఉంటాయి. మరో నాలుగేళ్లు అధికారంలో ఉండటంతో అధికార పార్టీ వైపు ప్రజలు కూడా మొగ్గు చూపుతారు. అధికార పార్టీకి చెందిన వారు ఎన్నికయితే తమ సమస్యలను పరిష్కరిస్తారని భావించి అటు వైపు చూస్తారు. అయితే ఏపీ రాజకీయాలను నమ్మలేం. ప్రజల్లో ఉన్న అసంతృప్తి, సంతృప్తి పాళ్లను కొలమానంగా దీనిని పరిగణనలోకి తీసుకోవడానికి కూడా వీలులేదు. వైసీపీ హయాంలో జరిగిన స్థానికసంస్థల ఎన్నికల్లో ప్రజలు వైసీపీ వైపు మొగ్గు చూపారు. దాదాపు అన్ని కార్పొరేషన్లను వైసీపీ కైవసం చేసుకుంది. మున్సిపాలిటీల్లో తాడిపత్రి మినహాయిస్తే అన్నింటిని ఫ్యాన్ పార్టీ గెలుచుకుంది. పంచాయతీలంటే వైసీపీ అనుకూలురే ఎన్నికయ్యారు... మానవతను పెంపొందించే సామూహిక ప్రక్రియ వైసీపీ, టీడీపీ నేతల ధీమా.... అయితే ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడంతో ప్రజలు అధికార పార్టీకి బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని వైసీపీ నేతలు చెబుతున్నారు. ఈ ఫలితాలతో కూటమి ప్రభుత్వం తేలిపోవడం ఖాయమని ధీమాగా ఉన్నారు. కానీ టీడీపీ నేతల్లో ఏ మాత్రం బెరుకు, భయం లేదు. ఇప్పటికే సూపర్ సిక్స్ హామీల్లో ఎక్కువ భాగం అమలుచేయడంతో పాటు ఇంకా కొన్నింటిని అమలు చేయడానికి రెడీ అవుతుండటంతో ఎన్నికల సమయానికి తమకు గ్రౌండ్ అనుకూలంగా మారుతుందని టీడీపీ నేతలు లెక్కలు వేసుకుంటు?న్నారు. ఎమ్మెల్యేలు, మంత్రులు తమ నియోజకవర్గం, జిల్లాల పరిధిలో ప్రతిష్టాత్మకంగా తీసుకోవడంతో క్లీన్ స్వీప్ చేస్తామన్న నమ్మకం పసుపు పార్టీ నేతల్లో ఉంది. అనేక అంశాలు ప్రభావితంచేసే... కానీ అనేక అంశాలు స్థానిక సంస్థల ఎన్నికల్లో పనిచేస్తాయని చెప్పక తప్పదు. ఇచ్చిన హామీలు అమలయిన వారు హ్యాపీగా ఉంటారు. అమలు కాని వారు అసంతృప్తిగా ఉంటారు. పథకాలు దక్కని వారు ఖచ్చితంగా అధికార పార్టీపై అసహనంతో ఉంటారు. దక్కిన వారు మళ్లీ అధికార పార్టీ గుర్తుపైనే ఓటేస్తారు. అయితే అధికారంలో ఉన్న పార్టీ ఏ మేరకు పథకాలను అందించింది? ఎంత అభివృద్ధి ఆ ప్రాంతంలో ఈ ఏడాదిలో సాధించింది? అన్న దానిపైనే ఎక్కువగా స్థానికసంస్థల ఫలితాలు ఆధారపడి ఉంటాయి. మరొక వైపు అధికార పార్టీకి ఎటూ అధికారం అడ్వాంటేజీగా ఉంటుంది. అందుకే వచ్చే ఏడాది జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు జనం నుంచి సౌండ్ ఎలా వస్తుందన్నది చూడాల్సి ఉంది. అయితే ఈ ఫలితాలు సాధారణ ఎన్నికలకు ప్రభావితం చేయలేవని స్పష్టంగా చెప్పొచ్చు. ఎందుకంటే నాలుగేళ్ల సమయం ఉంది కాబట్టి.

# కంట్రోల్ చేస్తున్నారా... రెచ్చగొడుతున్నారా...

గుంటూరు, జూన్ 21,

గంగమ్మ జాతరలో వేటలను నరికినట్లు రప్ప రప్ప నరుకుతాం.. ఆ మధ్యెప్పుడో అల్లు అర్జున్ చెప్పిన డైలాగ్.. నిన్న జగన్ మోహనరెడ్డి పర్యటనలో ఫ్లెక్సీల్లో చూశాం.. మళ్లీ ఇవాళ అదే జగన్ మోహనరెడ్డి చెబితే కూడా విన్నాం. ఆయన చెప్పిన డైలాగులు.. తమ కార్యకర్తలకు, హార్డ్‌కోర్ అభిమానలకు ఊపునిస్తుందేమో కానీ.. మామూలు జనానికి మాత్రం ఆయన స్థాయికి తగనిది అనిపించింది. వైసీపీలో కూడా కొంతమంది ఇక మీారు మారరా.. జగన్ సార్ అంటూ ప్రశ్నించడం కనిపించింది.ఏడాది కిందట చనిపోయిన కార్యకర్త కుటుంబాన్ని పరామర్శించడానికి బుధవారం పల్నాడు పరామర్శ యాత్ర చేసిన వైసీపీ అధినేత జగన్ రేపు సినిమా చూపిస్తానంటూ.. అక్కడ వ్యాఖ్యలు చేశారు. అన్నట్లుగానే ఆయన ఇవాళ సినిమా చూపించేశారు. ఓ సినిమా అంతసేపు సాగిన రెండు గంటల ప్రెస్‌మీట్‌లో అల్లు అర్జున్‌లా అభినయం కూడా చేశారు. రప్ప.. రప్పమని నరుకుతామని మా వాళ్లు సరదా పడితే తప్పేంటని ప్రశ్నించారు. జగన్ మోహనరెడ్డి ఈ మధ్య కాలంలో ప్రజల్లోకి ఎక్కువుగా వస్తున్నారు. పర్యటనలు కూడా బాగానే చేస్తున్నారు. అయితే ఈ పర్యటనల్లో కార్యకర్తల ఉత్సాహం శృతి మించుతోంది. పెద్ద సంఖ్యలో ఆయన్ను చూడటానికి వస్తున్న కార్యకర్తలు కొంత ఆవేశాన్ని ప్రదర్శిస్తున్నారు. జగన్ తెనాలి, పొదిలి పర్యటనల్లో అలాగే జరిగింది. నిన్న పల్నాడు జిల్లా సత్తెనపల్లిలోని రెంటపాళ్ల తమ కార్యకర్త విగ్రహావిష్కరణ పర్యటనలో ఇది ఉత్సాహం మరింత ముదిరింది. ఈ సారి ఏకంగా టీడీపీ కార్యకర్తలను హెచ్చరిస్తూ.. చాలా మంది ప్లకార్డులు, ఫ్లెక్సీలను పట్టుకుని వచ్చారు. తొక్కి పడేస్తాం.. రప్ప.. రప్ప నరికేస్తాం.. అంటూ ఉన్న ఫ్లెక్సిలు సోషల్ మీడియాలో బాగా వైరల్ అయ్యాయి. అలాంటి ఫ్లెక్సి పట్టుకున్న రవితేజ అనే వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు తన పర్యటన సందర్భంగా నమోదు అవుతున్న కేసులపై వైఎస్ఆర్‌సీపీ అధినేత జగన్ ఆగ్రహం వ్యక్తంచేశారు. ఫ్లెక్సీలు ప్రదర్శించిన వారిపై కేసులు గురించి జగన్ ప్రెస్‌మీట్ లో ప్రస్తావనకు వచ్చింది. దానిపై ఆయన స్పందించిన తీరు ఎలా ఉందో చూడండి..ఈ మొత్తం విషయాన్ని చూస్తే దీనిపై జగన్ ఎలా రియాక్ట్ అవ్వాలో ముందుగానే ప్రిపేర్ అయినట్లుగా కూడా అనిపిస్తుంది. ఫ్లెక్సీలో ఉన్న డైలాగ్‌ను జర్నిస్టులతో బిగ్గరకా అనిపించడమే కాకుండా.. ఆయన కూడా పలికి.. అదొాక సినిమా డైలాగ్ అని అలా అంటే తప్పేంటని అంటున్నారు. జగన్ గారు.. మీారు 16 ఏళ్ల నుంచి ప్రతక్ష రాజకీయాల్లో ఉన్నారు? ఐదేళ్లు ముఖ్యమంత్రి.. మరో ఐదేళ్లు ప్రతిపక్షనేత.. ఓ పెద్ద పార్టీకి నేతృత్వం వహిస్తున్నారు. కార్యకర్తల్లో ఉత్సాహం ఉండటం సహజమే.. వాళ్లని ఉత్తేజితుల్ని చేయడానికి ఇంకేదైనా మాట్లాడటం కూడా మంచిదే.. కానీ.. ఇలా హింసాత్మక ఘటనలు ప్రేరేపించేలా.. ఓ కార్యకర్త చేసిన పనిని ఓ సినిమా డైలాగుతో వత్తాసు పలకడం కరెక్టేనా.. అదొాక సినిమా డైలాగ్ అని సింపుల్‌గా తీసేసే విషయమా..? అయితే పోలీసులు అరెస్ట్ చేసిన వ్యక్తి తెలుగుదేశానికి చెందిన వాడేనని అతనికి పార్టీ సభ్యత్వం కూడా ఉందని వైఎస్సార్సీపీ ఆరోపించింది. ఈ విషయాన్ని జగన్ ముందు ప్రస్తావించినప్పుడు.. అంటే తెలుగుదేశం వాళ్లు కూడా ఆ రేంజ్‌లో చంద్రబాబును తిడుతున్నారు అన్నారు. అయితే టీడీపీ మాత్రం అరెస్టైన యువకుడు వైసీపీ సానుభూతిపరుడే అని.. కేవలం టీడీపీ కార్యకర్తలకు వచ్చే జీవితబీమా పాలసీని పొందడానికి కార్డు తీసుకున్నాడని వివరణ ఇచ్చింది. అతను ఏ పార్టీ వ్యక్తి అయినప్పటికీ ఆ వ్యాఖ్యలు సమర్థించదగ్గవైతే కాదు. కార్యకర్తల దూకుడుని జగన్ సమర్థిస్తున్నారా.. లేక మరింత రెచ్చగొడుతున్నారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆయన వైఖరిని చూసిన తర్వాతే వాళ్లు మరింతగా రెచ్చిపోతున్నట్లుగా ఉంది. కార్యకర్తలను కాపాడుకోవడానికి.. వాళ్ల అరెస్టును తప్పు పట్టడాన్ని ఎవ్వరూ తప్పనరు. కానీ ఈ వ్యాఖ్యలను సమర్థించడం ఎంత వరకూ సబబు.. ఇప్పుడే కాదు. జగన్ మోహనరెడ్డి వ్యవహారశైలి ఇంతకు ముందు కూడా ఇలాగే ఉంది. తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంపై దాడి జరిగి చాలా మందికి గాయాలైతే.. నా మీద అభిమానం ఉన్నోళ్లు చేసి ఉంటారులే అన్నారు.తెనాలిలో ఘటన విషయంలో వైసీపీ రాజకీయంగా ఓ స్టాండ్ తీసుకుని ఉండొచ్చు... ఆ విషయంలో పోలీసుల తప్పు ఉండొచ్చు కానీ.. ఆ మొత్తం వ్యవహారాన్ని జగన్ ప్రొజెక్టు చేసిన తీరు.. ఆయన పర్యటన.. ఆయనకు సంపూర్ణ ఆమోదాన్ని ఇవ్వలేదు. తెనాలి యువకులపై రౌడీషీట్లు ఉండటం.. వాళ్లు చేసిన పనులు సోషల్ మీడియాలో వైరల్ అవ్వడంతో రౌడీషీటర్లకు, గంజాయి బ్యాచ్‌కు మద్దతిస్తున్నారన్నట్లుగా ఆ వ్యవహారంపై కామెంట్లు వచ్చాయిజగన్ ఒక్కరే అలాగే వ్యవహరిస్తున్నారా.. మిగిలన వాళ్లు తీవ్ర వ్యాఖ్యలు చేయడం లేదా.. అనొచ్చు.. కానీ.. ఈ స్థాయిలో సమర్థనలు లేవు. చంద్రబాబు, లోకేష్ కూడా పలుమార్లు పోలీసులను ఉద్దేశించి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. లోకేష్ ఎన్నికలకు ముందు చేసిన ప్రసంగాలు చాలా వరకూ పోలీసుల విషయంలో బెదిరింపు ధోరణిలోనే ఉండేవి. అయితే తప్పు చేసిన పోలీసుల గురించే అని ఆయన వివరణ ఇచ్చారు. జగన్ మోహనరెడ్డి కూడా మొదట్లో పోలీసుల గురించ అంతకంటే తీవ్రమైన వ్యాఖ్యలు చేశారు. ఓ దశలో గుడ్డలూడదీసి కొట్టిస్తాం అని కూడా కామెంట్లు చేశారు. కానీ ఆ తర్వాత కాస్త తగ్గి తప్పు చేసిన పోలీసుల గురించి అంటూ.. సవరించుకున్నారు. ఏమైనా .జగన్ సమర్థనపై మాత్రం అంత సానుకూలత అయితే రావడం లేదు.

## యాక్సిడెంట్ జోన్ ప్రాంతాన్ని పరిశీలించిన మంత్రి ఆనం

ఆత్మకూరు జూన్ 21,

ఆత్మకూరు జాతీయ రహదారి నుంచి అనుసముద్రంపేటకు వెళ్లే రోడ్డు దర్గా ఆర్చి వద్ద యాక్సిడెంట్ జోన్ ప్రాంతాన్ని దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో నేషనల్ హైవే అథారిటీ, ఆర్ అండ్ బి, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదాలను అధికారులు మంత్రికి వివరించారు. భవిష్యత్తులో ఎటువంటి ప్రమాదాలు జరగకుండా చేపట్టాల్సిన అన్ని ముందస్తు చర్యలపై అధికారులతో మంత్రి చర్చించారుఏ. దర్గా రోడ్డులో స్పీడ్ బ్రేకర్లు, జాతీయ రహదారిపై వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు చర్యలు చేపట్టాలని, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారుఏ.

## దమ్మాయిగూడ లో ఇంటర్నేషనల్ యోగ దినోత్సవం ముఖ్య అతిధిగా మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి.

మేడ్చల్ జూన్ 21,

ఇంటర్నేషనల్ యోగ దినోత్సవం సందర్భంగా మేడ్చల్ జిల్లా దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలోని శ్రీ సాయి భవాని ఫంక్షన్ హాల్ లో హత యోగ ఆశ్రమం స్థాపకులు శంకర చారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఇంటర్నేషనల్ యోగ దినోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా మేడ్చల్ నియోజకవర్గం ఎమ్మెల్యే మల్లారెడ్డి, మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి వజ్రేష్ యాదవ్ స్థానిక నాయకులు, జవహర్ నగర్ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శరీర దృఢత్వానికి మానసిక ఉల్లాసనికి యోగ చాలా అవసరమని యోగ చేయడం వల్ల మనుషులు ఎక్కువ కాలం బ్రతికే ఆవకాశం ఉంటుందని అన్నారు.అదేవిధంగా యోగతో పాటు సరైన ఆహారం తీసుకోవాలని తెలిపారు.

## డిఐతో పాటు ఇద్దరు పోలీసులపై వేటు

సికింద్రాబాద్

మహంకాళి డిఐ వై కె ప్రసాద్ తో పాటు మరో ఇద్దరూ కానిస్టేబుల్స్ లు సస్పెండ్ అయ్యారు. హవాలా మనీ పట్టుకోని డబ్బులు డిమాండ్ చేసారు. నిందితులనుంచి ఆరు 6 లక్షలు డిఐ,కానిస్టేబుల్స్ వసూలు చేసారు. బాధితులు ఉన్నత అధికారులకు ఫిర్యాదు చేయడంతో డిఐ ప్రసాద్,కానిస్టేబుల్ శ్యామ్,మహేష్ లును సిపి సివి అనంద్ సస్పెండ్ చేసారు.

## రైతు భరోసా కోసం బీఆర్ఎస్ మహా ధర్నా

పటాన్ చెరు

సంగారెడ్డి జిల్లా పటాన్ చెరు నియోజకవర్గంలో నాలుగు మండలాలకు రైతు భరోసా నిధులను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బిఆర్ఎస్ పార్టి నియోజకవర్గ ఇన్చార్జ్ ఆదర్శ్ రెడ్డి ఆధ్వర్యంలో జిన్నారం మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద మహాధర్నా నిర్వహించారు.

మహాధర్నా కార్యక్రమానికి మాజీ మంత్రి సిద్దిపేట శాసన సభ్యులు తన్నీరు హరీశ్ రావు, ఎమ్మెల్యే చింత ప్రభాకర్, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి, జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్ రావు,మాజీ ఎమ్మెల్సీ యాదవరెడ్డి తదితరులు హాజరయ్యారు.

## స్కూల్ వ్యాన్ కిందపడి బాలుడు మృతి

మేడ్చల్

జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆల్విన్ కాలనీలో తులసి నగర్ స్కూల్ బస్సు కింద పడ్డ పది సంవత్సరాల బాలుడు మృతి చెందాడు.

జయశిత్ చౌహాన్ (10) సైకిల్ తొక్కుతూ ప్రమాదవశాత్తు కింద పడిపోవడంతో బాలుడిపైకి స్కూల్ బస్సు ఎక్కింది. గోకుల్ ఫ్లాట్స్ కి చెందిన క్వాంటం లీప్ స్కూల్ బస్సు గా స్థానికులు గుర్తించారు. మృతుని తండ్రి ముఖేష్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం గత 35 సంవత్సరాలుగా కూకట్ పల్లి ఆల్విన్ కాలనీ లోని తులసి నగర్ లో నివాసం ఉంటున్నారు. కాగా నిన్న సాయంత్రం అతని కుమారుడు జైషిద్ చౌహాన్ సైకిల్ తొక్కుతూ ఆడుకుంటున్న క్రమంలో ప్రమాద వశాత్తూ బస్సు కింద పడడంతో హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. ప్రమాదం జరిగినప్పుడు జైహింద్ చౌహన్ వెన్నెముక విరిగిపోయిందని తెలుపగా వేరే హాస్పిటల్ తీసుకువెళ్ళే క్రమంలో అతను చనిపోయాడని, తన బాబు మరణానికి కారణమైన వారికి తగిన శిక్షపడేలా చేయమని వాపోయాడు.

## సుబేదారి పోలీసు స్టేషన్ కు చేరకున్న బీఆర్ఎస్ లీగల్ టీం

వరంగల్

బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌషిక్ రెడ్డి వున్న వరంగల్ సుబేదారి పోలీసు స్టేషన్ కు బిఆర్ఎస్ లీగల్ టీమ్ చేరుకుంది. శనివారం ఉదయం అదుపులోకి తీసుకున్న పోలీసులు కౌశిక్ రెడ్డిని కోర్టుకు హాజరుపరిచేందుకు ప్రాసెస్ చేస్తున్నారు. వైద్య పరీక్షల కోసం ఎంజిఎం తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. బీఆర్ఎస్ లీగల్ టీం వచ్చాక వైద్య పరీక్షలకు తీసుకెళ్లాలని పోలీసులను కౌశిక్ రెడ్డి కోరినట్లు సమాచారం.

==========================

# ఐదు ఆలయాలకు కల్తీ నెయ్యి...

తిరుమల, జూన్ 21, (న్యూస్ పల్స్)

తిరుమలలోలడ్డు వివాదం ప్రకంపనలకు దారి తీసిన సంగతి తెలిసిందే. తిరుమల లడ్డూ తయారీలో వినియోగించే నెయ్యి కల్తీ జరిగిందన్న అనుమానాలు ఉన్నాయి. వైయస్సార్ కాంగ్రెస్ హయాంలో నెయ్యిలో జంతు కొవ్వు కలిపారు అన్న ఆరోపణలు వచ్చాయి... దీనిపై ప్రత్యేక దర్యాప్తు బృందం విచారణ చేపడుతోంది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ అధికారుల సంయుక్తంగా ఏర్పాటైన ఈ బృందం విచారణను ప్రారంభించింది. అయితే ఈ దర్యాప్తులో సంచలన విషయాలు బయటకు వస్తున్నాయి. ముఖ్యంగా ఉత్తరాఖండ్ కు చెందిన బోలె బాబా డెయిరీ అక్రమాలు బయటపడ్డాయి. తిరుపతిలోని ఓ చిన్న డెయిరీ ద్వారా రాష్ట్రంలోని ప్రముఖ దేవాలయాలకు కల్తీ నెయ్యిని సరఫరా చేసినట్లు అధికారులు గుర్తించారు. ఒక్క తిరుమలకే కాదు శ్రీకాళహస్తి, కాణిపాకం, విజయవాడ దుర్గమ్మ, శ్రీశైలం, ద్వారకా తిరుమల వంటి దేవాలయాలకు కూడా ఈ కల్తీ నెయ్యి సరఫరా జరిగిందని తాజాగా తేలింది. తిరుపతిలోని డైరీకి కమిషన్లు చెల్లించి.. ఆ కంపెనీ పేరుతో కల్తీ నెయ్యిని దేవాలయాలకు పంపినట్లు తేలిందని సమాచారం.కేవలం టీటీడీకి మాత్రమే కల్తీ నెయ్యి సరఫరా చేసినట్లు అంతా భావించారు. కానీ ఇప్పుడు ఇతర దేవాలయాలకు సైతం సరఫరా జరిగినట్లు గుర్తించడం ఆందోళన కలిగిస్తోంది. మరోవైపు నెల్లూరు ఏసీబీ కోర్టులో భోలే బాబా డైరీ జనరల్ మేనేజర్ హరి మోహన్ రానా మూడోసారి బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. కోర్టు విచారణ చేపట్టగా ఏపీపీ వాదనలు వినిపించారు. హరి మోహన్ ఈ ఎపిసోడ్ లో సూత్రధారి అని.. బయటకు వస్తే సాక్షాధారాలు మాయం చేస్తారని.. సాక్షులను ప్రభావితం చేసే అవకాశం ఉందని ఏపీపీ వాదించారు. ఈ వాదనతో ఏకీభవించిన న్యాయమూర్తి బెయిల్ పిటిషన్ తిరస్కరించారు. ఈ సందర్భంగానే కేవలం తిరుమల కే కాదు.. అన్ని దేవాలయాలకు సరఫరా చేసిన నెయ్యి కల్తీ జరిగిందని తెలుస్తుండడం మాత్రం ఆందోళన కలిగిస్తోంది.తిరుమలలో వైసిపి హయాంలో నెయ్యిలో కల్తీ జరిగిందని సీఎం చంద్రబాబు బయటపెట్టారు. అటు తరువాత ఈ వివాదం దేశవ్యాప్తంగా సంచలనంగా మారింది. వైయస్సార్ కాంగ్రెస్ ఇరుకున పడింది. దీంతో ఈ కేసు విచారణను సిబిఐకి అప్పగించాలని కోరుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక దర్యాప్తు బృందం పై అభ్యంతరాలు వ్యక్తం చేసింది. దీంతో అత్యున్నత న్యాయస్థానం సిబిఐ అధికారి నేతృత్వంలో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల అధికారులతో దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేసింది. గత కొద్ది రోజులుగా ఈ బృందం తిరుమలను వేదికగా చేసుకుని దర్యాప్తు చేస్తూ వస్తోంది. ఈ దర్యాప్తు నివేదికను సుప్రీంకోర్టుకు నివేదించే అవకాశం ఉంది. అయితే కచ్చితంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని ఇరుకున పెట్టే ప్రయత్నం జరుగుతుందని ఆ పార్టీ శ్రేణులు భావిస్తున్నాయి.

# పటాన్ చెరు మైత్రి మైదానంలో యోగా దినోత్సం పాల్గొన్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

సంగారెడ్డి

అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని పటాన్ చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి ఆధ్వర్యంలో పట్టణంలోని మైత్రి మైదానంలో నిర్వహించిన యోగా దినోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. పటాన్ చెరు చరిత్రలోనే మొట్ట మొదటిసారి వేలాదిమందితో కలిసి సామూహిక యోగా కార్యక్రమం నిర్వహించారు. ఉదయం 7 నుండి 09:00 గంటల వరకు పతాంజలి యోగ సమితి శిక్షకుల సౌజన్యంతో రెండున్నర గంటల పాటు వివిధ రకాల యోగా భంగిమలు ప్రదర్శిస్తూ ప్రతి ఒక్కరిని భాగస్వాములు అయ్యేలా కార్యక్రమాన్ని నిర్వహించారు. యోగ ప్రాముఖ్యతను తమ ఆసనాల ద్వారా వివరిస్తూ సంపూర్ణమైన ఆరోగ్య జీవనశైలికి యోగ ఏ విధంగా ఉపయోగపడుతుందో వివరించారు. ఈ సందర్భంగా పటాన్ చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో మనిషి తన ఆరోగ్యం పై దృష్టి పెట్టకపోవడం మూలంగా మానసిక, శారీరక సమస్యలతో నిరంతరం బాధపడుతూ అనారోగ్యకరమైన జీవితాలను కొనసాగిస్తున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని నియోజకవర్గంలోని ప్రజలకు యోగ ప్రాముఖ్యతను తెలియజేయాలన్న సమున్నత లక్ష్యంతో మైత్రి మైదానంలో యోగ దినోత్సవ వేడుకలు నిర్వహించడం జరిగిందని తెలిపారు. మనిషి నిత్యం ఎదుర్కొనే మానసిక, ఆరోగ్య సమస్యలకు సర్వరోగ నివారిని యోగ అని అన్నారు. యోగాకు కులం మతం ప్రాంతం జాతి లేదని, ప్రతి ఒక్కరి జీవితంలో ఒక భాగమని తెలిపారు. యావత్తు ప్రపంచానికి భారతదేశం అందించిన మహోన్నత సాధనం యోగ అని అన్నారు. ఈ కార్యక్రమాల్లో పటాన్ చెరు డిఎస్పి ప్రభాకర్, భారత్ స్వాభిమాన్ అధ్యక్షులు శ్రీధర్ రావు, పతంజలి యోగాసమితి రాష్ట్ర అధ్యక్షులు పస్పురి శివుడు, యోగ గురువు శివకుమార్, తాజా మాజీ ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల కరస్పాండెంట్లు, ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు, క్రీడాకారులు, తదితరులు పాల్గొన్నారు.

## సీఎంవో కేంద్రంగానే ఫోన్ ట్యాపింగ్

హైదరాబాద్, జూన్ 21,

గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో కాంగ్రెస్, బీజేపీ నేతల ఫోన్లతో పాటు సినీ నటులు, రియల్ ఎస్టేట్, జడ్జిల ఫోన్లు ట్యాప్ అయ్యాయని ఆరోపణలున్నాయి. కేంద్ర మంత్రి బండి సంజయ్ ఫోన్ సైతం ట్యాపింగ్ అయిందని బయటకు వచ్చింది. ఈ క్రమంలో సిట్ ఫోన్ కాల్ పై కేంద్ర మంత్రి బండి సంజయ్ స్పందించారు. తనకు సిట్ నుంచి ఫోన్ కాల్ వచ్చిందని, త్వరలో విచారణకు హాజరవుతానని స్పష్టం చేశారు. ఫోన్ ట్యాపింగ్ పై అందరి కంటే ముందు అరోపణలు చేసింది తానే అన్నారు.

## ఇంజనీరింగ్ అడ్మిషన్ల పై అవగాహన సదస్సు

హైదరాబాద్ జూన్ 21,

ప్రస్తుత సమాజంలో తల్లిదండ్రులు వారి పిల్లలకు డబ్బులు సంపాదించి ఇస్తున్నారు తప్ప వారితో సమయాన్ని గడపడం లేదంటూ వ్యాఖ్యానించారు ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకృష్ణ రెడ్డి. నేడు జేఎన్టీయూ యూనివర్సిటీలో ఇంజనీరింగ్ అడ్మిషన్లకు సంబంధించి తెలంగాణ ఉన్నత విద్యా మండలి మరియు జేఎన్టీయూ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఉన్నత విద్యా మండలి చైర్మన్ బాలక్రిష్ణ రెడ్డి, యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ కిషన్ కుమార్ రెడ్డి హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎప్ సెట్ లో విద్యార్థులకు వచ్చిన ర్యాంకులకు అనుగుణంగా వారు ఎన్నుకోవలసిన బ్రాంచ్ లతో పాటు కళాశాలలకు సంబంధించి ఉన్న సందేహాలను నివృత్తి చేసేందుకే ఈ వేదికను ఏర్పాటు చేసినట్లు బాలకృష్ణారెడ్డి తెలిపారు. ప్రస్తుతం ఇంజనీరింగ్ అంటే కంప్యూటర్ సైన్స్ అనేలా ముద్ర పడిపోయిందని దానికి అనుగుణంగా ఉన్న కోర్ బ్రాంచెస్ లో కూడా అవకాశాలు ఎన్నో ఉన్నాయని దాని వైపు కూడా విద్యార్థులు తల్లిదండ్రులు చూడాలని అన్నారు. వెబ్ ఆప్షన్ల నమోదు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలను వారికి వివరించారు. అదేవిధంగా ఇండస్ట్రీ ఇంట్రక్షన్ ప్రతినిధులు సైతం హాజరై ఉద్యోగ అవకాశాలు ఎలా ఉంటాయని దానిపైన సూచనలు చేశారు.

## నిత్యజీవితంలో ప్రతి ఒక్కరూ యోగ ఆసనాలు చేయాలి తెలంగాణ శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్.

వికారాబాద్

నిత్య జీవితంలో చిన్న, పెద్ద అనే తేడా లేకుండా ప్రతిరోజు యోగాసనాలు చేయడం వల్ల మనిషి ఆరోగ్యకరంగా ఉండడం జరుగుతుందని ఆరోగ్యకరంగా ఉన్నప్పుడే తాను అనుకున్న విజయాలను సాధించవచ్చు అని తెలంగాణ శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. శనివారం అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని వికారాబాద్ జిల్లా కేంద్రంలో అంబేద్కర్ భవన్ బ్యాక్ గ్రౌండ్ లో యోగా డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్, మరియు జిల్లా కలెక్టర్ ప్రతిక్ జైన్, అదనపు కలెక్టర్ సుధీర్, పుర ప్రముఖులతో, యువకులతో కలిసి యోగ ఆసనాలు వేశారు. సుమారు రెండు గంటల పాటు యోగ ఆసనాలను చేసారు. అనంతరం శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ

జూన్ 21వ తేదీన ప్రపంచవ్యాప్తంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం జరుపుకుంటున్నామని అన్నారు. నిత్య జీవితంలో యోగ ప్రతి ఒక్కరికి ముఖ్యమని అన్నారు. చిన్న పెద్ద అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరూ యోగ ఆసనాలు చేయడం వల్ల ఆరోగ్యకరంగా ఉంటారని అన్నారు. ఆరోగ్యకరంగా ఉన్నప్పుడే అనుకున్న విజయాలను సాధించవచ్చు అని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ యోగ ఆసనాలను ప్రతిరోజు చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పుర ప్రముఖులు ప్రభుత్వ అధికారులు తదితరులున్నారు

## యోగాను జీవితంలో భాగంగా చేసుకోవాలి

హైదరాబాద్

అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా కొత్తపేటలో చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి పాల్గొనడం జరిగింది. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా కొత్తపేటలోని వివిఎం హోమ్ లో నిర్వహించిన యోగా కార్యక్రమంలో చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు. యోగా ప్రాముఖ్యతను ప్రస్తావిస్తూ ఆయన మాట్లాడుతూ, "ఆరోగ్యంగా, ప్రశాంతంగా జీవించాలంటే యోగా అత్యంత అవసరం. ఇది శరీరాన్ని గాక మనస్సును కూడా శాంతంగా ఉంచుతుంది" అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు, విద్యార్థులు, యోగా అభ్యాసకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

యోగా గురువుల నేతృత్వంలో భ్రమరీ ప్రాణాయామం, సూర్య నమస్కారాలు, ధ్యానం వంటి పలు ఆసనాలు అభ్యసించారు. యోగా కార్యక్రమాన్ని ప్రతిరోజూ జీవితంలో భాగంగా చేసుకోవాలని యువతకు ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమం లో స్థానిక సరూర్ నగర్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి, బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## యోగాంధ్ర గూర్చి జగన్ వ్యతిరేకతపై సిఎం చంద్రబాబు ఆగ్రహం

అమరావతి జూన్ 21

విశాఖపట్నంలో జరిగే యోగాంధ్ర కార్యక్రమాన్నిగురించి వైసిపి అధినేత జగన్ మోహన్ రెడ్డి ప్రజాధనం వృథా అంటూ విమర్శలు చేశారు. యోగాంధ్ర గూర్చి జగన్ వ్యతిరేకతపై ఎపి సిఎం చంద్రబాబు నాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ..రుషికొండ ప్యాలెస్ కు రూ. వందల కోట్లు ఖర్చు చేసిన వాళ్లు ఎద్దేవా చేస్తున్నారని, ఇలాంటి శుభ సందర్భంలో కొందరి గురించి మాట్లాడటం అనవసరం అని అన్నారు. కాలుష్యాన్ని కలుషితం చేద్దామనుకునే చర్యలను ఉపేక్షించనని హెచ్చరించారు. భూతాన్ని నియంత్రించడంపై ప్రజలను చైతన్యపరుస్తాం అని యోగాంధ్రకు కేంద్రం రూ.75 కోట్లు ఖర్చు చేసిందని చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.

================================

# సన్న బియ్యం పండించేందుకు రైతులకు ప్రోత్సాహం ఇవ్వండి

విజయవాడ, జూన్ 20,

రైతులు ఖరీఫ్ సీజన్‌లో ప్రజలు కోరుకునే సన్న బియ్యం పండించేలా రైస్ మిల్లర్లు ప్రోత్సహించాలని రాష్ట్ర ఆహార, పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పిలుపునిచ్చారు. విజయవాడ కానూరు సివిల్ సప్లై భవనంలో ఈరోజు జరిగిన రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ప్రతినిధులతో సమావేశంలో మంత్రి మాట్లాడారు. "రైతులకు లాభం చేకూరేలా, ప్రభుత్వానికి చెడ్డ పేరు రాకుండా మిల్లర్లు సమిష్టిగా పనిచేయాలి. దేశీయ వినియోగం మాత్రమే కాదు, బియ్యం ఎగుమతులు (ఎక్స్‌పోర్ట్) కూడా లక్ష్యంగా పెట్టుకుని మిల్లర్లు ముందుకు సాగాలి," అని మంత్రి మనోహర్ పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రజల ఆహారపు అలవాట్లను దృష్టిలో పెట్టుకుని సన్న బియ్యం వినియోగాన్ని ప్రోత్సహిస్తోందని, అందుకే రైతులు ఆ దిశగా మొగ్గు చూపేలా రైస్ మిల్లర్లు కీలక పాత్ర పోషించాలని ఆయన తెలిపారు.

# యోగ సాధన వృత్తిలో వచ్చే వత్తిడిని తగ్గిస్తుంది రిజర్వ్ ఇన్స్పెక్టర్

వనపర్తి జూన్-21:

ప్రపంచ పదకొండవ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా శనివారం రోజు వనపర్తి జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ ఆదేశాల మేరకు వనపర్తి జిల్లా పోలీసు కార్యాలయం పరేడ్ మైదానంలో సాయుధ దళ రిజర్వ్ ఇన్స్పెక్టర్, అప్పలనాయుడు ఆధ్వర్యంలో యోగా కార్యక్రమం ఏర్పాటు చేశారు. మొదటగా యోగా శిక్షకుడు కానిస్టేబుల్ రాజశేఖర్ యోగ ను సిబ్బందికి తెలియజేస్తూ, సూర్య నమస్కారాలు, ప్రాణాయామము, ఆసనములు సిబ్బంది ద్వారా చేయించారు. జిల్లా పోలీసు అధికారులు సిబ్బంది అందరూ వివిధ రకాల సూర్య నమస్కారాలు, ఆసనములు, వివిధ రకాల ప్రాణాయాములు స్వయంగా చేశారు.

ఈ సందర్భంగా రిజర్వ్ ఇన్స్పెక్టర్ మాట్లాడుతూ మొదటగా సిబ్బందికి పదకొండవ అంతర్జాతీయ యోగా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఆధునిక సమాజపు పోకడలకు లొంగిపోయి, అనారోగ్యంతో కునారిల్లుతున్న మనిషికి యోగా ప్రకృతిసిద్ధమైన శక్తిని అందిస్తుందని అన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఈరోజు యోగా దినోత్సవం జరుపుకోవడం జరుగుతుందన్నారు. అతి చిన్న వయసులోనే రోగాలకు గురవుతూ ప్రమాద పరిస్థితులు నెలకొంటున్న నేటి పరిస్థితుల్లో యోగా, సూర్య నమస్కారాలు, నడక వంటివి మన దినచర్యలో భాగంగా చేసుకోవాలని సూచించారు.

యోగ అనేది వయసుకు సంబంధం లేకుండా అందరూ చేసే ఒక సాధనమని పేర్కొంటూ, యోగా వల్ల, ఆసనాల వల్ల అనారోగ్య బారిన పడకుండా, శారీరక దృఢత్వాన్ని కాపాడుకోవచ్చని పేర్కొన్నారు. ముఖ్యంగా పోలీసులు రేయింబవళ్లు 24 గంటలు విధులను నిర్వర్తిస్తుంటారని వారికి యోగ ఎంతగానో తోడ్పాటు అందజేస్తుందని, ఆరోగ్యాన్ని కాపాడుతూ విధులను నిర్వర్తించాలని సూచించారు. యోగ ప్రాణాయామము ఆసనాలు వలన మానసిక, శరీరక విశ్రాంతి, ఉపశమనం లభించి ప్రశాంతత లభిస్తుందని తెలిపారు. గుండెకు, శరీరానికి, మనసుకు అన్నిటికీ యోగ ఉత్తమమైన మార్గమని తెలిపారు. ఈరోజు జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని పోలీసు పోలీస్టేషనలలో అధికారులు, సిబ్బంది యోగా దినోత్సవం నిర్వహించుకోవడం జరిగిందని తెలిపారు. పోలీసు అధికారులు,సిబ్బంది యోగాను దైనందిన జీవితంలో ఒక భాగంగా మార్చుకోవడం ద్వారా ఆనందకర జీవితాన్ని పొందగలరని అన్నారు. ప్రతి ఒక్కరూ ప్రతి రోజూ అరగంట,గంట పాటు యోగా చేస్తే చాలా వరకూ అనారోగ్యం పాలుకాకుండా ఒత్తిడి వంటివి లేకుండా ప్రశాంత జీవనం సొంతం అవుతుందన్నారు.

ఈ కార్యక్రమంలో రిజర్వ్ ఇన్స్పెక్టర్లు, అప్పలనాయుడు,శ్రీనివాస్, స్పెషల్ బ్రాంచ్ సీఐ, నరేష్, బిసిఆర్బి ఎస్సై తిరుపతిరెడ్డి, రిజర్వ్ సబ్ ఇన్స్పెక్టర్లు, వినోద్, మగ్ధంభారీ, జిల్లాలోని పోలీసు అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పర్యాటక, విహార కేంద్రంగా చర్లపల్లి చెరువు..

హైదరాబాద్, జూన్ 21,

హైదరాబాద్‌లోని జలవనరుల పునరుజ్జీవనానికి, పట్టణ సౌందర్యాన్ని పెంపొందించే లక్ష్యంతో.. హైదరాబాద్ డెవలప్‌మెంట్ అండ్ రీడెవలప్‌మెంట్ అథారిటీ ( హైడ్రా) చర్లపల్లి చెరువుపై ప్రత్యేక దృష్టి సారించింది. ఈ క్రమంలో, జైళ్ల శాఖ డైరెక్టర్ జనరల్ సౌమ్య మిశ్రా ఆహ్వానం మేరకు.. హైడ్రా కమిషనర్ రంగనాథ్ స్వయంగా చర్లపల్లి చెరువును సందర్శించారు. ఈ సందర్శన.. తదనంతర సమావేశం 58 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ చెరువును ఆధునీకరించి పర్యాటక, విహార కేంద్రంగా తీర్చిదిద్దాలనే ప్రభుత్వ సంకల్పాన్ని స్పష్టం చేశాయి. చర్లపల్లి చెరువు దాని చుట్టూ ఉన్న పరిసరాలు దీర్ఘకాలంగా అభివృద్ధికి నోచుకోలేదు. అయితే.. హైడ్రా కమిషనర్ రంగనాథ్, జైళ్లశాఖ అధికారులతో పాటు స్థానిక రెవెన్యూ, నీటిపారుదల, గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) అధికారులతో కలిసి ఈ చెరువు ఆధునీకరణపై సమగ్రంగా చర్చించారు. చెరువు చుట్టూ ఉన్న నీటి ప్రవాహ మార్గాలైన 'ఇన్‌లెట్', 'అవుట్‌లెట్'లను పరిశీలించిన రంగనాథ్.. చెరువులో నీరు పరిశుభ్రంగా ఉండటం, జీవవైవిధ్యానికి గణనీయమైన అవకాశం లభించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఇది పర్యావరణ పరిరక్షణకు, స్థానిక జీవావరణ వ్యవస్థకు ఎంతగానో తోడ్పడుతుంది. ఈ పునరుజ్జీవన ప్రాజెక్టులో భాగంగా.. చర్లపల్లి చెరువు చుట్టూ బలోపేతమైన కట్టను నిర్మించి, పకడ్బందీగా ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని ఇరు శాఖల అధికారులు నిర్ణయించారు. ఇది ఆక్రమణల నుంచి చెరువును కాపాడటమే కాకుండా, భవిష్యత్తులో స్థానికులకు ఒక సురక్షితమైన, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందిస్తుంది. చర్లపల్లి చెరువును కేవలం నీటి వనరుగా మాత్రమే కాకుండా.. ఒక ఆకర్షణీయమైన పర్యాటక, విహార కేంద్రంగా అభివృద్ధి చేయాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ లక్ష్య సాధనలో భాగంగా.. చెరువు చుట్టూ దాదాపు 3 కిలోమీటర్ల మేర నడక దారి (వాకింగ్ పాత్‌వే) ఏర్పాటు చేయనున్నారు. అంతేకాకుండా.. చెరువు పరిసరాల్లో అందమైన మినీ పార్కులు, విశాలమైన పచ్చదనం కోసం చెట్లు, సందర్శకుల కోసం సౌకర్యవంతమైన సీటింగ్ సౌకర్యం కల్పించనున్నారు. భద్రతను పెంపొందించేందుకు సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తారు. ఇవన్నీ పూర్తయితే చర్లపల్లి చెరువు కేవలం స్థానికులకు మాత్రమే కాకుండా.. హైదరాబాద్నగరవాసులకు ఒక ముఖ్యమైన విహార కేంద్రంగా మారుతుందని అధికారులు ఆశిస్తున్నారు. హైడ్రా తెచ్చిన సంబురం.. పండగే పండగ..చెరువు అభివృద్ధికి సంబంధించిన డిటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ (డీపీఆర్) ను రూపొందించాలని హైడ్రా ఇరిగేషన్ ఇంజినీరింగ్ విభాగానికి కమిషనర్ రంగనాథ్ సూచించారు. ఈ డీపీఆర్ ప్రాజెక్టు అమలు, నిధుల వినియోగం, కాలపరిమితిపై స్పష్టమైన మార్గదర్శకాలను అందిస్తుంది. చర్లపల్లి చెరువు ఒక గొలుసుకట్టు చెరువుల వ్యవస్థలో భాగం. హకీంపేట నుంచి నాగిరెడ్డి కుంట, కాప్రా చెరువు, మోతుకులకుంట, బైసన్‌కుంట వంటి చెరువుల ద్వారా చర్లపల్లి చెరువుకు నీరు చేరుతుంది. అంతేకాకుండా.. చెరువుకు మురుగు నీరు కలవకుండా నిరోధించడానికి ఒక ప్రత్యేక డైవర్షన్ నాలా కూడా ఉంది. ఇది చెరువు నీటి స్వచ్ఛతను కాపాడుతుంది. ఈ ప్రాజెక్టు అమలుకు నిధుల సేకరణలో కార్పొరేట్ సామాజిక బాధ్యత నిధులు కీలక పాత్ర పోషించనున్నాయి. చర్లపల్లి ప్రాంతంలోని పరిశ్రమల ప్రతినిధులు ఈ చెరువు అభివృద్ధి కోసం ఊఖీ కింద నిధులు సమకూర్చడానికి సిద్ధంగా ఉన్నట్లు జైళ్ల శాఖ డైరెక్టర్ జనరల్ సౌమ్య మిశ్రా తెలిపారు. ఇది ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో పట్టణ అభివృద్ధి ప్రాజెక్టులను చేపట్టడానికి ఒక మంచి ఉదాహరణగా నిలుస్తుంది. పారిశ్రామిక సంస్థలు తమ సామాజిక బాధ్యతను గుర్తించి, స్థానిక పర్యావరణ పరిరక్షణకు, ప్రజల జీవన నాణ్యతను మెరుగుపరచడానికి ముందుకు రావడం ప్రశంసనీయం. చర్లపల్లి చెరువు పునరుజ్జీవన ప్రాజెక్టు హైదరాబాద్ నగరంలో పచ్చదనం, పర్యావరణ పరిరక్షణ, పౌర సౌకర్యాల పెంపుదలకు ఒక ఆదర్శప్రాయమైన నమూనాగా నిలుస్తుందని ఆశిస్తున్నారు.

# ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి అరెస్టు దుర్మార్గపు చర్య

హైదరాబాద్

ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి అరెస్టుపై భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. శంషాబాద్ విమానాశ్రయంలో హుజురాబాద్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డిని అక్రమంగా అరెస్టు చేయడం అత్యంత దుర్మార్గమైన చర్య, సీఎం రేవంత్ నిరంకుశ వైఖరిని తీవ్రంగా ఖండిస్తున్నానని అన్నారు. ఈ ముఖ్యమంత్రి అక్రమాలను మంత్రుల అవినీతిని, కాంగ్రెస్ నేతల దుర్మార్గాలను అడుగడుగునా కౌశిక్ రెడ్డి ప్రశ్నిస్తున్నారు కాబట్టే ఆయనపై కక్షకట్టి అక్రమ కేసులు బనాయిస్తున్నారు. గత ఏడాదిన్నర కాలంగా కాంగ్రెస్ సర్కార్ ప్రజలకు చేస్తున్న అన్యాయాలపై నిలదీస్తున్న కౌశిక్ రెడ్డిని తప్పుడు కేసులతో ఇబ్బంది పెట్టే కుట్ర అనేక నెలల నుంచి కొనసాగుతూనే ఉంది. ఇలాంటి చిల్లర చేష్టలు, పనికిరాని కేసులు, బీఆర్ఎస్ నేతల సంకల్పాన్ని, మనోధైర్యాన్ని ఎప్పటికీ దెబ్బతీయలేవు.

ఇందిరమ్మ రాజ్యమని చెప్పుకునే రేవంత్ ఎమర్జెన్సీని తలపించేలా ప్రశ్నించే గొంతులపై అణచివేత చర్యలతో ప్రజాక్షేత్రంలో అభాసుపాలవుతున్నాడు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయలేని తన చేతకానితనాన్ని కప్పిపుచ్చుకునేందుకే రేవంత్ ప్రజల దృష్టిని మళ్లించేందుకు ఇలాంటి దారుణాలకు పాల్పడుతున్నాడని అన్నారు. అసమర్థ ముఖ్యమంత్రి ఆదేశాలతో అరెస్టు చేసిన ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డిని వెంటనే బేషరతుగా విడుదల చేయాలి. మాకు గౌరవ న్యాయస్థానాలపై సంపూర్ణ నమ్మకం ఉంది. మాపై, మా నేతలపై ఎన్ని అక్రమ కేసులు పెట్టినా అవి కోర్టుల్లో నిలబడే అవకాశమే లేదు. ఎన్ని వందల తప్పుడు కేసులు పెట్టినా రేవంత్ నియంత పాలన పై, బీఆర్ఎస్ ప్రజల పక్షాన పోరాడుతూనే ఉంటుందని అన్నారు.

# కొండా దంపతుల పై నేతలు తిరుగుబాటు

వరంగల్, జూన్ 21,

ఉమ్మడి వరంగల్ జిల్లా కాంగ్రెస్‌లో వర్గపోరు తారాస్థాయికి చేరుకుంది. ఇన్నాళ్లు నివురు గప్పిన నిప్పులా ఉన్నా కోల్డ్‌వార్ కొండా మురళీ వ్యాఖ్యలతో ఇప్పుడు బహిర్గతమైంది. మంత్రి కొండా సురేఖతో ఎమ్మెల్యేలకు కొనసాగుతున్న పొలిటికల్ గ్యాప్‌ను మాజీ ఎమ్మెల్సీ మురళీధర్‌రావు వ్యాఖ్యలు బహిర్గతం చేస్తున్నాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఆయా నియోజకవర్గాల నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న 11 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేల మధ్య గత కొద్దిరోజులుగా చాటుమాటుగా సాగుతున్న రాజకీయ కుట్రలు.. ఇప్పుడు ప్రత్యక్షంగా విమర్శలు చేసుకునే స్థాయికి చేరుకున్నాయి. వరంగల్ కాంగ్రెస్ పార్టీలో కొండా దంపతులు వర్సెస్ ఇతర నేతలన్నట్లుగా పరిస్థితి మారింది. మాజీ ఎమ్మెల్సీ, కాంగ్రెస్ నేత కొండా మురళి స్వంత పార్టీ ఎమ్మెల్యే పై చేసిన వ్యాఖ్యల పై ఆపార్టీ ఎమ్మెల్యేలు, నేతలు హన్మకొండ లోని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి నివాసంలో సమావేశమయ్యారు. వరంగల్ కాంగ్రెస్ పార్టీకి కొండా దంపతులు పెద్ద సమస్యగా మారారు. మంత్రిగా ఉండి పార్టీకి డ్యామేజ్ అయ్యేలా కొండా సురేఖ తరచూ మాట్లాడుతూంటారు. ఆమె వల్ల ప్రభుత్వం తో పాట ?ఇతర మంత్రులకూ సమస్యలు వస్తున్నాయి. తాజాగా కొండా మురళి కూడా రెచ్చిపోతున్నారు. గురువారం ఆయన అనుచరులతో సమావేశం పెట్టి ఇష్టం వచ్చినట్లుగా మాట్లాడారు. రేవూరి ప్రకాష్ రెడ్డి, కడియం శ్రీహరిలతో పాటు ఇతర కాంగ్రెస్ నేతల్ని కించ పరుస్తూ మాట్లాడారు. కొండా సురేఖ మంత్రి పదవి ఎక్కడికీ పోదని చాలెంజ్ చేశారు. కొండా దంపతుల వ్యవహారం రాను రాను గీత దాటిపోతూండటంతో.. ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన ఆపార్టీ ఎమ్మెల్యేలు, నేతలు హన్మకొండ లోని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి నివాసంలో సమావేశమయ్యారు. మంత్రి కొండా సురేఖ, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సొంత పార్టీ ఎమ్మెల్యేలు, నేతలపై వ్యాఖ్యలు చేయడం సరికాదని ఇప్పటి వరకూ కొండా దంపతులను భరిస్తున్నామని .. ఇక తమ వల్ల కాదని వారు తేల్చేశారు. త్వరలో పార్టీ ఇంచార్జి మీనాక్షి నరాజన్ కు ఫిర్యాదు చేస్తామని చెప్పారు. కొండ దంపతులు కులాలను అడ్డుపెట్టుకొని రాజకీయాలు చేస్తున్నారని, పార్టీకి నష్టం చేసే వారిపై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేలు కోరారు. కొండా దంపతులు ఏ పార్టీలో ఉన్నా ఇదే సమస్య. వారు ఎవరితోనూ సఖ్యతగా ఉండరు. ఆధిపత్యం అంతా తమదే ఉండాలని అనుకుంటారు. గతంలో ముఖ్యమంత్రికి అత్యంత సన్నిహితుడు అయిన వేం నరేందర్ రెడ్డిని కూడా బెదిరించినట్లుగా ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. ఇప్పుడు పార్టీ నేతలంతా కలిసి కొండా సురేఖకు వ్యతిరేకంగా మారడంతో.. వారికి ఇక ముఖ్యమంత్రి అటు ప్రభుత్వ పరంగా.. ఇటు పార్టీ పరంగా ప్రాధాన్యత ఇచ్చే అవకాశాలు తగ్గిపోయాయి. ఇప్పటికే మెదక్ ఇంచార్జ్ మంత్రిగా ఉన్న ఆమెను తొలగించారు. మంత్రి కొండా సురేఖ, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని వరంగల్ జిల్లా ఎమ్మెల్యేలు డిమాండ్ చేశారు. సొంత పార్టీ ఎమ్మెల్యేలు, నేతలపై వ్యాఖ్యలు చేయడం సరికాదని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. కొండా దంపతులను భరిస్తున్నామని, ఇక బరించలేమని నాయిని అన్నారు. త్వరలో పార్టీ ఇంచార్జి మీనాక్షి నరాజన్ కు ఫిర్యాదు చేస్తామని చెప్పారు. కొండ దంపతులు కులాలను అడ్డుపెట్టుకొని రాజకీయాలు చేస్తున్నారని, పార్టీకి నష్టం చేసే వారిపై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేలు కోరారు. ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి నివాసంలో సమావేశమైన వారిలో ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, రేవూరి ప్రకాశ్ రెడ్డి, నాగరాజ్, గండ్ర సత్యనారాయణ, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్యతోపాటు ముఖ్యనేతలు అన్నారు.

మంత్రి వర్సెస్ ఎమ్మెల్యేలు

కొద్దిరోజులుగా మంత్రి కొండా సురేఖకు మంత్రి వర్గం నుంచి ఉద్వాసన పలుకుతారనే ప్రచారం జోరుగా సాగుతోంది. ఇందుకు ఇటీవల జరిగిన కొన్ని ఘటనలను ఉదాహరిస్తూ పార్టీకి చెందిన సీనియర్ ఎమ్మెల్యేలు ఈ ప్రచారం సాగిస్తున్నట్లుగా కొండా వర్గం భావిస్తూ వస్తోంది. అయితే ఇటీవల కొండా మురళీకి వరంగల్ డివిజన్ పోలీసులు ఎస్కార్ట్ ఇవ్వడాన్ని తప్పుబట్టిన కాంగ్రెస్ పార్టీకే చెందిన ప్రజాప్రతినిధులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లుగా తెలుస్తోంది. సదరు పోలీసులకు సీపీ సన్ ప్రీత్‌సింగ్ మెమోలు జారీ చేయడంతో ఈ పరిణామం రాజకీయ రంగు పులుముకుంది. గతంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన ఓ కార్పోరేటర్‌పై అత్యాచారం యత్నం, అట్రాసిటీ కేసు నమోదు కావడం వెనుక ఆయన అనుచరవర్గం నేతలు ఉన్నారని, ఈ విషయంపై ఓ సీనియర్ ప్రజాప్రతినిధి సీపీనికలవడం, తదుపరి సీఎం రేవంత్ రెడ్డి, సీఎం ముఖ్య సలహాదారు వేం నరేందర్‌రెడ్డి దృష్టికి సైతం తీసుకెళ్లారు. ఈ పరిణామం వరంగల్ తూర్పులో మరింత పొలిటికల్ హీట్‌ను పెంచేసింది. కొండా దంపతులు ఆధిపత్యం ప్రదర్శించే వైఖరితో వ్యవహరిస్తున్నారనే వైఖరితో మిగతా నియోజకవర్గాలకు చెందిన ఎమ్మెల్యేలు సైతం వారి నియోజకవర్గాలకు ఆహ్వానించడం లేదు. అభివృద్ధి కార్యక్రమాలకు మంత్రికి ఆహ్వానం పలకకపోవడం, పార్టీ సమావేశాల్లోనూ జిల్లా ఎమ్మెల్యేలతో మంత్రి సురేఖ ఎడమొహం, పెడమొహం అన్నచందంగా వ్యవహరిస్తున్నారు. మంత్రి వర్సెస్ ఎమ్మెల్యేలుగా పరిస్థితి మారింది. వరంగల్ జిల్లా ఇన్చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పర్యటనల సందర్భంగా మినహా ప్రత్యేకంగా జిల్లా మంత్రి హోదాలో సురేఖ ఉమ్మడి జిల్లా నియోజకవర్గ పర్యటనల్లో పాల్గొన్నది బహు తక్కువనే చెప్పాలి. ఇన్నాళ్లు కోల్డ్‌వార్ స్థాయిలోనే ఉన్న వర్గపోరు.. ఇప్పుడు ప్రత్యక్షంగా వేదికలపై విమర్శలు చేసే స్థాయి చేరుకుంది. మంత్రి సురేఖ పదవి పోతోందనే ప్రచారంపై కొండా మురళీధర్‌రావు ఇప్పుడు మాస్ వార్నింగ్‌లు ఇవ్వడంపై కాంగ్రెస్ పార్టీ నేతలను సైతం షాక్‌గా గురి చేసింది. ఇతర పార్టీల నుంచి వచ్చిన ప్రజాప్రతినిధులు దమ్ముంటే రాజీనామాలు చేసి గెలవాలంటూ స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్యలను ఉద్దేశించి సవాల్ విసిరారు. గెలిపించాలని తన కాళ్లు పట్టుకున్నాడంటూ పరకాల ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డిపై వ్యాఖ్యనించారు. ఇదిలా ఉండగా గత కొంతకాలంగా కాంగ్రెస్ ఎమ్మెల్యేలు సైతం కొండా దంపతులపై ఫిర్యాదులు చేస్తూ వస్తున్నట్లు సమాచారం. కొండా సురేఖను మంత్రి పదవి నుంచి తప్పిస్తే ఆ స్థానంలో జిల్లా నుంచి సీనియర్లలో ఎవరో ఒకరికి అవకాశం లభిస్తుందన్న లక్ష్యంతో కూడా రాజకీయ కుట్ర జరుగుతోందన్న ఆరోపణలు కొండా వర్గం నేతల మధ్య జరుగుతుండటం గమనార్హం. గతంలో టీడీపీలో పనిచేసి.. ఇప్పుడు కాంగ్రెస్ ఎమ్మెల్యేలుగా కొనసాగుతున్న వారంతా కూడా ఒక కూటమిగా వ్యవహరిస్తున్నారని కొండా వర్గం నేతల నుంచి ఆరోపణలు వినిపిస్తుండగా, వీరిద్దరికి సీఎంకు అత్యంత సన్నిహితుడిగా ఉన్న మరో ముఖ్య నేత సహకరిస్తున్నారంటూ ఆరోపణలు చేస్తుండటం గమనార్హం. తెరవెనుక జరుగుతున్న పరిణామాల పర్యవసానమే.. కొండా మురళీధర్‌రావు ఆగ్రహావేశానికి కారణమన్న చర్చ జరుగుతోంది. కాంగ్రెస్‌లో పెరుగుతున్న వర్గపోరు ఎలాంటి పరిస్థితులకు దారి తీస్తుందో వేచి చూడాలి.

# సిటీలో పెరగనున్న మరిన్ని హోటల్స్

హైదరాబాద్, జూన్ 21,

హైదరాబాద్‌లో ఆతిథ్య రంగం అభివృద్ధి చెందుతోంది. రానున్న ఏడేళ్లలో దాదాపు 25 స్టార్ హోటళ్లు, రిసార్ట్‌లు నగరంలో ప్రారంభం కానున్నాయి. ఐటీ, ఫార్మా రంగాల అభివృద్ధి కారణంగా అంతర్జాతీయ కంపెనీలు ఆసక్తి చూపుతున్నాయి. ముఖ్యంగా ఐటీ కారిడార్, శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ రూట్, జీనోమ్ వ్యాలీ ప్రాంతాల్లో ఇవి ఎక్కువగా ఉండనున్నాయి. దీని ద్వారా ఉపాధి అవకాశాలు కూడా పెరిగే అవకాశం ఉంది. హైదరాబాద నగరం విశ్వనగరంగా? రూపుదిద్దుకుంటుంది. ఇప్పటికే ఇక్కడ పలు అంతర్జాతీయ స్థాయి కంపెనీలు.. వాటి బ్రాంచ్‌లను ప్రారంభించిన సంగతి తెలిసిందే. ఇక తాజాగా మిస్ వరల్డ్ పోటీల నిర్వహణతో హైదరాబాద్ పేరు మరోసారి మార్మోగిపోయింది. అనేక అంతర్జాతీయ కార్యక్రమాల నిర్వహణకు నగరం వేదికగా మారుతుంది. వైద్య, ఐటీ, ఫార్మా రంగాలకు సంబంధించి హైదరాబాద్‌లో పెట్టుబడులు పెట్టేందుకు ఎన్నో అంతర్జాతీయ కంపెనీలు ఆసక్తి చూపుతున్నాయి. అలానే మెడికల్ టూరిజంలో భాగంగా.. మెరుగైన వైద్యం కోసం ఇతర రాష్ట్రాలు, దేశాల నుంచి ఎందరో హైదరాబాద్‌కు తరలి వస్తున్నారు. వీటన్నింటిని దృష్టిలో పెట్టుకుని.. అంతర్జాతీయంగా పేరున్న పలు హోటళ్లు, దేశీయంగా ఆతిథ్య రంగంలో ఉన్న సంస్థలు.. హైదరాబాద్‌లో తమ బ్రాంచ్‌లను విస్తరించేందుకు ఆసక్తి చూపుతున్నాయి. ఇందుకోసం డెవలపర్లతో ఒప్పందాలు కుదుర్చుంటున్నాయి. ఈ క్రమంలో రానున్న 5-7 ఏళ్లలో హైదరాబాద్‌లో 25 వరకు స్టార్ హోటళ్లు, రిసార్ట్‌లు ప్రారంభం కాబోతున్నాయి. ఆ వివరాలు.ఐటీ, ఫార్మా రంగాలకు కేంద్రంగా ఉన్న హైదరాబాద్.. వాటికి సంబంధించి సమావేశాలు, కాన్ఫరెన్స్‌లకు ప్రధాన వేదికగా మారుతుంది. ఇటీవల నిర్వహించిన మిస్ వరల్డ్ పోటీల కోసం వివిధ దేశాలకు చెందిన అందాల భామలు, స్పాన్సర్లు, ఇతర ప్రముఖులు వందల సంఖ్యలో హైదరాబాద్‌కు తరలి వచ్చారు. అంతేకాక ఈమధ్య కాలంలో విదేశాల నుంచి ఐటీ కంపెనీల సీఈవోలు, క్లయింట్లు తరచుగా ఇక్కడి బ్రాంచ్‌లను పరిశీలించడానికి వస్తున్నారు. అయితే కొన్ని సందర్భాల్లో వారు కోరుకున్న స్టార్ హోటళ్లలో రూమ్స్ దొరకక ఇబ్బంది పడుతున్నారు. ఇక భవిష్యత్తులో ఇలాంటి అవసరాలు మరింత పెరిగే అవకాశం ఉంది. వీటిని దృష్టిలో పెట్టుకుని.. పలు హోటల్ గ్రూపులు విస్తరణకు రెడీ అవుతున్నాయి. దీంతో రానన్న 5-7 ఏళ్లలో హైదరాబాద్‌లో 25 వరకు స్టార్ హోటల్స్ , రిసార్ట్‌లు రాబోతున్నాయి. దీని వల్ల ఉపాధి పెరిగే అవకాశం కూడా ఉంది. ఇక వీటిల్లో ఎక్కువ సంఖ్యలో రిసార్ట్‌లు, స్టార్ హోటల్స్.. ఐటీ కారిడార్ ఏరియా, శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ రూట్, శామీర్‌పేట జీనోమ్ వ్యాలీతో పాటుగా మరికొన్ని ప్రముఖ ప్రాంతాల్లో ప్రారంభం కాబోతున్నాయి. 2030-2032 నాటికి ఇవన్ని ప్రారంభం అయి.. ఐదు వేలకుపైగా గదులు అందుబాటులోకి రానున్నాయి. ఇప్పటికే హిల్టన్ హోటల్ అండ్ కన్వెన్షన్, రాడిసన్, కాంటినెంటల్, ఐటీసీ, తాజ్ వివాంటా, జేడబ్ల్యూ మారియట్ వంటి హోటళ్లు ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, కోకాపేట, బుద్వేల్, శంకర్‌పల్లి ప్రాంతాల్లో తమ శాఖలను విస్తరింపచేసే ఆలోచనలో ఉన్నాయని తెలుస్తోంది. కనుక ఆ ఏరియాలకు డిమాండ్ మరింత పెరిగే అవకాశం ఉంది అంటున్నారు.

# కొండా కాంట్రవర్సీ..

వరంగల్, జూన్ 21,

వరంగల్ కు చెందిన కొండా మురళి ఫ్యామిలీ ఎక్కడ ఉన్నప్పటికీ కాంట్రవర్సీకి కేరాఫ్ గా ఉంది. కొండా సురేఖ మంత్రి పదవిలో ఉంటూ కూడా వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తున్నారు. ఇటీవల అనేక సందర్భాల్లో కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలు వివాదంగా మారాయి. టాలీవుడ్ హీరోల కుటుంబం పై కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలు నాడు పార్టీని ఇబ్బందుల్లోకి నెట్టాయి. అదే సమయంలో తర్వాత మంత్రులుగా ఉన్న వాళ్లు లంచాలు తీసుకోనిదే ఏ పనిచేయరని చేసిన వ్యాఖ్యలు కూడా సొంత పార్టీలో నేతలకు కన్నెర్రకు కారణమయ్యాయి. ఇక తాజాగా కొండా మురళి చేసిన వ్యాఖ్యలతో మరోసారి కాంగ్రెస్ పార్టీలో కలకలం రేపింది. సొంత పార్టీ నేతలనే కొండా మురళి లక్ష్యంగా చేసుకుని మాట్లాడారు. పార్టీ మారిన నేతలపై... కొండా మురళి వరంగల్ లో జరిగిన ఒక కార్యక్రమంలో మాట్లాడుతూ సిగ్గుంటే పార్టీ మారినప్పుడు పదవులుకు రాజీనామాలు చేయాలని చేసిన వ్యాఖ్యలు సూటిగా తగిలిన నేతలు రాజకీయంగా ఇబ్బందులు పడుతున్నారు. సుదీర్ఘకాలంగా మంత్రిగా పనిచేశానని చెప్పుకునే నేతలు వారు గతంలో పనిచేసిన పార్టీలను భ్రష్టు పట్టించారన్నారు. నాడు తెలుగుదేశం లో చంద్రబాబు నాయుడిని, తర్వాత బీఆర్ఎస్ లో కేసీఆర్ ఓటమికి కారణమయ్యారని కొండా మురళి కడియం శ్రీహరిని ఉద్దేశించి అన్నారని ఎవరికైనా ఇట్టే అర్థమవుతుంది. ఇప్పుడు కాంగ్రెస్ పార్టీలో చేరి దీనిని కూడా ఆగం చేస్తున్నారని ఆయన చేసిన వ్యాఖ్యలు కడియం శ్రీహరితో పాటు రేవూరి ప్రకాశ్ రెడ్డి, బస్వరాజు సారయ్య వంటి వారు కొండా మురళి వ్యాఖ్యలకు ఆగ్రహంతో ఊగిపోతున్నారు. వీరంతా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అత్యం సన్నిహితులే.. ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డిని ఉద్దేశించి కూడా కొండా మురళి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. 75 ఏళ్ల ముసిలోడు పరకాలకు వచ్చాడని, దరిద్రమైన నాయకుడని, నా రెండు కాళ్లు పట్టుకుని గెలిపించమని అడిగితే తాను సాయం చేశానని కొండా మురళి అన్నారు. అంతటితో ఆగకుండా వచ్చే ఎన్నికల్లో పరకాల నుంచి తన కూతురు సుస్మిత ఎమ్మెల్యేగా గెలవడం ఖాయమని, తాను కూడా ఎమ్మెల్సీ అవుతానని, కొండా సురేఖ కూడా వరంగల్ తూర్పు నుంచి పోటీ చేస్తారని కొండా మురళి తనకు తానే టిక్కెట్లను డిక్లేర్ చేసుకోవడం ఇప్పుడు చర్చనీయాంశమైంది. దీంతో ఈరోజు కొండా మురళి తమపై చేసిన వ్యాఖ్యలకు వ్యతిరేకంగా కడియం శ్రీహరి, నాయని రాజేందర్ రెడ్డి, రేవూరి ప్రకాశ్ రెడ్డి సమావేశమై హైకమాండ్ కు ఫిర్యాదు చేయాలన్న ఆలోచనలో ఉన్నారు. మొత్తం మీద మరోసారి కొండా కుటుంబం ట్రబుల్ లో పడిందనే చెప్పాలి.

==================================చీచీ

# సంగారెడ్డి కంది సెంట్రల్ జైలును తనిఖీ చేసిన జిల్లా జడ్జీ భవాని చంద్ర

సంగారెడ్డి, భారత శక్తి ప్రతినిధి, జూన్ 21: జాతీయ న్యాయ సేవాధికార సంస్థ మరియు రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ హైదరాబాద్ వారి ఆదేశాల ప్రకారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ మరియు జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. భవానిచంద్ర ఆధ్వర్యంలో సెంట్రల్ జైలు కంది నందు తనిఖీ నిర్వహించారు. ఈ తనిఖీ నందు జిల్లా జడ్జీ జి. భవాని చంద్ర ముఖ్య అతిథి గా పాల్గొని సెంట్రల్ జైలు నందు ఉన్న బెరక్లు, గదులు, వంట గది, మరియు బాత్రూంలు జైలు ఆవరణ మొత్తం తిరిగి పరిశీలించి ఖైదీలను జైలులో ఉన్న సదుపాయాలను, భోజనం గూర్చి అడిగి తెలుసుకున్నారు. అన్ని ఖైదీలు బెరక్లు పరిశీలించి వారికీ కావాల్సిన అవసరాలు, సదుపాయాలు అన్ని అందించేలా చూడాలని జైలు సూపరింటెండెంట్ కి తెలియజేశారు. మరియు వారికీ ఖైదీలతో వారికీ సమయానికి బైల్స్, ములాఖత్ అందుతున్నాయ, కేసులు పరిష్కరించేందుకు న్యాయ సేవలు పొందేందుకు ఉచితంగా న్యాయవాదిని నియమిస్తామని ఖైదీలకు తెలియపరిచారు. మరియు జిల్లా జడ్జీ ఖైదీలకు పెడుతున్న భోజనం రుచి చారు. ఖైదీల కోసం వన్దే కూరగాయలు, బియ్యం, ఉన్న రూమ్ ని కూడా తనిఖీ చేశారు..




జైల్లో ఉన్న లీగల్ ఎయిడ్ క్లినిక్ కూడా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, బి. సౌజన్య మరియు జైలు సూపరింటెండెంట్ కాలా సాగర్, జైలు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# యోగాతో అంపూర్ణ ఆరోగ్య సౌభాగ్యం: జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి









కడప, జూన్ 21(భారత శక్తి) : మన దైనందిన జీవితంలో యోగా ఒక భాగంగా మారితే.. ప్రతి కుటుంబానికి ఆరోగ్య సౌభాగ్యం సిద్ధించడంతో పాటు.. మానసిక వికాసం మన సొంతం అవుతుందని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి వ్యాఖ్యానించారు. శనివారం ఉదయం 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని విశాఖ సముద్ర తీరంలోని ఆర్కె బీచ్ ప్రధాన మార్గంలో దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మరియు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, పలువురు ప్రముఖులు, పెద్ద ఎత్తున పౌరులు పాల్గొన్న యోగా కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షిస్తూ.. జిల్లా స్థాయిలో కడప వైఎస్ రాజారెడ్డి క్రికెట్ స్టేడియంలో యోగాంధ్ర మనోత్సవాల ముగింపు కార్యక్రమం ఉత్సాహభరితంగా సాగింది. కడప నగరపాలక సంస్థ, జిల్లా స్పోర్ట్స్ అథారిటీ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన "యోగా" కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి, రాష్ట్ర ప్రభుత్వ విప్, కడప ఎమ్మెల్యే ఆర్. మాధవిరెడ్డి, తెదేపా పొలిట్ బ్యూరో సభ్యులు ఆర్. శ్రీనివాసులు రెడ్డి, ఆంధ్రక్రికెట్ అసోసియేషన్ కడప స్టేడియం చైర్మన్ శ్రావణ్ రాజ్ రెడ్డి, జిల్లా ఎస్పీ ఈజి అశోక్ కుమార్, జేసీ అధితి సింగ్, కేఎంసి కమిషనర్ మనోజ్ రెడ్డి, కడప ఆర్డీవో జాన్ ఇర్విన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. జూన్ 21న 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ఈ యోగా కార్యక్రమానికి వేలాది మంది హాజరై యోగాసనాలు వేయడం.. శుభపరిణామం అన్నారు. ప్రపంచానికి యోగాను పరిచయం చేసిన మన దేశ ప్రధాని.. భారత దేశ ఖ్యాతిని, సనాతన ధర్మాన్ని, క్రమశిక్షణతో కూడిన జీవన విధానాలను, ఆరోగ్య సూత్రాలను దేశ ప్రజలకు, భవిష్యత్ తరాలకు అందించాలనే సాధాశయంతో 11 ఏళ్లుగా అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారన్నారు. అదే స్ఫోర్తితో.. మన రాష్ట్ర ముఖ్యమంత్రి యోగాంధ్ర మాసోత్సవాలను వివిధ రకాల థీములతో నిర్వహించడం జరిగిందన్నారు. యోగా సాధనతో మానసిక సమస్యలకు, శారీరక రుగ్మతల నుండి విముక్తి లభిస్తుందన్నారు. మంచి ఫలితాలు ఇస్తుందన్నారు. యోగా దినోత్సవం సందర్భంగా ప్రతి ఒక్కరూ యోగాసనాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. యోగా ఆసనాలు వేయడం ద్వారా.. సంపూర్ణ ఆరోగ్యం, మానసిక వికాసం, క్రమశిక్షణ, మెరుగైన జీవన విధానం అలవడుతాయన్నారు. దైనందిన జీవితంలో పలురకాల ఒత్తిళ్ల కారణంగా ఎంతో మంది అనేక శారీరక, మానసిక ఆరోగ్య రుగ్మతలను ఎదుర్కొంటున్నారన్నారు. వీటన్నింటినీ జయించి సంపూర్ణ ఆరోగ్యాన్నిచ్చే సులభతరమైన ఆరోగ్య సూత్రం యోగా మాత్రమే అన్నారు. ఆరోగ్య పరిరక్షణలో భాగంగా రోజులో కొంత సమయాన్ని వ్యాయామం, యోగా, ధ్యానం కోసం కేటాయించాలని కోరారు. కాగా జిల్లా యంత్రాంగం, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో వేలాదిగా జిల్లా ప్రజలు విస్తృతంగా పాల్గొని విజయవంతమ చేయడం అభినందనీయం అన్నారు. కడప నగరంలో వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన కార్యక్రమం నగర ప్రజల్లో నూతనోత్సాహం నింపిందన్నారు. ఈ కార్యక్రమంలో పిల్లలు, తల్లిదండ్రులు, అవ్వతాతలు మొదలైన మూడు కేటగిరీలకు చెందిన కుటుంబ సభ్యులు కలిసి పాల్గొనడం ఆనందదాయకమైన విషయం అన్నారు. యోగా ట్రైనర్లు యోగాపై అవగాహన, యోగా వలన కలిగే ఆరోగ్య ప్రయోజనాలను విశదీకరిస్తూ.. ప్రోటోకాల్ ప్రకారం యోగాసనాలపై అవగాహన కల్పించడం గొప్ప విషయం అన్నారు. ఈ యోగాంధ్ర మాసోత్సవాల్లో నేర్చుకున్న యోగా ఆసనాలను.. ప్రతి ఒక్కరూ కుటుంబ సంభులతో కలిసి నిత్య జీవితంలో భాగస్వామ్యం చేసుకోవాలని, కడప నగరంలో నెలకు కనీసం ఒక్క రోజైన ఇలా సామూహిక యోగా కార్యక్రమాన్ని అమలు చేసేలా చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వ విప్, కడప ఎమ్మెల్యే మాధవిరెడ్డి మాట్లాడుతూ... కొత్త ఆలోచనలు, కొత్త ఆవిష్కరణలు దేశ పురోభివృద్ధికి సోపానాలు అని... అదే మార్గంలో మన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అడుగులేస్తూ దేశానికే స్ఫూర్తిగా నిలుస్తున్నాయన్నారు. ప్రతి ఒక్కరూ యోగాసనాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. యోగాసనాలు వేయడం ద్వారా.. క్రమశిక్షణ, మెరుగైన జీవన విధానం అలవడుతుందన్నారు. ఈ యోగా కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ తమ స్వీయ బాధ్యతగా స్వీకరించి.. సామాజిక సరోగ్య పరిరక్షణకు పాటు పడాలన్నారు. ప్రతి ఇంటిలోనూ ప్రతి గ్రామంలోనూ ప్రతి మండలంలోనూ క్రమం తప్పకుండా యోగా కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ మాట్లాడుతూ... చదువుతో పాటు ఆటలు, శారీరక ఆరోగ్యం కూడా అంతే ముఖ్యం అన్న విషయాన్ని.. గుర్తెరిగిన మన ప్రభుత్వాలు యోగాను అత్యంత ప్రాధాన్యతతో... యోగాంధ్ర మాసోత్సవాలను నిర్వహించుకోవడం లక్షలదిమందికి యోగా పై అవగాహన పెంపొందించి, సంపూర్ణ ఆరోగ్యవంతులను చేయడం అభినందనీయం అన్నారు. ప్రతి ఒక్కరూ యోగాను నిత్యజీవితంలో ఒక దిన చర్యగా అలవర్చుకోవాలన్నారు. యోగాంధ్ర కార్యక్రమాల్లో జిల్లా యంత్రాంగం చేస్తున్న కార్యక్రమాలు ప్రశంసనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో సుమారు 5 వేల మంది కడప నగర పౌరులకు మాస్టర్ ట్రైనర్లు యోగాసనాలపై అవగాహన, శిక్షణ ఇవ్వగా.. జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి, హాజరైన ముఖ్య అతిధులు యోగాసనాలు వేసి జిల్లా ప్రజల్లో స్ఫూర్తిగా నింపారు. కార్యక్రమంలో విద్యార్థులు ప్రదర్శించిన పలు రకాల సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు చూపరులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కడప ఆర్డిఓ జాన్ ఇర్విన్, జిల్లా పర్యాటక అధికారి సురేష్ కుమార్, డీఆర్డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ రాజలక్ష్మి, మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ కిరణ్ కుమార్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రంగస్వామి, జెడ్పి సీఈవో ఓబులమ్మ, డిపివో రాజ్యలక్ష్మి, డిఎమ్ హెచ్ఓ డా. నాగరాజు, జిల్లా ఫైర్ అధికారి ధర్మారావు, డిఎస్‌డిఓ జగన్నాథ రెడ్డి, ఆయుష్ నోడల్ అధికారి డా. మురళి, యోగ గురువు ప్రసాద్ టీమ్, తదితర జిల్లా అధికారులు, కుటుంబ సభ్యులు, విద్యార్థులు, పలువురు ఉద్యోగులు, ఎన్జీవో ప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

# మాదక ద్రవ్యాల నిరోధానికి సమష్టిగా కృషి చేయాలి...!

## -వన్ ఎర్త్-వన్ హెల్త్' కార్యక్రమంలో భాగంగా 'యోగా సాధకులతో ఈగల్ ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల నిరోధక ప్రతిజ్ఞ



కడప, జూన్ 21(భారత శక్తి): జిల్లాలో మాదక ద్రవ్యాల నిరోధానికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని.. జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి, జిల్లా ఎస్పీ ఈజీ అశోక్ కుమార్ లు పిలుపునిచ్చారు. శనివారం ఉదయం 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా స్థాయిలో కడప వైఎస్ రాజారెడ్డి క్రికెట్ స్టేడియంలో జరిగిన యోగాంధ్ర మనోత్సవాల ముగింపు కార్యక్రమంలో.. 'వన్ ఎర్త్-వన్ హెల్త్' నినాదంతో ఈగల్ (ఎలైట్ యాంటి-నార్కోటిక్స్ (గ్రూప్ ఫర్ లా ఎన్ఫోర్స్ మెంట్) ఆధ్వర్యంలో రూపొందించిన అవగాహన పోస్టర్లను జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి, జిల్లా ఎస్పీ ఈజీ అశోక్ కుమార్ లు ముఖ్య అతిధులతో కలిసి ఆవిష్కరించారు. ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో.. రాష్ట్ర ప్రభుత్వ విప్, కడప ఎమ్మెల్యే ఆర్. మాధవి రెడ్డి, తెదేపా పొలిట్ బ్యూరో సభ్యులు ఆర్. శ్రీనివాసులు రెడ్డి, ఆంధ్రక్రికెట్ అసోసియేషన్ కడప స్టేడియం చైర్మన్ శ్రావణ్ రాజ్ రెడ్డి, జేసీ అధితి సింగ్, కేఎంసి కమిషనర్ మనోజ్ రెడ్డి, కడప ఆర్డీవో జాన్ ఇర్విన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ.. పోస్టర్లను ప్రదర్శిస్తూ "మాదక ద్రవ్యాల అక్రమ రవాణా మరియు దుర్వినియోగంపై జరుగుతున్న పోరాటంలో క్రియాశీల భాగస్వామిని అవుతానని, డ్రగ్స్ వల్ల కలిగే దుష్పరిణామాలు గురించి సంపూర్ణ అవగాహన కలిగి ఉండి నాతోపాటు ఏ ఒక్కరూ డ్రగ్స్ బారిన పడకుండా ఉండడానికి కృషి చేస్తానని, డ్రగ్స్ అమ్మకం, కొనుగోలు చేసే వ్యక్తుల సమాచారాన్ని పోలీసులకు తెలియచేస్తానని డ్రగ్స్ రహిత జీవన శైలిని అనుసరిస్తానని, డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యంగా సాగుతున్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సంకల్పంలో భాగస్వామిని అవుతానని ప్రతిజ్ఞ చేయుచున్నాను." అని యోగాకు హాజరైనవారితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి జగన్నాథ రెడ్డి, ఆయుష్ నోడల్ అధికారి డా. ఎస్. మురళి బాబు, జిల్లా పర్యాటక అధికారి సురేష్ కుమార్, మెప్మా పి.డి కిరణ్ కుమార్, 'ఈగల్' సిబ్బంది, పలువురు జిల్లా అధికారులు, విద్యార్థులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# స్వచ్ఛ జిల్లాగా "వైఎస్ఆర్ కడప": జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి

## -స్వచ్ఛ దివస్ లో భాగంగా.. స్వచ్ఛ ప్రతిజ్ఞ

కడప, జూన్ 21(భారత శక్తి) : స్వర్ణాంధ్ర, స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ సాధనలో.. భాగంగా వైఎస్ఆర్ కడప జిల్లాను కాలుష్య రహిత స్వచ్ఛ జిల్లాగా తీర్చిదిద్దుతామని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. శనివారం కడప వైఎస్ రాజారెడ్డి క్రికెట్ స్టేడియంలో నిర్వహించిన యోగాంధ్ర వేదికపై.. స్వర్ణాంధ్ర, స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ "స్వచ్ఛ దివస్" కార్యక్రమాన్ని పురస్కరించుకుని ప్రభుత్వ విప్, కడప నియోజకవర్గ ఎమ్మెల్యే ఆర్. మాధవి రెడ్డి, జిల్లా ఎస్పీ ఈజీ అశోక్ కుమార్, జేసీ అదితిసింగ్ లతో కలిసి జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి.. స్వచ్ఛ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం కడప నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ప్రారంభించిన స్వచ్ఛ దివస్ ఈ కార్యక్రమంలో భాగంగా.. తెదేపా పొలిట్ బ్యూరో సభ్యులు ఆర్. శ్రీనివాసులు రెడ్డి, ఎమ్మెల్యే ఆర్. మాధవి రెడ్డి లతో క్రికెట్ స్టేడియంలో మొక్కలు నాటించారు.







ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి మాట్లాడుతూ.. స్వర్ణాంధ్ర, స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతి 3వ శనివారం చేపడుతున్న స్వచ్ఛ దివస్ కార్యక్రమంతో స్వచ్ఛత వైపు ఒక ముందడుగు వేద్దామన్నారు. వేస్ట్ మేనేజ్మెంట్ అంశానికి సంబంధించి ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలన్నారు. ప్రతి పౌరుడు మూడవ శనివారాన్ని స్వచ్ఛ ఆంధ్రగా పాటించి ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మిద్దాం అన్నారు. ప్రతినెల మూడవ శనివారాన్ని స్వర్ణ ఆంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర పాటించి ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మిద్దామని పిలుపునిచ్చారు. జిల్లా అంతట పరిశుభ్రత కార్యక్రమాలను పటిష్టంగా నిర్వహించాలని, తడి పొడి చెత్తలపై ప్రజల్లో అవగాహన పెంచాలని సూచించారు. ఈ వేస్ట్ ఎక్కువగా పట్టణ ప్రాంతాల్లో ఉంటుందని... దాని పునర్వినియోగంపై ప్రజల్లో అవగాహన చైతన్య కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులకు సూచించారు.

మన జిల్లాను ఆరోగ్య జిల్లాగా, కాలుష్య రహిత జిల్లాగా తీర్చడంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని కోరారు. ఎమ్మెల్యే మాధవి రెడ్డి మాట్లాడుతూ... మంచి ఆలోచనలు, ఆరోగ్యవంతమైన శరీరం, స్వచ్ఛమైన వాతావరణం, ఇంటి దగ్గర, పనిచేసే చోట పరిశుభ్రతలతో మన రాష్ట్రాన్ని స్వర్ణ ఆంధ్రగా, స్వచ్ఛ ఆంధ్రగా, మన జిల్లాను స్వచ్ఛమైన కాలుష్య రహిత జిల్లాగా తీర్చిదిద్దుకుందామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కడప మున్సిపల్ కమిషనర్ మనోజ్ రెడ్డి, కడప ఆర్డీవో జాన్ ఇర్విన్, కేఎంసి అదనపు కమిషనర్ రాకేష్ చంద్ర, జెడ్పి సీఈవో ఓబులమ్మ, డిపివో రాజ్యలక్ష్మి, అన్ని శాఖల జిల్లా అధికారులు, వైద్య ఆరోగ్య, ప్రజారోగ్య శాఖల అధికారులు, ఇంజనీర్లు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సేవా సంస్థలు, మహిళా సంఘాల సభ్యులు, విద్యార్థులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

# అంగన్వాడీల్లో మెరుగైన వసతుల కల్పనకు చర్యలు తీసుకోండి:అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్



భారత శక్తి ఉమ్మడి అదిలాబాద్ జిల్లా బ్యూరో, జూన్ 21: నిర్మల్ జిల్లాలోని అన్ని అంగన్వాడీ కేంద్రాల్లో సౌకర్యాలు మరింత మెరుగ్గా ఉండేలా చర్యలు తీసుకోవాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆయన అంగన్వాడీలలో వసతుల కల్పనకు సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, అంగన్వాడీలు చిన్నారుల కోసం ప్రాథమిక విద్య కేంద్రాలుగా పనిచేస్తున్నందున, విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో అభివృద్ధి చెందేలా అవసరమైన సౌకర్యాలు కల్పించాలని సూచించారు. ప్రతి అంగన్వాడీలో ఆకర్షణీయమైన పెయింటింగ్స్, ఆటబొమ్మలు ఏర్పాటు చేసి పిల్లలకు అనుకూలమైన వాతావరణం కల్పించాలని చెప్పారు. నాణ్యమైన, రుచికరమైన ఆహారం క్రమం తప్పకుండా అందించాలని, పరిసరాలను శుభ్రంగా ఉంచుతూ పరిశుద్ధ్యాన్ని పాటించాలని సూచించారు. పచ్చదనం పెంపొందించేందుకు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలన్నారు. వర్షాకాలంలో చిన్నారులకు ఇబ్బందులు లేకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో సిడిపిఓలు నాగమణి, నాగలక్ష్మి, సరిత, సమన్వయకర్త నిరంజన్ రెడ్డి, మండలాల పర్యవేక్షకులు, అధికారులు, సిబ్బంది, తదితరులు, పాల్గొన్నారు.

# పటాన్చెరులో అంగరంగ వైభవంగా అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు

**-హాజరైన వేలాదిమంది విద్యార్థులు, వివిధ వర్గాల ప్రజలు, అధికారులు, మాజీ ప్రజా ప్రతినిధులు**

**-యోగా విశిష్టతను తెలిపేలా యోగా భంగిమలు.**

**-యోగా దినచర్యలో భాగం కావాలి**

**-ఆరోగ్యకరమైన జీవనశైలికి యోగా సువర్ణ అవకాశం**

**-సమాజం నుండి డ్రగ్స్ ను వెలివేయాలి: శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి**



పటాన్‌చెరు, జూన్ 21 (భారత శక్తి):అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి ఆధ్వర్యంలో పట్టణంలోని మైత్రి మైదానంలో నిర్వహించిన యోగా దినోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. పటాన్చెరు చరిత్రలోనే మొట్ట మొదటిసారి వేలాదిమందితో కలిసి సామూహిక యోగా కార్యక్రమం నిర్వహించారు.ఉదయం 6:30 నుండి 09:00 గంటల వరకు పతాంజలి యోగ సమితి శిక్షకుల సౌజన్యంతో రెండున్నర గంటల పాటు వివిధ రకాల యోగా భంగిమలు ప్రదర్శిస్తూ.. ప్రతి ఒక్కరిని భాగస్వాములు అయ్యేలా కార్యక్రమాన్ని నిర్వహించారు. యోగ ప్రాముఖ్యతను తమ ఆసనాల ద్వారా వివరిస్తూ సంపూర్ణమైన ఆరోగ్య జీవనశైలికి యోగ ఏ విధంగా ఉపయోగపడుతుందో వివరించారు. ఈ సందర్భంగా పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రస్తుత పోటీ ప్రపంచంలో మనిషి తన ఆరోగ్యం పై దృష్టి పెట్టకపోవడం మూలంగా మానసిక, శారీరక సమస్యలతో నిరంతరం బాధపడుతూ అనారోగ్యకరమైన జీవితాలను కొనసాగిస్తున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని నియోజకవర్గంలోని ప్రజలకు యోగ ప్రాముఖ్యతను తెలియజేయాలన్న సమున్నత లక్ష్యంతో.. మైత్రి మైదానంలో యోగ దినోత్సవ వేడుకలు నిర్వహించడం జరిగిందని తెలిపారు. మనిషి నిత్యం ఎదుర్కొనే మానసిక, ఆరోగ్య సమస్యలకు సర్వరోగ నివారిని యోగ అని అన్నారు. యోగాకు కులం మతం ప్రాంతం జాతి లేదని, ప్రతి ఒక్కరి జీవితంలో ఒక భాగమని తెలిపారు. యావత్తు ప్రపంచానికి భారతదేశం అందించిన మహోన్నత సాధనం యోగ అని అన్నారు. ఈ సందర్భంగా పటాన్చెరు సబ్ డివిజన్ పోలీసుల ఆధ్వర్యంలో మత్తు పదార్థాల వ్యతిరేక అవగాహన వారోత్సవాలను ఎమ్మెల్యే జిఎంఆర్ లాంచనంగా ప్రారంభించారు. విద్యార్థి దశనుండే మత్తు పదార్థాల వినియోగం, వాటి దుష్ఫలితాలపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ప్రస్తుత సమాజంలో డ్రగ్స్ కల్చర్ ఎక్కువగా కొనసాగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి పౌరుడు తన బాధ్యతగా డ్రగ్స్ కి వ్యతిరేకంగా పోరాటం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఎక్కడైనా ఎవరైనా డ్రగ్స్ వినియోగిస్తే వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

తెలంగాణ జాతిపిత ప్రొఫెసర్ జయశంకర్..

తొలిమలి దశ తెలంగాణ పోరాటంలో కీలకపాత్ర పోషించడంతోపాటు.. ప్రత్యేక తెలంగాణ సాధనకు తన జీవితాన్ని త్యాగం చేసిన మహోన్నత వ్యక్తి ప్రొఫెసర్ జయశంకర్ అని కొనియాడారు. ప్రొఫెసర్ జయశంకర్ వర్ధంతిని పురస్కరించుకొని మైత్రి మైదానంలో ఏర్పాటు చేసిన యోగా దినోత్సవ వేడుకల్లో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమాల్లో పటాన్చెరు డిఎస్పి ప్రభాకర్, భారత్ స్వాభిమాన్ అధ్యక్షులు శ్రీధర్ రావు, పతంజలి యోగాసమితి రాష్ట్ర అధ్యక్షులు పస్పరి శివుడు, యోగ గురువు శివకుమార్, తాజా మాజీ ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల కరస్పాండెంట్లు, ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు, క్రీడాకారులు, తదితరులు పాల్గొన్నారు.

# వాగ్దేవి పాఠశాలలో యోగా డే వేడుకలు



ఉమ్మడి వరంగల్ బ్యూరో(భారత శక్తి)జూన్21: హనుమకొండ శ్రీనగర్ కాలనీలోని వాగ్దేవి గ్లోబల్ స్మార్ట్ పబ్లిక్ స్కూల్లో శనివారం అంతర్జాతీయ యోగా దినోత్సవం వేడుకలు వాగ్దేవి విద్యాపీఠం ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ నల్ల వాసుదేవరెడ్డి, మేనేజింగ్ డైరెక్టర్ వీసం స్వప్న ఆధ్వర్యంలో నిర్వహించబడ్డాయి. అనంతరం వారు మాట్లాడుతూ యోగాతో మానసిక ప్రశాంతత, శారీరక దృఢత్వం కలుగుతుందని, యోగా నిత్యం సాధన చేయటం వలన ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో యోగా టీచర్ రాజేందర్, ప్రిన్సిపాల్ సమత, అడ్మిన్ శోభారాణి, ఉపాధ్యాయునులు పూజిత, జ్యోతి, విద్యార్థిని,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# యోగా దినోత్సవం సందర్భంగా యోగా శిబిరంలో పాల్గొన్న కామారెడ్డి ఎమ్మెల్యే శ్రీ కాటిపల్లి వెంకట రమణ రెడ్డి

(భారత శక్తి ప్రతినిధి) కామారెడ్డి, జూన్ 21: అంతర్జాతీయ యోగా దినోత్సవం జూన్ 21 సందర్భంగా కామారెడ్డి జిల్లా కేంద్రంలోని యోగా భవన్ లో ఏర్పాటు చేసిన యోగా శిబిరంలో కామారెడ్డి శాసన సభ్యులు శ్రీ కాటిపల్లి వెంకట రమణ రెడ్డి పాల్గొన్నారు.



అనంతరం కామారెడ్డి జిల్లా కేంద్రంలో కొలువై ఉన్న కోడూరి హనుమాన్ ఆలయ పునర్నిర్మాణ పనులలో భాగంగా శనివారం ఆలయ ముఖద్వార కడప నిర్మాణం పనుల సందర్భంగా ఆలయంలో పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు.







# కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ఆర్యసమాజ్ మందిరంలో ఏర్పాటు చేసిన యోగా శిబిరంలో పాల్గొన్న బీజేపీ నాయకులు

(భారత శక్తి ప్రతినిధి) కామారెడ్డి, జూన్ 21: అంతర్జాతీయ యోగా దినోత్సవం జూన్ 21 సందర్భంగా కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ఆర్యసమాజ్ మందిరం లో ఏర్పాటు చేసిన యోగా శిబిరంలో పలువురు బీజేపీ నాయకులు, ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

# గీతంలో ఉత్సాహంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం

**-చురుకుగా పాల్గొన్న విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది**



పటాన్‌చెరు,, జూన్ 21 (భారత శక్తి): హైదరాబాదులోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో శనివారం 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. 'ఒక భూమి కోసం యోగా, ఒక ఆరోగ్యం' ఇతివృత్తంలో స్పోర్ట్స్ డైరెక్టరేట్ నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది చురుకుగా పాల్గొన్నారు. యోగా సాధన ద్వారా సమగ్ర శ్రేయస్సు, పర్యావరణ స్పృహను ప్రోత్సహించడం లక్ష్యంగా ఈ వేడుక సాగింది. శారీరక, మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవడంలో యోగాభ్యాసాల ప్రాముఖ్యతను నిపుణుడైన యోగా బోధకుడు పరిచయం చేయడంతో ఈ కార్యక్రమం ప్రారంభమైంది. ఆ తరువాత భారత ప్రభుత్వ ఆయుష్ మంత్రిత్వ శాఖ సూచించిన సాధారణ యోగా ప్రోటోకాల్ ప్రకారం కార్యక్రమాన్ని కొనసాగించారు. యోగాసనాలు, కపాలభాతి, ప్రాణాయామం, ధ్యానం వంటివి సాధన చేశారు.క్రమం తప్పకుండా యోగా సాధన చేయడం వల్ల పని ప్రదేశంలో ఒత్తిడి గణనీయంగా తగ్గుతుందని, సమగ్ర శ్రేయస్సును ఎలా పెంచుతుందో బోధకుడు వివరించారు. శాంతి ప్రార్థనతో ఈ యోగ సాధన కార్యక్రమం ముగిసింది.గీతం హైదరాబాదు అదనపు ఉప కులపతి ప్రొఫెసర్ డీ.ఎస్. రావుబీ రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, ఆతిథ్య విభాగం-క్యాంపస్ లైఫ్ డైరెక్టర్ అంబికా ఫిలిప్, పలువురు విభాగాధిపతులు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆరోగ్యకరమైన జీవనశైలి కోసం పురాతన క్రమశిక్షణను స్వీకరించడంలోని ఔచిత్యాన్ని వారు ఆచరణ రూపంలో చాటిచెప్పారు.

# ప్రతి ఒక్కరూ దినచర్యలో యోగాను భాగంగా చేసుకోవాలి: పి ప్రావీణ్య, జిల్లా కలెక్టర్ .




సంగారెడ్డి, జూన్ 21 (భారత శక్తి):సంగారెడ్డి పట్టణంలోని తార డిగ్రీ కళాశాలలో 11 వ ,అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం యోగ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య ముఖ్య అతిథిగా హాజరై యోగాసనాలు చేశారు.యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని అధికారులు,విద్యార్థులు యోగాను నిత్య జీవితంలో అనుసరించేందుకు ప్రతిజ్ఞ చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ పి. ప్రావీణ్య మాట్లాడుతూ. ... యోగ సాధన ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యాన్ని మెరుగు పర్చు కోవచ్చున్నారు .ప్రతి ఒక్కరూ దినచర్యలో యోగాను అలవాటుగా చేసుకోవాలి అని ఆకాంక్షించారు.యోగ అభ్యాసం ద్వారా విద్యార్థులు శారీరకంగా ఆరోగ్యంగా ఉండేలా, మానసికంగా స్థిరతను పొందేలా చేయవచ్చును.అలాగే, చదువుపై దృష్టిని కేంద్రీకరించే సామర్థ్యం పెరుగుతుంది.యోగ అభ్యాసం విద్యార్థుల్లో ఒత్తిడి నివారణకు, ఏకాగ్రత పెంపుదలకు దోహదం చేస్తుంది.నిత్య జీవితంలో యోగా భాగం అయితే, విద్యార్థులు అభ్యాసం, అభివృద్ధిలో ముందంజలో ఉంటారన్నారు.యోగ సాధన ద్వారా విద్యార్థులు మెరుగైన ఆరోగ్యం, చురుకుదనం సాధించగలుగుతారు.ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి గాయత్రి దేవి, మహిళా మరియు శిశు సంక్షేమ అధికారి (డీడబ్ల్యుఓ) లలిత కుమారి, యువజన సేవల శాఖ అధికారి ఖాసీం బెగ్, ఆయుష్ శాఖ అధికారులు, పలు ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు, పోలీస్ శాఖ అధికారులు,కళాశాల అధ్యాపకులు, ఎన్సిసి విద్యార్థులు, విద్యార్థి, విద్యార్థినులు సిబ్బంది, స్థానిక పౌరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# కలెక్టర్ ను కలసిన ఎమ్మెల్యే లు

సంగారెడ్డి, భారత శక్తి ప్రతినిధి, జూన్ 21:సంగారెడ్డి జిల్లా నూతన కలెక్టర్ గా బాధ్యతలు చేపట్టిన పి. ప్రావీణ్య ను ఎమ్మెల్యేలు చింత ప్రభాకర్,మాణిక్ రావు లు మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యేలు కలెక్టరేట్ కార్యాలయంలో కలెక్టర్ ను కలసి పుస్తకాలను అందజేసి అభినందనలు తెలిపారు. ఆయా నియోజకవర్గాల అభివృద్ధి అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో డీసీఎంస్ చైర్మన్ శివకుమార్ తదితరులు ఉన్నారు.



# సింగరేణి పాఠశాల స్వర్ణోత్సవాలను విజయవంతం చేయాలి



మందమర్రి, జూన్ 21 (భారత శక్తి): మందమర్రి లోని సింగరేణి ఉన్నత పాఠశాల 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న శుభ సందర్భంగా సింగరేణి యాజమాన్యం నిర్వహించబోయే స్వర్ణోత్సవాలను విజయవంతం చేయాలని ఎడ్యుకేషనల్ సొసైటీ కార్యదర్శి గుండ శ్రీనివాస్ పిలుపునిచ్చారు. మందమర్రి ఏరియా సింగరేణి ఉన్నత పాఠశాలలో శనివారం పాఠశాల ప్రధానోపాధ్యాయ ఉపాధ్యాయ బృందం ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ, సింగరేణి సంస్థ ఆవిర్భవించి దేశానికి వెలుగులు పంచుతూ ఉద్యోగుల కుటుంబాలు ఉన్నత శిఖరాగ్రానికి చేరడానికి విద్యా అవసరమని భావించిన అప్పటి సీఎండి బి.ఎన్.రామన్ ఆలోచనల నుండి మొట్టమొదటిగా ప్రారంభించుకున్న మందమర్రి కళ్యాణిఖని ఏరియాలోని సింగరేణి ఉన్నత (ఎయిడెడ్) పాఠశాల 50 సంవత్సరాల స్వర్ణోత్సవ ఉత్సవాలకు సిద్ధమవుతున్న సందర్భాన్ని పురస్కరించుకొని అందరూ కలిసి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. బిఎన్ రామన్ ఆలోచనలతో పుట్టుకొచ్చిన విద్యా బోధన విధానం మధ్యలో తగ్గినప్పటికీ ప్రస్తుత చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ బలరాం నాయక్ నేతృత్వంలో కార్పోరేట్ విద్యాసంస్థలు అందించలేని అప్గ్రేడ్ కోర్సులను అందిస్తూ ముందుకు సాగుతుందన్నారు. మారుమూల ప్రాంత ప్రజలకు కూడా నామ మాత్రపు ఖర్చులతో విలువైన విద్యను అందించాలని సింగరేణి సంకల్పిస్తుందని ప్రస్తావించారు. సీబీఎస్సీ విద్యను సింగరేణి పాఠశాలలో లాంచనంగా ప్రారంభించి అన్ని పాఠశాలలకు విస్తరించే యోచనలో యాజమాన్యం ముందుకు సాగుతుందన్నారు. ప్రపంచాన్ని శాసించే దిశగా ఏఐ టెక్నాలజీ వృద్ధి చెందుతున్న సందర్భాన్ని దృష్టిలో ఉంచుకొని సింగరేణి పాఠశాలల్లో తీసుకువచ్చే ప్రయత్నాలు ముమ్మరంగా జరుగుతున్నాయని ఉద్ఘాటించారు. మందమర్రి సింగరేణి ఉన్నత పాఠశాలలో కాంట్రాక్టు పద్ధతిన బోధనలు అందిస్తున్న ఉపాధ్యాయుల అసౌకర్యాలను గుర్తించి వారికి తగు న్యాయం జరిగే విధంగా సీఎండీ దృష్టికి తీసుకువెళ్లినట్టు వెల్లడించారు. వారికి సింగరేణి సంస్థ అందిస్తున్న సౌకర్యాలను కల్పించే విధంగా కృషి చేస్తానన్నారు. సింగరేణి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పాలిటెక్నిక్ ఇంటర్ డిగ్రీ పీజీ మహిళా కళాశాలలోని విద్యార్థులు క్రమశిక్షణకు మారుపేరుగా నిలుస్తున్నారని కొనియాడారు. పట్టభద్రులు, అర్హులైన అభ్యర్థులను ఉపాధ్యాయులుగా ఎంచుకొని బోధనలు సాగిస్తున్న సింగరేణి పాఠశాలల్లో కంప్యూటర్ సైన్స్ డిజిటల్ ల్యాబ్ లతో పాటు స్వచ్ఛమైన మినరల్ వాటర్ ప్లాంట్ సౌకర్యం, ఉచిత భోజనం, ఉచిత యూనిఫాం, ఉచిత పుస్తకాలు అందిస్తూ పచ్చని చెట్లు, వెలుతురు ప్రసరించే తరగతి గదులు విశాలమైన పది ఎకరాల స్థలంలో ప్రకృతి ఒడిలో విద్య బోధన అందించే పాఠశాలలు కేవలం సింగరేణికి మాత్రమే సొంతమని గర్వంగా చెప్పారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ పురుషోత్తం, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

# కేంద్ర ప్రభుత్వ పథకాలకు ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయాలి:జిల్లా వ్యవసాయ అధికారి శివకుమార్



గుమ్మడిదల మున్సిపాలిటీ, జూన్ 21 (భారత శక్తి) :సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలంలో జరుతున్న ఫార్మర్ రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని శనివారం జిల్లా వ్యవసాయ అధికారి కె.శివప్రసాద్ పరిశీలించి వ్యవసాయ అధికారులకు మరియు రైతులకు ఫార్మర్స్ రిజిస్ట్రేషన్ యొక్క ప్రాముఖ్యతను వివరించారు. ప్రతీ రైతు కేంద్రం ప్రభుత్వం పథకాలు పొందాలంటే రైతు రిజిస్ట్రేషన్ తప్పనిసరి అని తెలిపారు.అలాగే ప్రతీ రోజు ఒక్కో గ్రామం వెళ్లి రైతులకు ఫార్మర్ రిజిస్ట్రేషన్ చెయ్యాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. మాంబపూర్ మరియు నల్లవల్లి గ్రామాలలో జరుగుతున్న ఫార్మర్ రిజిస్ట్రేషన్ పరిశీలించారు.ఈ కార్యక్రమంలో ఏఓ శ్రీనివాసరావు, ఏఈఓ లు నిఖిత, ప్రణవి పాల్గొన్నారు.

# గుమ్మడిదల లో ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం

గుమ్మడిదల,భారత శక్తి ప్రతినిధి, జూన్ 21: సంగారెడ్డి జిల్లా జిల్లా గుమ్మడిదల మున్సిపల్ కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో మైత్రి ఫౌండేషన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహించారు ఈ కార్యక్రమంలో యోగా శిక్షకులు చెన్నపురం వంశీ, రమేష్ మరియు సాయి చరణ్ పాల్గొని విద్యార్థులచే యోగాసనాలు చేయించారు. మైత్రి ఫౌండేషన్ చైర్మన్ చెన్నంశెట్టి ఉదయ్ కుమార్ మాట్లాడుతూ యోగ శారీరక, మానసిక మరియు ఆధ్యాత్మిక ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో సహాయపడుతుందని ఒత్తిడిని తగ్గించి ఏకాగ్రతను మరియు రోగనిరోధక శక్తిని పెంచుతుందని విద్యార్థులకు తెలియజేశారు దేశ ప్రధాని నరేంద్ర మోడీ వలన యోగాకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు లభించిందని ప్రపంచవ్యాప్తంగా సుమారు193 దేశాల్లో ఈ అంతర్జాతీయ యోగా దినోత్సవం అని నిర్వహిస్తున్నారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజు ఉపాధ్యాయులు సబితా, పూజిత, ఆనంద్ మరియు నాగరాజు



ఫౌండేషన్ సభ్యులు నవీన్ సాగర్, రాము, పాండు తదితరులు పాల్గొన్నారు.

# సదాశివపేట కేజీబీబీ నీ ఆకస్మిక తనిఖీ చేసిన కలెక్టర్

## -ఏకరూప దుస్తుల పంపిణీలో ఆలస్యంపై కలెక్టర్ ఆగ్రహం

## స్పెషల్ ఆఫీసర్, ఇంచార్జి ప్రిన్సిపాల్ కు షోకేస్ నోటీసు లు





సంగారెడ్డి, భారత శక్తి ప్రతినిధి, జూన్ 21: సంగారెడ్డి జిల్లా సదాశివపేట పట్టణంలోని సిద్ధాపూర్ రోడ్ లో గల కేజీబీవీ బాలికల పాఠశాలను జిల్లా కలెక్టర్ పి .ప్రావీణ్య శనివారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు.ఈ సందర్భంగా పాఠశాలలో స్టోర్ రూమ్, వంటగదిని పరిశీలించారు. విద్యార్థులకు అందజేస్తున్న ఆహారాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఉదయం టిఫిన్ మధ్యాహ్న భోజనం ఎలా ఉంటుంది విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం నూతన మెనూ ప్రకారం అందించాలని ఈ సందర్భంగా సిబ్బందికి కలెక్టర్ ఆదేశించారు. విద్యార్థులకు ఏకరూప దుస్తుల పంపిణీలో జాప్యం జరగడం పట్ల కలెక్టర్ ఎంఈఓ శంకర్ పై ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం సాయంత్రంలోగా విద్యార్థులకు ఏకరూప దుస్తుల పంపిణీ పూర్తి కావాలని ఎంఈఓ ను ఆదేశించారు. ఈ సందర్భంగా పాఠశాల ఇన్చార్జి ప్రిన్సిపాల్ ఊర్మిళ, స్పెషల్ ఆఫీసర్. లలిత,లకు షోకాసు నోటీసులు అందజేశారు.ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# 425 కేజీల క్లోరోహైడ్రేడ్ పట్టివేత.

## - కేజీ ఆల్ఫా జోలం సీజ్.

## - రెండు కార్లను ఐదుగురు వ్యక్తులను అరెస్ట్.

భారత శక్తి ఉమ్మడి అదిలాబాద్ జిల్లా బ్యూరో, జూన్ 21: నిర్మల్ జిల్లా లో ఈత చెట్లు ఒట్టి మొద్దులయ్యాయి.. ఈత కల్లు బంగారం అయ్యింది.. మందు కలిపిన కల్లు తాగిన కళ్ళకు నిండుశు లయ్యాయి అన్నట్లుగా... నేడు కల్లు మండువాల్లోనూ కళ్ళు దుకాణాల్లో కల్తీకల్లు రాజ్యమేలుతుంది.తాడి ఈత చెట్లు ఎక్కడం.. గీయడం.. లాంటి మరిచిన గౌడ్ అన్నలు అల్ఫా జోలం, క్లోరోహైడ్రేడ్ లాంటి విష పదార్థాలతో కల్తీకల్లును తయారుచేసి అమ్మకాలు జరుపుతూ ప్రజల ప్రాణాలతో జలగాటమాడుతున్నారు. కల్తీ కల్లు తయారుకు వినియోగించే క్లోరోహైడ్రేడ్ తయారీ యూనిట్ ను శనివారం ఎక్సైజ్ స్టేట్ టాస్క్ ఫోర్స్, ఎక్సైజ్ సిబ్బంది కలిసి తయారీ యూనిట్ ని పట్టుకున్నారు.ఈ యూనిట్లో తయారైన 425 కేజీల క్లోరోహైడ్రేడ్ ను స్వాధీనం చేసుకున్నారు. మరో అడుగు ముందుకు వేసినఈ ప్రత్యేక టీములు వారి వద్ద గుప్తంగా దాచిపెట్టిన రూ.





10 లక్షల విలువ చేసే ఒక కేజీ ఆల్ఫా జోలమును రెండు కార్లను నలుగురు వ్యక్తులను అరెస్టు చేసి తమ సత్తా చాటుకున్నారు.

వివరాల్లోకి వెళ్తే..

నిర్మల్ టు బైంసా రహదారిలో చిట్యాల ప్రాంతంలో ఒక మారుమూల ప్రాంతంగా ఉన్నటువంటి వ్యవసాయ క్షేత్రంలో నిర్మాణం చేపట్టిన గృహంలో క్లోరోహైడ్రేడ్ తయారి యూనిట్ ను ఏర్పాటు చేశారు.బుర్ర రమేష్ గౌడ్, రామా గౌడ్ లనే ఇద్దరు వ్యక్తులు కలిసి ఈ యూనిట్ ని ఏర్పాటు చేశారు. ఈ యూనిట్ తయారీ వద్ద శ్రీనివాస్ గౌడ్,రాజశేఖర్ గౌడ్, రాజు గౌడ్ అనే ముగ్గురిని వ్యక్తులు కూడా అక్కడే ఉండి తయారీని పర్యవేక్షిస్తున్నారు. ముంబైలోని భీమండి ప్రాంతంలో క్లోరో అనే ద్రవపదార్థాన్ని తీసుకువచ్చి 50 లీటర్లకు తొమ్మిది లీటర్ల నీరును కలిపి డ్రంబుల్లో పోసి గుంతలు తవ్వి చుట్టూ ఐస్ గడ్డలను ఏర్పాటు చేసి సుమారు పది రోజులపాటు అనంతరం గడ్డ కట్టిన తర్వాత దాన్ని క్లోరోహైడ్రేడ్ గా తయారుచేసి కల్తీ కళ్ళు విక్రయానికి వినియోగిస్తున్నట్లు నిందితులు విచారణలో అంగీకరించారు.నలుగురు వ్యక్తులతో పాటు ఐదు సెల్ ఫోన్ లను 17 క్లోరోహైడ్రేడ్ బ్యాగులను కేజీ ఆల్ఫాజోలం ను, రెండు కార్లను స్వాధీనం చేసుకొని నలుగురుని అరెస్ట్ చేసినట్లు ఎస్ టి ఎఫ్ బి టీం లీడర్ ప్రదీప్ రావు తెలిపారు.ఈ దాడిలో టీజీ న్యాబ్ నుంచి రూపేష్ ఐపిఎస్,సిఐ రమేష్, పూర్ణేశ్వర్ ,నిర్మల్ సిఐ రంగస్వామి ఎస్ టి ఎఫ్ బి టీం ఎస్సై బాలరాజు నితిన్ కౌశిక్ లతో పాటు పాలూరు సిబ్బంది ఈ దాడిలో పాల్గొన్నారు.పట్టుకున్న 425 కేజీల క్లోరోహైడ్రేడ్ విలువ రూ. 10 లక్షలు, రూ. 10 లక్షల విలువ చేసే ఆల్ఫా జోలం 15 లక్షల విలువ చేసే రెండు కార్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్టిఎఫ్ పోలీసులు పేర్కొన్నారు.కల్తీ కళ్ళు తయారీలో వినియోగించే క్లోరోహైడ్రేడ్ యూనిట్ ని పట్టుకున్నందుకు అండ్ ఫోర్స్ ఎక్సైజ్ ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టర్ షానవాజ్ ఖాసీం అభినందించారు.

# ప్రొఫెసర్ జయశంకర్ వర్ధంతిని ఘనంగా నిర్వహించిన బిఆర్ఎస్ నేత గోవర్ధన్ రెడ్డి



గుమ్మడిదల,భారత శక్తి ప్రతినిధి, జూన్ 21: సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలో సిజిఆర్ ట్రస్ట్ కార్యాలయంలో తెలంగాణ మార్గదర్శకుడు, విశ్వవిద్యాలయ విద్యావేత్త ప్రొఫెసర్ జయశంకర్ వర్ధంతిని బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి ఘనంగా నిర్వహించారు.

జయశంకర్ త్యాగాలను, తెలంగాణ ఉద్యమానికి అందించిన విలువైన సేవలను ఆయన గుర్తుచేశారు. విద్యారంగం నుండి ఉ ద్యమం వరకు అందరి హక్కుల కోసం పోరాడిన గొప్ప వ్యక్తిగా కొనియాడారు. ఆయన చిత్రపటానికి పుష్పాంజలులు సమర్పించి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మంద భాస్కర్ రెడ్డి, దేవేందర్ రెడ్డి, మొగులయ్య, కొత్తపల్లి మల్లేష్ గౌడ్ కుమ్మరి ఆంజనేయులు, పొన్నాల శ్రీనివాస్ రెడ్డి, ఆంజనేయులు యాదవ్, సత్యనారాయణ, భాస్కర్, చంద్రారెడ్డి, ఆంజనేయులు, బీరప్ప, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# సంపూర్ణ ఆరోగ్యం కోసం యోగా అవసరం : ప్రిన్సిపాల్ ఆలేటి పరంజ్యోతి

## - ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం

ఖమ్మం ప్రతినిది (భారత శక్తి), జూన్ 21:సంపూర్ణ ఆరోగ్యానికి యోగ ఉపయోగపడుతుందని నేలకొండపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆలేటి పరంజ్యోతి పేర్కొన్నారు. శనివారం ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో కళాశాలలో ప్రపంచ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ యోగా అనేది ఖర్చులేని మందు అన్నారు. ఇది మానసిక వికాసానికి దోహదపడుతుందని శరీరం, మనసు మధ్య సమతుల్య సాధనకు యోగ అద్భుతంగా తోడ్పడుతుందన్నారు. ఈ సందర్భంగా యోగా మాస్టర్ క్రాంతి కుమార్ నేటి యాంత్రిక జీవనంలో యోగ ప్రాధాన్యతను వివరించారు. అనంతరం అధ్యాపకులు,విద్యార్థులతో యోగాసనాలు చేపించారు. ఈ కార్యక్రమంలో ఎనఎసఎస ప్రోగ్రాం ఆఫీసర డాక్టర ఎన్.శ్రీనివాసరావు,నేలకొండప ల్లి తహసీల్దార్ వెంకటేశ్వరరావు, నేలకొండపల్లి పోలీస్ సబ్ ఇన్స్పెక్టర్ సంతోష్, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎల్.వెంకటేశ్వర్లు, నేలకొండపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్నపూసల సీతారాములు, నేలకొండపల్లి





మండల విద్యాధికారి చలపతిరావు, ఎన్.జి.ఆర్ ఫౌండేషన్ చైర్మన్ ఏటుకూరి రామారావు, ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ కె. శ్రీనివాసరావు, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బి. వెంకటేశ్వర్ రెడ్డి ఇతర అధ్యాపక బృందం అధ్యాపకేతర సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

# ఘనంగా 11 వ అంతర్జాతీయ యోగా దినోత్సవం



(భారత శక్తి ప్రతినిధి) కామారెడ్డి, జూన్ 21: 11 వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా శనివారం లింగంపేట్ గ్రామంలో నాగన్న గారి మెట్ల బావి దగ్గర యోగా కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అందరితో కలిసి యోగ సాధన చేసి యోగ కార్యక్రమానికి వచ్చిన వారిని ఉ ద్దేశించి మాట్లాడడం జరిగింది. యోగా చేయడం వల్ల శారీరక ధృడత్వం కాకుండా మానసిక ధృఢత్వం కూడా ఏర్పడుతుందని తెలిపారు. అదేవిధంగా యోగ కార్యక్రమంలో విద్యార్థినీ విద్యార్థులు వేసిన కఠినతరమైన యోగాసనాలు తిలకించి అభినందించడం జరిగింది. విద్యార్థినీ, విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, రోజువారి అలవాటులో ఈ యోగాను చేర్చుకోవాలని దీనివల్ల ప్రతి ఒక్కరూ శారీరకంగానే కాకుండా మానసిక ధ్రుడత్వంతో పాటు రోజంతా ఉల్లాసంగా ఉంటారని తెలిపారు. అదేవిధంగా యోగా దినోత్సవంను లింగంపేట్ లోని నాగన్న గారి భావి దగ్గర నిర్వహించడం చాలా సంతోషకరంగా ఉందని తద్వారా ఇలాంటి హెరిటేజ్ సైట్లు ఎంతో ప్రాముఖ్యత పొందుతాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఓ,డిపిఓ,డిఎమ్ఎచ్ఓ,డివైఎస్ఓ, మండల స్థాయి అధికారులు, యోగ రామిరెడ్డి, కెజిబివి లింగంపేట్ విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# స్మార్ట్ కిడ్జ లో యోగాసనాలతో జోష్.

ఖమ్మం ప్రతినిది (భారత శక్తి), జూన్ 21:ప్రపంచ అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని శనివారం స్మార్ట్ కిడ్జ పాఠశాలలో యోగాసనాలతో జోష్ నిండింది. పాఠశాల చిన్నారులు పలు రకాల యోగానసనాలు చేసత్తూ అందరిని అబ్బురపరిచారు. 12 రకాల సూర్య నమస్కారాల భంగిమలు చేస్తూ చిన్నారులు ఆకట్టుకున్నారు. ఉచ్వాస నిస్వాసలతో ప్రాణాయామం , ముద్రలు, ధ్యానం నిర్వహించిన చిన్నారులు పాఠశాల ఆవరణంలో ఉత్సాహంగా గడిపారు. యోగా దినోత్సవం ప్రాముఖ్యతను వివరిస్తూ పాఠశాల కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణ చైతన్య మాట్లాడుతూ విశ్వం అంతటికి మన దేశం అందించిన గొప్ప బహుమానం యోగా అని తెలిపారు. ప్రతిరోజు యోగా చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందన్నారు. యోగానసనాలతో శారీరక దృఢత్వం, ప్రాణాయామం, ధ్యానంతో మానసిక ఉత్సాహం పెరిగి నిత్య ఆరోగ్యాన్ని కలిగి ఉంటామని తెలియజేశారు. తమ పాఠశాల చిన్నారులు ఆనందోత్సవాలతో యోగాసనాలు చేయడం వారికి యోగ పట్ల ఉన్న ఉత్సాహాన్ని తెలియజేస్తున్నదని తెలిపారు. ప్రపంచంలో 200 దేశాలలో యోగా దినోత్సవం నిర్వహించడం ద్వారా మన దేశ ఖ్యాతి ఇనుమడింప చేసిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ చింతనిప్పు సుకన్య, పాఠశాల ప్రిన్సిపాల్ , ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.



# ఘనంగా యోగా దినోత్సవ వేడుకలు

## -యోగా కార్యక్రమం లో ఉత్సాహంగా పాల్గొన్న చాణక్య సంస్కృతి ఒలంపియాడ్ పాఠశాల విద్యార్థులు.



భారత శక్తి ఉమ్మడి అదిలాబాద్ జిల్లా బ్యూరో, జూన్ 21: యోగా దినోత్సవం సందర్భంగా భైంసా శివాజీ నగర్ లోని చాణక్య సంస్కృతి ఒలంపియాడ్ పాఠశాలలో యోగా కార్యక్రమం ఎంతో ఉత్సాహభరితంగా జరిగింది. ఈ సందర్భంగా పాఠశాలలోని విద్యార్థులు శారీరక, మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో యోగా ప్రాముఖ్యతను వివరించే శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్నారు. విద్యార్థులు సూర్యనమస్కారాలు, తాడాసనము, భూజంగాసనము, వృక్షాసనము వంటి అనేక ఆసనాలు వేయడంలో ప్రావీణ్యం కనబరిచారు. వారి నైపుణ్యంతో యోగా ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, స్థానిక పెద్దలు విద్యార్థుల ఉత్సాహాన్ని ప్రశంసించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ, "యోగా శరీరానికి ఒద్దికను, మనస్సుకు ప్రశాంతతను అందించే గొప్ప సంపద. విద్యార్థుల్లో చిన్ననాటి నుంచే యోగా అలవాటు పెడితే, వారు ఆరోగ్యవంతమైన జీవితం గడిపే అవకాశం ఉంటుంది" అని తెలిపారు. యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని పాఠశాలలో ప్రత్యేక ప్రసంగాలు, యోగా ప్రదర్శనలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి. యోగా ద్వారా ఆరోగ్య సూత్రాలను విద్యార్థులకు బోధించాలనే నోబుల్ లక్ష్యంతో ఈ కార్యక్రమం నిర్వహించబడిందని పాఠశాల యాజమాన్యం వెల్లడించింది. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థులలో ఏకాగ్రత, ఆత్మవిశ్వాసం పెంచడానికి ఎంతగానో దోహదపడతాయని ఉపాధ్యాయులు అభిప్రాయపడ్డారు.

# విపత్తుల నిర్వహణకు పకడ్బందీగా సన్నద్ధం కావాలి: జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

-మూడు నెలల పాటు ఎన్డిఆర్ఎఫ్ బృందాలు జిల్లాలో స్టేషన్ చేసే విధంగా చర్యలు

-వరద ప్రభావిత ప్రాంతాల్లో పునరావాస కేంద్రాలను గుర్తించాలి

-విపత్తుల నిర్వహణపై ఎన్డిఆర్ఎఫ్ బృందం, సంబంధిత అధికారులతో సమీక్షించిన జిల్లా కలెక్టర్





ఖమ్మం ప్రతినిది (భారత శక్తి), జూన్ 21:విపత్తుల నిర్వహణకు పకడ్బందీగా సన్నద్ధం కావాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. జిల్లా కలెక్టర్, కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డితో కలిసి విపత్తుల నిర్వహణపై ఎన్డిఆర్ఎఫ్ బృందం, సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ గత సంవత్సరం వచ్చిన భారీ వరదల నేపథ్యంలో ఖమ్మం జిల్లాలో 3 నెలల పాటు ఎన్.డి.ఆర్.ఎఫ్. బృందాలు స్టేషన్ లో ఉండేలా చర్యలు చేపట్టి, అవసరమైన ఏర్పాట్లు పకడ్బందీగా అధికారులు పూర్తి చేయాలని తెలిపారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు వీలుగా రిహాబిలిటేషన్ సెంటర్ లను ముందుగా గుర్తించాలని, అవసరమైన పక్షంలో ప్రైవేట్ ఫంక్షన్ హాల్ లను కూడా రిహాబిలిటేషన్ సెంటర్ గా ఏర్పాటు చేయాలని, ఏ ప్రాంతం ప్రజలను ఏ సురక్షిత ప్రాంతానికి తరలిస్తారు అనే విషయమై మ్యాపింగ్ చేసి సోమవారం నాటికి వివరాలు అందించాలని అన్నారు. వాతావరణ శాఖ నుంచి వరద ముప్పు ఉందని హెచ్చరిక రాగానే జిల్లాలో హెలికాప్టర్ అందుబాటులో పెట్టుకోవాలని, వరద సమయంలో అవసరమైన బోట్లు, రోప్స్, లైఫ్ జాకెట్, మైక్స్, లైట్లు, జేసిబి , క్లినింగ్ ఎక్విప్మెంట్ మొదలగు సామాగ్రి డివిజన్, గ్రామం వారీగా అందుబాటులో పెట్టాలని అన్నారు.  వరద తర్వాత పారిశుధ్య నిర్వహణకు సంబంధించి సిబ్బంది, జవాన్ లను ఇళ్ల వారీగా కేటాయించాలని అన్నారు. వరద ప్రభావిత ప్రాంతాలలో ప్రజలకు అవసరమైన బ్లాంకెట్, బట్టలు, ఆహార సామాగ్రి గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని సిద్ధం చేసుకోవాలని అన్నారు. విపత్తుల సమయంలో ప్రజలు ప్యానిక్ కాకుండా ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి, జిల్లా యంత్రాంగంతో ఎలా సహకరించాలి వంటి అంశాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. ప్రతి మండలంలో విపత్తు నిర్వహణ కోసం అవసరమైన సామాగ్రి అందుబాటులో ఉంచుకోవాలని, వాటి పనితీరు ఒక్కసారి చెక్ చేయాలని కలెక్టర్ తెలిపారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలను సన్నద్ధం చేయాలని అన్నారు. ఈ సమావేశంలో డిఆర్వో ఏ. పద్మశ్రీ, ఎన్డిఆర్ఎఫ్ బృందం కమాండర్ ఎస్. గౌతం, ఏ.ఎస్.ఐ మద్దిలేటి, హెడ్ కానిస్టేబుల్స్ జగదీష్, సురేష్ కుమార్, కానిస్టేబుల్స్ రియాజుద్దీన్ , కె. జనార్ధన్, సంబంధిత జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రెస్ క్లబ్ ప్రతిష్టను దెబ్బతీస్తున్న వారిపై చర్యలు తీసుకోండి: డీసీపీకి ఏపీయూడబ్ల్యూజే నేతల వినతి

విజయవాడ, జూన్ 21:ఏపీయూడబ్ల్యూజే యూనియన్, ప్రెస్ క్లబ్ పై సోషల్ మీడియా వేదికగా దుష్ప్రచారం చేస్తూ , ప్రభుత్వ ఉద్యోగులను బ్లాక్ మెయిల్ చేస్తూ బెదిరింపులకు పాల్పడుతున్న నలుగురిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ యూనియన్ నాయకులు శనివారం డిప్యూటీ పోలీస్ కమిషనర్ కె.జీ.వి. సరితకు వినతి పత్రం అందించారు. ఏపీయూడబ్ల్యూజే కార్యాలయమైన ప్రెస్ క్లబ్ వ్యవహారంలో ఇతర యూనియన్లకు చెందిన కొందరు వ్యక్తులు రెండేళ్లుగా చేస్తున్న దుష్ప్రచారాలను వివరించారు. ఇతర యూనియన్లకు విజయవాడ ప్రెస్ క్లబ్ లో సభ్యత్వం ఇవ్వడం అనేది బైలాస్ ప్రకారం సాధ్యం కాదని డీసీపీకి వివరించారు. అయినప్పటికీ డిపార్ట్మెంట్ కి తప్పుడు ఫిర్యాదులు చేసి బెదిరింపులకు పాల్పడుతున్నారని తెలియజేశారు. ఆయా డిపార్ట్మెంట్ ల వారు ఫిర్యాదులపై విచారణ జరిపే సందర్భంలో కార్పొరేషన్, ఇరిగేషన్ అధికారులపై కూడా వీరు తప్పుడు ఫిర్యాదులు చేస్తూ ఆయా అధికారులను కూడా బ్లాక్ మెయిల్ చేస్తున్నారని వెల్లడించారు. నలుగురు వ్యక్తులు ఒక గ్యాంగు లాగా ఏర్పడి ఎంతో చరిత్ర కలిగిన విజయవాడ ప్రెస్ క్లబ్ పై వాట్సాప్ గ్రూపులు అడ్డాగా చేసుకుని దుష్ప్రచారానికి పాల్పడుతున్నారని డీసీపీకి వివరించారు. ఈ గ్యాంగ్ లో సభ్యులుగా వీర్ల శ్రీరామ్ యాదవ్, ప్రసాద్ బాబు, ఏవివి శ్రీనివాసరావు, కస్తాల నమ్మయ్యలు ఉన్నారని, వీరందరికీ సొంతగా వేరువేరు యూనియన్లు ఉన్నప్పటికీ ఒక గ్రూపు లాగా మారి ప్రెస్ క్లబ్ పై బెదిరింపులకు పాల్పడుతూ దుష్ప్రచారం చేస్తున్నారని తెలియజేశారు. వాట్సప్ గ్రూపులను దుర్వినియోగం చేస్తూ యూనియన్, ప్రెస్ క్లబ్ ప్రతిష్టను దురుద్దేశపూర్వకంగా  దెబ్బతీస్తూ బెదిరింపులకు పాల్పడుతుండడం మరియు అధికారులపై తప్పుడు ఫిర్యాదులు చేస్తూ బ్లాక్ మెయిల్ చేస్తున్న సదరు వ్యక్తులపై విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డీసీపీకి విజ్ఞప్తి చేశారు. డీసీపీని కలిసిన వారిలో యూనియన్ అర్బన్ అధ్యక్షుడు చావా రవి, కార్యదర్శి దారం వెంకటేశ్వరరావు, ప్రెస్ క్లబ్ కార్యదర్శి డి. నాగరాజు, యూనియన్ సీనియర్



ఇతర యూనియన్ల వారికి కూడా సభ్యత్వం ఇవ్వాలని ఏపీయూడబ్ల్యూజే , ప్రెస్ క్లబ్ సంస్థలను కొందరు వ్యక్తులు సోషల్ మీడియా వేదికగా అప్రతిష్ట పాలు చేస్తూ వాట్సాప్ గ్రూపులలో తప్పుడు పోస్టులు పెడుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అంతేకాక ప్రెస్ క్లబ్ కి వ్యతిరేకంగా మున్సిపల్ కార్పొరేషన్ కి, ఇరిగేషన్ నాయకుడు ఎస్కే బాబు, సామ్నా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్. రమణారెడ్డి, సామ్నా నగర అధ్యక్షుడు ఎంవి సుబ్బారావు, ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ నాయకుడు సాంబశివరావు, ఏపీయూడబ్ల్యూజే కౌన్సిల్ సభ్యుడు రఘు, యూనియన్ సహాయ కార్యదర్శి కోటిరెడ్డి, కోశాధికారి హుస్సేన్, కార్యవర్గ సభ్యులు కుమార్, తిరుమల రావు, ఖదీర్ తదితరులు ఉన్నారు.

# బోనకల్ షైన్ హై స్కూల్ లో యోగాసనాలతో జోష్.



ఖమ్మం ప్రతినిది (భారత శక్తి), జూన్ 21:ప్రపంచ అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని శనివారం షైన్ హై స్కూల్లో యోగాసనాలతో జోష్ నిండింది. పాఠశాల చిన్నారులు పలు రకాల యోగాసనాలు చేస్తూ అందరిని అబ్బురపరిచారు. ఉచ్వాస నిస్వాసలతో ప్రాణాయామం , ముద్రలు, ధ్యానం నిర్వహించిన చిన్నారులు పాఠశాల ఆవరణంలో ఉత్సాహంగా గడిపారు. యోగా దినోత్సవం ప్రాముఖ్యతను వివరిస్తూ పాఠశాల కరస్పాండెంట్ అన్సార్ పాషా మాట్లాడుతూ విశ్వం అంతటికి మన దేశం అందించిన గొప్ప బహుమానం యోగా అని తెలిపారు. ప్రతిరోజు యోగా చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందన్నారు. యోగాసనాలతో శారీరక దృఢత్వం, ప్రాణాయామం, ధ్యానంతో మానసిక ఉత్సాహం పెరిగి నిత్య ఆరోగ్యాన్ని కలిగి ఉంటామని తెలియజేశారు. తమ పాఠశాల చిన్నారులు ఆనందోత్సవాలతో యోగాసనాలు చేయడం వారికి యోగ పట్ల ఉన్న ఉత్సాహాన్ని తెలియజేస్తున్నదని తెలిపారు. ప్రపంచంలో 200 దేశాలలో యోగా దినోత్సవం నిర్వహించడం ద్వారా మన దేశ ఖ్యాతి ఇనుమడింప చేసిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరెస్పాండంట్ అన్సార్ పాషా, పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

# ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం



కడప, జూన్ 21(భారత శక్తి): అంతర్జాతీయ యోగా దినోత్సవం 2025 సందర్భంగా శనివారం కడప ప్రధాన తపాలా కార్యాలయంలో యోగా దినోత్సవం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి యోగ గురువు శ్రీ సిద్దయ్య గారు హాజరై, తపాలా సిబ్బందికి వివిధ యోగ ఆసనాలను ప్రదర్శించి శిక్షణ ఇచ్చారు. యోగ అనేది ఆరోగ్యానికి మేలు చేసేది మాత్రమే కాకుండా, దైనందిన జీవన శైలిలో సానుకూల మార్పులకు దోహదపడేదని ఆయన వివరించారు. ఈ సందర్భంగా కడప డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ శ్రీ రాజేష్ గారు మాట్లాడుతూ, "తనువు, ఆత్మ, మనసును ఏకం చేసే ప్రక్రియ యోగ. ఇది మానసిక మరియు శారీరక ఆరోగ్యానికి ఎంతో అవసరం," అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో %ూూూా% లు శ్రీ విజయ భాస్కర్ రెడ్డి, శ్రీ విజయ భాస్కర్, హెడ్ పోస్టుమాస్టర్ శ్రీ జె. సుబ్బారాయుడు గారు, పబ్లిక్ ఇన్స్పెక్టర్ రఘుపతి గారు, %ూా×% డెవలప్మెంట్ ఆఫీసర్ శ్రీ మునాఫ్ గారు, మార్కెటింగ్ ఇంచార్జ్ వీర శేఖర్ రెడ్డి, సలోమి గారు, పుష్పలత రెడ్డి గారు మరియు తపాలా శాఖ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఇస్రో నుంచి హెచ్ఏఎల్‌కు రాకెట్ల సాంకేతికత




ఢిల్లీ: స్మాల్ శాటిలైట్ లాంచ్ వెహికల్ (ఎస్ఎస్ఎల్వీ)కు సంబంధించిన సాంకేతికత బదిలీ బిడ్‌ను హిందుస్థాన్ ఏరోనాటిక్స్ (హెచ్ఏఎల్) దక్కించుకుంది. ఇండియన్ నేషనల్ స్పేస్ ప్రమోషన్ అండ్ అథరైజేషన్ సెంటర్ (ఇన్‌స్పేస్) ఛైర్మన్ పవన్ కుమార్ గోయెంకా ఈ విషయాన్ని ప్రకటించారు.

ఎస్ఎస్ఎల్వీ: ఇది ఇస్రోకు చెందిన రాకెట్. 500 కిలోల వరకు బరువు ఉండే ఉపగ్రహాల (శాటిలైట్ల)ను భూమి నుంచి తక్కువ ఎత్తు (500 కి.మీ. వరకు)లో ఉండే కక్ష్య (లో ఎర్త్ ఆర్బిట్)లోకి  ఇది పంపగలుగుతుంది.

అదానీ, బీడీఎల్ సంస్థలను అధిగమించి: అదానీ డిఫెన్స్ సిస్టమ్స్ అండ్ టెక్నాలజీస్ మద్దతు ఉన్న ఆల్ఫా డిజైన్ టెక్నాలజీస్, హైదరాబాద్‌లోని భారత్ డైనమిక్స్ లిమిటెడ్ (బీడీఎల్) నేతృత్వంలోని రెండు బృందాలను పక్కకునెట్టి మరీ హెచ్ఏఎల్ ఈ బిడ్ గెలుచుకుంది. ఫైటర్ జెట్ తయారీ కంపెనీ అయిన హెచ్ఏఎల్ ఈ బిడ్డింగ్‌లో మరో సంస్థ సహకారం లేకుండా, ఒంటరిగానే పోటీ చేసి రూ.511 కోట్లతో బిడ్ గెలుచుకుంది.

ఒప్పందం ఇదీ: ఈ సాంకేతికత బదిలీ ఒప్పందం కింద ఎస్ఎస్ఎల్వీని హెచ్ఏఎల్ స్వతంత్రంగా నిర్మించి, వాణిజ్యీకరణ చేసుకోవచ్చని పవన్ కుమార్ గోయెంకా తెలిపారు. 'వచ్చే రెండేళ్లలో 2 ప్రోటోటైప్ రాకెట్ల నిర్మాణానికి హెచ్ఏఎల్‌కు ఇస్రో సహకారం అందిస్తుంది. ఆ తర్వాత గిరాకీని బట్టి ఏటా 6-10 ఎస్ఎస్ఎల్వీలను స్వతంత్రంగా హెచ్ఏఎల్ తయారు చేసుకోవచ్చు. రెండేళ్ల అనంతరం అంటే మూడో రాకెట్ నుంచి డిజైన్‌ను మెరుగుపరచుకోవడానికి, సొంత వెండర్లను ఎంపిక చేసుకోవడానికి హెచ్ఏఎల్‌కు స్వతంత్రత ఉంటుంద'ని వివరించారు. 'ఎస్ఎస్ఎల్వీ తయారీ బిడ్‌ను దక్కించుకోవడం తమకు గర్వకారణమ'ని హెచ్ఏఎల్ డైరెక్టర్ ఫైనాన్స్ బి. సేనాపతి పేర్కొన్నారు.

మూడో కంపెనీ: అంతరిక్ష రంగంలో అంకురాలైన స్కైరూట్ ఏరోస్పేస్, అగ్నికుల్ కాస్మోస్ తర్వాత రాకెట్ల తయారీలోకి అడుగుపెడుతున్న మూడో కంపెనీ హెచ్ఏఎల్ అవుతుంది. 'ఎస్ఎస్ఎల్వీ సాంకేతికత కోసం మొత్తం 9 కంపెనీలు ఆసక్తి ప్రదర్శించాయి. మూడింటిని తిరస్కరించాం. మిగతా ఆరింటిలో మూడు దరఖాస్తు చేయలేద'ని గోయెంకా తెలిపారు.

13.9 బి. డాలర్లు: 2023 నాటికి లో ఎర్త్ ఆర్బిట్ లాంచ్ వెహికల్స్‌కు అంతర్జాతీయంగా ఉన్న మార్కెట్

44 బి. డాలర్లు: 2032 కల్లా ఈ మార్కెట్ స్థాయిపై అంచనా

2%: అంతర్జాతీయ అంతరిక్ష ఆర్థిక వ్యవస్థలో భారత్ వాటా ఇది. 2030 కల్లా ప్రస్తుత 8 బి. డాలర్ల నుంచి 44 బి. డాలర్లకు చేరాలన్నది భారత లక్ష్యంగా ఉంది.

# బుల్ దుమ్మురేపింది

మూడు రోజుల వరుస నష్టాల నుంచి దేశీయ సూచీలు బలంగా పుంజుకున్నాయి. ఇరాన్‌పై సైనిక చర్యకు సంబంధించి రెండు వారాల్లో నిర్ణయం తీసుకుంటామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించడంతో.. ఇప్పటికిప్పుడు యుద్ధం తీవ్రమయ్యే పరిస్థితి తప్పిందనే భావనతో అంతర్జాతీయ సంకేతాలు సానుకూలంగా మారాయి. దేశీయంగా కొనుగోళ్ల మద్దతుతో ఫైనాన్స్, టెలికాం, టెక్ షేర్లు కళకళలాడాయి. నిఫ్టీ మళ్లీ 25,100 పాయింట్ల ఎగువకు చేరింది.  డాలర్‌తో పోలిస్తే రూపాయి 18 పైసలు పెరిగి 86.55 వద్ద ముగిసింది. బ్యారెల్ ముడిచమురు 1.93% నష్టంతో 77.33 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఆసియా మార్కెట్లు మిశ్రమంగా ముగియగా, ఐరోపా సూచీలు మెరుగ్గా ట్రేడయ్యాయి

బీఎస్ఈలోని నమోదిత సంస్థల మొత్తం మార్కెట్ విలువ శుక్రవారం రూ.4.89 లక్షల కోట్లు పెరిగి రూ.447.70 లక్షల కోట్లు (5.17 లక్షల కోట్ల డాలర్లు)గా నమోదైంది.

సెన్సెక్స్ ఉదయం 7 పాయింట్ల (క్రితం ముగింపు 81362) నష్టంతో 81,354.85 పాయింట్ల వద్ద ప్రారంభమైంది. కొనుగోళ్ల మద్దతుతో బలంగా పుంజుకున్న సూచీ, ఇంట్రాడేలో 1,132.62 పాయింట్ల లాభంతో 82,494.49 వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరకు 1046.30 పాయింట్లు రాణించి 82,408.17 వద్ద ముగిసింది. నిఫ్టీ 319.15 పాయింట్లు పెరిగి 25,112.40 దగ్గర స్థిరపడింది. ఇంట్రాడేలో ఈ సూచీ 24,783.65-25,136.20 పాయింట్ల మధ్య కదలాడింది.

మారన్ సోదరుల మధ్య వివాదం నేపథ్యంలో సన్‌టీవీ షేరు ఇంట్రాడేలో 5.20% నష్టపోయి రూ.581.55 వద్ద కనిష్ఠాన్ని తాకింది. చివరకు 1.09% తగ్గి రూ.606.80 వద్ద ముగిసింది.

సెన్సెక్స్ 30 షేర్లలో 29 పరుగులు తీశాయి. భారతీ ఎయిర్‌టెల్ 3.27%, ఎం అండ్ ఎం 2.93%, పవర్‌గ్రిడ్ 2.38%,



# బ్రాడ్‌మన్ రికార్డు బద్దలుకొట్టిన యశస్వి జైస్వాల్

ఇంగ్లాండ్, భారత్ ( ల మధ్య లీడ్స్‌లోని హెడింగ్లీ మైదానంలో మొదటి టెస్ట్ మ్యాచ్ శుక్రవారం నుంచి ప్రారంభమైంది. మొదట బ్యాటింగ్ ఆరంభించిన భారత్ తొలిరోజు ఆటముగిసే సమయానికి 3 వికెట్ల నష్టానికి 359 పరుగులు సాధించి, తిరుగులేని స్థితిలో నిలిచింది. శుభ్‌మన్ గిల్ ( (127లి), రిషభ్‌పంత్ (65లి) నాటౌట్‌గా ఉన్నారు. ఓపెనర్‌గా వచ్చి సెంచరీ బాదిన యశస్వి జైస్వాల్ ( . బ్రాడ్‌మన్ ( రికార్డ్‌ను బద్దలుకొట్టాడు. జైస్వాల్ ఇప్పటివరకు ఇంగ్లండ్‌తో ఆడిన 10 ఇన్నింగ్స్‌ల్లో 90.33 యావరేజ్‌తో 813 పరుగులు సాధించాడు. దీంతో అతడు.. డాన్ బ్రాడ్‌మన్‌ను ఇంగ్లాండ్‌పై యావరేజ్ విషయంలో (మినిమం 500 పరుగులు) అధిగమించాడు. బ్రాడ్‌మన్.. ఇంగ్లిష్ టీమ్‌పై 63 ఇన్నింగ్స్‌ల్లో 89.78 సగటుతో 5,028 పరుగులు చేశాడు. ఈ క్రమంలో ఇంగ్లాండ్ టీమ్ మీద 90 ప్లస్ యావరేజ్ కలిగిఉన్న ఏకైక బ్యాటర్‌గా యశస్వి జైస్వాల్ నిలిచాడు.

అలాగే ఈ మ్యాచ్‌లో టీమ్‌ఇండియా కెప్టెన్.. శుభ్‌మన్ గిల్ 2000 పరుగుల మైలురాయిని అందుకున్నాడు. అద్భుత ఇన్నింగ్స్ ఆడిన గిల్ 175 బంతుల్లో 127 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. ఇందులో 16 ఫోర్లు, 1 సిక్స్ ఉన్నాయి. అలాగే వైస్ కెప్టెన్ రిషభ్ పంత్ 3000 పరుగుల మైలురాయిని చేరుకున్నాడు. అతడు 102 బంతుల్లో 65 పరుగులతో నాటౌట్‌గా ఉన్నాడు. ఇందులో 6 ఫోర్లు, 2 సిక్స్‌లున్నాయి. గిల్, పంత్ వీరిద్దరూ కలిసి మొదటిరోజు ఆట ముగిసే సమయానికి, నాలుగో వికెట్‌కు 198 బంతుల్లో 138 పరుగులు జోడించారు.

అలాగే టీమ్‌ఇండియా మరో రికార్డ్‌ను తన ఖాతాలో వేసుకుంది. ఇంగ్లాండ్ మీద గత అత్యధిక ఓపెనింగ్ స్కోర్‌ను అధిగమించింది. 2022లో ఎడ్జ్‌బాస్టన్‌లో ఏడు వికెట్ల నష్టానికి 338 పరుగులు చేసింది. ప్రస్తుతం తొలిరోజు మూడు వికెట్ల నష్టానికి 359 పరుగులు చేసి తన గత రికార్డును మెరుగుపర్చుకుంది. ఓవరాల్‌గా ఇంగ్లాండ్‌లో పర్యటించినప్పుడు సౌతాఫ్రికా జట్టు 2003లో ఓవెల్ వేదికగా ఆటలో తొలి రోజు అత్యధికంగా నాలుగు వికెట్ల నష్టానికి 362 పరుగులు చేసింది.

# రిషభ్ పంత్‌కు కేఎల్ రాహుల్ నమస్కారం



ఇంగ్లాండ్‌తో జరుగుతున్న తొలి టెస్ట్ మ్యాచ్‌లో మొదటిరోజు ఆట ముగిసే సమయానికి టీమ్‌ఇండియా మూడు వికెట్లు నష్టపోయి 359 పరుగులు చేసింది. ఓపెనర్లు యశస్వి జైస్వాల్ (, కేఎల్ రాహుల్‌లు (శుభారంభాన్ని అందించారు. మొదటి వికెట్‌కు 91 పరుగుల భాగస్వామ్యాన్ని నమోదు చేసి గట్టి పునాది వేశారు. కేఎల్ రాహుల్ 42 పరుగుల వ్యక్తిగత స్కోర్ వద్ద తొలి వికెట్‌గా వెనుదిరిగాడు. తర్వాత క్రీజులోకి వచ్చిన సాయి సుదర్శన్ ) (0) నిరాశ పరిచాడు. నాలుగు బంతులు ఎదుర్కొన్న అతడు బెన్ స్టోక్స్ బౌలింగ్‌లో ఆన్‌సైడ్ అనవసర షాట్‌కు యత్నించి వికెట్ కీపర్ జెమ్మీ స్మిత్ చేతికి చిక్కాడు. ఇలా తన అరగేంట్ర మ్యాచ్‌లో డకౌట్‌గా వెనుదిరిగాడు. వెంటవెంటనే రెండు వికెట్లు కోల్పోయి కాస్త చిక్కుల్లో పడ్డట్లు కనిపించిన భారత జట్టును కెప్టెన్ శుభ్‌మన్ గిల్ , జైస్వాల్ ముందుకు నడిపించారు.

యశస్వి జైస్వాల్ (101) వెనుదిరిగిన తర్వాత బ్యాటింగ్‌కు వచ్చిన వైస్ కెప్టెన్ రిషభ్‌పంత్ క్రీజులో పాతుకుపోయాడు. గిల్ (127లి), పంత్ (65లి) మరో వికెట్ పడకుండా తొలిరోజు ఆట ముగిసేంత వరకు క్రీజులోనే ఉన్నారు. నాలుగో వికెట్‌కు 138 పరుగుల భాగస్వామ్యాన్ని అందించారు. ఇదే క్రమంలో రిషభ్ పంత్ తన టెస్ట్ కెరీర్‌లో 3000 పరుగుల మైలురాయిని అందుకున్నాడు. ముఖ్యంగా చివరి ఓవర్‌లో క్రిస్ వోక్స్ విసిరిన మొదటి బంతిని నిర్భయంగా రిషభ్ పంత్ కళ్లు చెదిరే సిక్స్‌గా మలిచాడు.

ఈ క్రమంలో మొదటి రోజు ఆట ముగిసిన తర్వాత మైదానం వీడే క్రమంలో శుభ్‌మన్ గిల్, రిషభ్ పంత్‌ను జట్టు సభ్యులు చప్పట్లతో అభినందించారు. మెట్ల మీదుగా డ్రెస్సింగ్ రూమ్‌కు చేరుకుంటున్న క్రమంలో పంత్‌కు.. కేఎల్ రాహుల్ చేతులు జోడించి నమస్కారం చేశాడు. ఈ దృశ్యాలను బీసీసీఐ ( తన ఎక్స్ ఖాతాలో పంచుకుంది. తర్వాత ఈ వీడియో వైరల్‌గా మారింది.





# రో-కో శకం నుంచి జై-శు శకంలోకి

: టీమ్‌ఇండియా ( దిగ్గజ బ్యాటర్లు రోహిత్ శర్మ ( విరాట్ కోహ్లీ ) ఇటీవలే తమ టెస్ట్ కెరీర్‌కు ఒకరి తర్వాత మరొకరు కొన్ని రోజుల వ్యవధిలోనే వీడ్కోలు పలికారు. తర్వాత భారత సెలక్టర్లు యువ బ్యాటర్ శుభ్‌మన్ గిల్‌కు ( సారథ్య బాధ్యతలు అప్పగించారు. ప్రస్తుతం గిల్ సేన ఇంగ్లాండ్ టూర్‌లో ఉంది. లీడ్స్‌లోని హెడింగ్లీ మైదానంలో శుక్రవారం నుంచి తొలి టెస్ట్ మ్యాచ్ ప్రారంభమైంది. మొదటిరోజు ఆట ముగిసే సమయానికి టీమ్‌ఇండియా 359/3 స్కోరుతో పటిష్ట స్థితిలో ఉంది.



ఓపెనర్‌గా వచ్చిన జైస్వాల్ 159 బంతులు ఎదుర్కొని 101 పరుగులు చేశాడు. ఇందులో 16 ఫోర్లు, 1 సిక్స్ ఉన్నాయి. ఇక నాలుగో స్థానంలో బ్యాటింగ్‌కు దిగిన శుభ్‌మన్ గిల్ కెప్టెన్‌గా తన తొలి మ్యాచ్‌లోనే సెంచరీతో అలరించాడు. 175 బంతుల్లో 127 పరుగులతో నాటౌట్‌గా ఉన్నాడు. గిల్ కూడా ఇప్పటివరకు తన ఇన్నింగ్స్‌లో 16 ఫోర్లు 1 సిక్స్ బాదాడు.

ఈ నేపథ్యంలో క్రికెట్ అభిమానులు సోషల్ మీడియా వేదికగా తమ ఆనందాన్ని పంచుకుంటున్నారు. టెస్ట్ క్రికెట్‌లో టీమ్‌ఇండియా ప్రయాణం.. రో-కో (రోహిత్ శర్మ, కోహ్లీ) శకం నుంచి... జై-శు (జైస్వాల్, శుభ్‌మన్ గిల్) శకంలోకి చేరుకుందంటూ పోస్టులు పెడుతున్నారు. మొదటిరోజు ఆటలో భాగంగా హ్యాండ్స్ క్రాంప్స్‌నకు గురైన జైస్వాల్‌కు ఫిజియో సపర్యలు చేస్తుంటే.. శుభ్‌మన్ గిల్ స్వయంగా తన చేతులతో అరటిపండు తినిపిస్తున్న ఫొటోను షేర్ చేసుకుంటున్నారు. మొదటిరోజు ఆటలో సత్తా చాటిన టీమ్‌ఇండియా.. రెండోరోజూ అదే రీతిలో రాణించాలని అభిమానులు కోరుకుంటున్నారు. ఇంగ్లండ్ టూర్‌లో టీమ్‌ఇండియా విజయంతో శుభారంభం చేయాలని ఆకాంక్షిస్తున్నారు.

# రిషభ్ పంత్‌కు కేఎల్ రాహుల్ నమస్కారం

ఇంగ్లాండ్‌తో జరుగుతున్న తొలి టెస్ట్ మ్యాచ్‌లో మొదటిరోజు ఆట ముగిసే సమయానికి టీమ్‌ఇండియా మూడు వికెట్లు నష్టపోయి 359 పరుగులు చేసింది. ఓపెనర్లు యశస్వి జైస్వాల్ (), కేఎల్ రాహుల్‌లు శుభారంభాన్ని అందించారు. మొదటి వికెట్‌కు 91 పరుగుల భాగస్వామ్యాన్ని నమోదు చేసి గట్టి పునాది వేశారు. కేఎల్ రాహుల్ 42 పరుగుల వ్యక్తిగత స్కోర్ వద్ద తొలి వికెట్‌గా వెనుదిరిగాడు. తర్వాత క్రీజులోకి వచ్చిన సాయి సుదర్శన్ ( (0) నిరాశ పరిచాడు. నాలుగు బంతులు ఎదుర్కొన్న అతడు బెన్ స్టోక్స్ బౌలింగ్‌లో ఆన్‌సైడ్ అనవసర షాట్‌కు యత్నించి వికెట్ కీపర్ జెమ్మీ స్మిత్ చేతికి చిక్కాడు. ఇలా తన అరగేంట్ర మ్యాచ్‌లో డకౌట్‌గా వెనుదిరిగాడు. వెంటవెంటనే రెండు వికెట్లు కోల్పోయి కాస్త చిక్కుల్లో పడ్డట్లు కనిపించిన భారత జట్టును కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (%వాష్ట్రబఎఖఅ +అశ్రీశ్రీ%), జైస్వాల్ ముందుకు నడిపించారు.

యశస్వి జైస్వాల్ (101) వెనుదిరిగిన తర్వాత బ్యాటింగ్‌కు వచ్చిన వైస్ కెప్టెన్ రిషభ్‌పంత్ (%=అంష్ట్రుఎష్ట్ర ాఖత్%) క్రీజులో పాతుకుపోయాడు. గిల్ (127లి), పంత్ (65లి) మరో వికెట్ పడకుండా తొలిరోజు ఆట ముగిసేంత వరకు క్రీజులోనే ఉన్నారు. నాలుగో వికెట్‌కు 138 పరుగుల భాగస్వామ్యాన్ని అందించారు. ఇదే క్రమంలో రిషభ్ పంత్ తన టెస్ట్ కెరీర్‌లో 3000 పరుగుల మైలురాయిని అందుకున్నాడు. ముఖ్యంగా చివరి ఓవర్‌లో క్రిస్ వోక్స్ విసిరిన మొదటి బంతిని నిర్భయంగా రిషభ్ పంత్ కళ్లు చెదిరే సిక్స్‌గా మలిచాడు.

ఈ క్రమంలో మొదటి రోజు ఆట ముగిసిన తర్వాత మైదానం వీడే క్రమంలో శుభ్‌మన్ గిల్, రిషభ్ పంత్‌ను జట్టు సభ్యులు చప్పట్లతో అభినందించారు. మెట్ల మీదుగా డ్రెస్సింగ్ రూమ్‌కు చేరుకుంటున్న క్రమంలో పంత్‌కు.. కేఎల్ రాహుల్ చేతులు జోడించి నమస్కారం చేశాడు. ఈ దృశ్యాలను బీసీసీఐ తన ఎక్స్ ఖాతాలో పంచుకుంది. తర్వాత ఈ వీడియో వైరల్‌గా మారింది.

# భారత బ్యాటర్లను అభినందించిన సచిన్

లీడ్స్‌లోని హెడింగ్లీ వేదికగా ఇంగ్లాండ్, టీమ్‌ఇండియా (ల మధ్య మొదటి టెస్ట్ మ్యాచ్ శుక్రవారం ప్రారంభమైంది. మొదటిరోజు ఆట ముగిసే సమయానికి భారత జట్టు 359/3తో పటిష్ట స్థితిలో



నిలిచింది. యశస్వి జైస్వాల్ () (101), శుభ్‌మన్ గిల్ ( (127లి) సెంచరీలు సాధించారు. రిషభ్ పంత్ ( 65 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. ఈ నేపథ్యంలో వీరి బ్యాటింగ్‌ను ప్రశంసిస్తూ, 2002లో హెడింగ్లీ వేదికగా భారత జట్టు ప్రదర్శనను గుర్తు చేసుకుంటూ.. సచిన్ తెండుల్కర్ ( ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టాడు. దీనిపై సౌరభ్ గంగూలీ సైతం తన స్పందనను తెలిపాడు.

కొందరు క్రికెట్ అభిమానులు సైతం 2002లో హెడింగ్లీలో జరిగిన మ్యాచ్ విశేషాలు నెమరువేసుకున్నారు. ఆ మ్యాచ్‌లో నాలుగో వికెట్‌కు సచిన్ తెండుల్కర్, సౌరభ్ గంగూలీ ( రికార్డు స్థాయిలో 249 పరుగులు జోడించారు. సచిన్ 193, గంగూలీ 128 రన్స్ చేశారు. రాహుల్ ద్రవిడ్ కూడా 148 పరుగులతో రాణించాడు. మొత్తంగా ముగ్గురు భారత బ్యాటర్లు మూడంకెల స్కోర్లు నమోదు చేశారు. ఆ మ్యాచ్‌లో ఓపెనర్ సంజయ్ బంగర్ 68 పరుగులు చేశాడు.

ఇక ప్రస్తుతం టీమ్ఇండియా ప్రదర్శనపై సచిన్.. 'కేఎల్ రాహుల్ యశస్వి జైస్వాల్ పటిష్టమైన పునాది వేశారు. అద్భుతమైన సెంచరీలు చేసిన యశస్వి జైస్వాల్, శుభ్‌మన్‌గిల్‌కు అభినందనలు. రిషభ్ పంత్ సాధించిన పరుగులు కూడా టీమ్‌ఇండియాకు కీలకంగా మారాయి. ఈరోజు వీరి ప్రదర్శన నాకు 2002లో హెడింగ్లీలో జరిగిన టెస్ట్ మ్యాచ్‌ను గుర్తుకుతెచ్చింది. అప్పుడు నేను, గంగూలీ, రాహుల్ ద్రవిడ్ ముగ్గురమూ ఫస్ట్ ఇన్నింగ్స్‌లో సెంచరీలు చేశాం. ఆ టెస్ట్ మ్యాచ్ మేం గెలిచాం కూడా. ప్రస్తుతం యశస్వి, శుభ్‌మన్ గిల్ సెంచరీలు చేశారు. మూడో సెంచరీ ఎవరు చేస్తారో?' అని ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేశాడు.

దీనిపై సౌరభ్‌గంగూలీ తనదైన శైలిలో స్పందించాడు. 'హాయ్ ఛాంప్. ఈసారి నాలుగు సెంచరీలు నమోదు కాబోతున్నాయి.

# డుప్లెసిస్ సెంచరీ వృథా.. టెక్సాస్‌పై శాన్‌ఫ్రాన్సిస్కో ఘన విజయం

అమెరికాలో మేజర్ లీగ్ క్రికెట్ 2025 ఉత్సాహంగా సాగుతోంది. డాలస్‌లోని గ్రాండ్ ప్రెయిరీ స్టేడియం వేదికగా టెక్సాస్ సూపర్ కింగ్స్( )తో జరిగిన మ్యాచ్‌లో శాన్‌ఫ్రాన్సిస్కో యునికార్న్స్ ( అద్భుత విజయం సాధించింది. టెక్సాస్ ఆటగాడు డుప్లెసిస్ శతకంతో రాణించినప్పటికీ.. ఆ జట్టుకు ఓటమి తప్పలేదు. శాన్‌ఫ్రాన్సిస్కో 7 వికెట్ల తేడాతో గెలుపొందింది.

ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన టెక్సాస్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లు నష్టపోయి 198 పరుగులు చేసింది. ఓపెనర్ డుప్లెసిస్ 51 బంతుల్లో 100 రన్స్ చేశాడు. కాన్వే (23), సాయితేజ ముక్కమల్ల (38) ఫర్వాలేదనిపించారు. శాన్‌ఫ్రాన్సిస్కో బౌలర్లు జేవియర్ బార్ట్‌లెట్, హారిస్ రౌఫ్ చెరో రెండు వికెట్లు తీసుకున్నారు.

ఆ తర్వాత 199 పరుగుల లక్ష్యంతో ఛేదనకు దిగిన శాన్‌ఫ్రాన్సిస్కో యునికార్న్స్ జట్టు ఆరంభం నుంచే దూకుడు ప్రదర్శించింది. కేవలం మూడు వికెట్లు కోల్పోయి 16.1 ఓవర్లలో 202 పరుగులు నమోదు చేసింది. ఓపెనర్లు మాథ్యూ షార్ట్ (61), ఫిన్ అలెన్ (78) అర్ధశతకాలతో రాణించారు.





# జ్యోతిష్యుల మాటలు వినేవాడు.. ఆ నటుడి పతనానికి కారణమదే: నిర్మాత

బాలీవుడ్‌లో ఒకానొక సమయంలో స్టార్‌గా గుర్తింపు తెచ్చుకున్నారు నటుడు గోవిందా ( గత కొన్నేళ్లుగా ఆయన సినిమాలకు దూరంగా ఉంటున్న విషయం తెలిసిందే. ఆయన కెరీర్ ఉన్నట్టుండి నాశనం కావడంపై నిర్మాత, సెన్సార్ బోర్డు మాజీ సభ్యుడు పహ్లాజ్ నిహలానీ కీలక వ్యాఖ్యలు చేశారు. చుట్టూ ఉన్న వారి మాటలు వినడం వల్లే ఆయన కెరీర్ నాశనమైందన్నారు.

"గోవిందా ఆల్ రౌండర్. డ్యాన్స్, యాక్టింగ్ ఇలా ఆయన ఏదైనా చేయగలరు. కెరీర్ ఆరంభంలో ఎన్నో విజయాలు అందుకున్నారు. వరుస ప్రాజెక్ట్‌లు చేశారు. ఎదుటి వ్యక్తులను ఆయన సులభంగా నమ్మేస్తుంటారు. అందువల్లే కెరీర్ పరంగా ఆయనకు ఈ పరిస్థితి ఎదురైంది. జ్యోతిష్యులు, పండితుల మాటలను ఆయన ఎక్కువగా నమ్ముతుండేవారు. అలాంటి సంభాషణలే ఆయన కెరీర్‌పై తీవ్ర ప్రభావాన్ని చూపించాయి. మరో విషయం ఏమిటంటే.. ఆయన సింగిల్ స్క్రీన్ హీరో. మల్టీప్లెక్స్‌లు వచ్చిన తరువాత ఆయన సినిమాలు రిలీజ్ కాలేదు. ముఖ్యంగా 'పార్ట్‌నర్' తర్వాత చాలా సినిమాలు ఆగిపోయాయి. ఆ సమయంలో డైరెక్టర్ డేవిడ్ ధావన్‌తో గోవిందా వర్క్ చేశారు.



చిత్ర పరిశ్రమను గోవిందా చూసే దృష్టి కోణాన్ని డేవిడ్ మార్చేశారు" అని అన్నారు. ఇదేతరహా వ్యాఖ్యలను ఇటీవల గోవిందా సతీమణి సునీత సైతం చేశారు. చుట్టూ ఉన్న వారి వల్లే తన భర్త కెరీర్ పాడైందని ఆరోపణలు చేశారు.

1963లో పుట్టిన గోవిందా ప్రముఖ సీరియల్ 'మహాభారత్'లో అభిమన్యుడి పాత్ర కోసం మొదటిసారి ఆడిషన్ ఇచ్చారు. ఆ తర్వాత ఖుష్బూ సరసన 'తాన్ బదన్' సినిమాతో ఇండస్ట్రీకి ఎంట్రీ ఇచ్చారు. అది విజయం సాధించడంతో వరుస అవకాశాలు అందుకున్నారు. 1991లో అమితాబ్, రజనీకాంత్‌లతో కలిసి ఆయన నటించిన 'హమ్' సినిమా సూపర్‌హిట్‌గా నిలిచింది. 2010లో మణిరత్నం దర్శకత్వంలో వచ్చిన రావణ్‌తో తెలుగు ప్రేక్షకులను మెప్పించారు.

# సినిమాలు చేయాలంటే ఇకపై ఆ అఫిడవిట్‌పై సంతకం చేయాల్సిందే..

మాదక ద్రవ్యాల వాడకం ఆరోపణలతో గత కొంతకాలంగా మలయాళ చిత్ర పరిశ్రమ వార్తల్లో నిలుస్తోన్న విషయం తెలిసిందే. పేరు పొందిన నటులు సైతం షూటింగ్ సెట్స్‌లో డ్రగ్స్ తీసుకుంటున్నారంటూ పలువురు నటీమణులు ఆరోపణలు చేయడం అంతటా చర్చనీయాంశమైంది. ఈ నేపథ్యంలోనే మాదక ద్రవ్యాల వాడకాన్ని నియంత్రించేందుకు మలయాళ చిత్ర పరిశ్రమ కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.



నటీనటులు ఎవరైనా ప్రాజెక్ట్‌కు ఓకే చెప్పేటప్పుడు వారు తప్పకుండా సెట్స్‌లో డ్రగ్స్ ఉపయోగించము అనే ఒక కొత్త అఫిడవిట్‌పై సంతకం చేయాల్సి ఉంటుంది. నటీనటులతోపాటు వారి సిబ్బంది.. చివరకు డ్రైవర్స్ కూడా ఇందులో భాగమే. వారందరూ సంతకాలు చేస్తేనే సెట్‌లోకి అడుగుపెట్టగలుగుతారు. ఈ మేరకు మలయాళ చిత్ర నిర్మాతల అసోసియేషన్ నిర్ణయం తీసుకుంది. షూటింగ్ లొకేషన్స్‌తోపాటు నిర్మాణాంతర పనులు జరిగే ప్రదేశాల్లోనూ ఇది వర్తిస్తుంది. సూపర్‌స్టార్స్ నుంచి చిన్నస్థాయి టెక్నీషియన్స్ వరకూ ఎవరూ దీనికి అతీతులు కారు. నిర్మాతల అసోసియేషన్ తీసుకున్న ఈ నిర్ణయంపై అన్ని విభాగాల వారు ఆమోదం తెలిపినట్లు సమాచారం. మరోవైపు, ఆదివారం 'అమ్మ' సమావేశం జరగనుంది. ఈ సమావేశంలో దీని గురించి చర్చించనున్నట్లు తెలుస్తోంది.

హేమ కమిటీ, డ్రగ్స్ వాడకం.. ఇలా వరుస విషయాలతో మలయాళ చిత్ర పరిశ్రమ ఇటీవల వార్తల్లో నిలుస్తోన్న విషయం తెలిసిందే. తమ చిత్ర పరిశ్రమలోని పరిస్థితులను ఉద్దేశించి ఇటీవల కీలక వ్యాఖ్యలు చేశారు నిర్మాత సాండ్రా థామస్. మాదకద్రవ్యాల వాడకం పరిశ్రమలో నానాటికీ పెరుగుతుందని ఆమె ఆరోపించారు. డ్రగ్స్ వాడకం కోసమే సెట్స్‌లో ప్రత్యేకంగా గదులు ఏర్పాటుచేస్తున్నారని ఆమె అన్నారు. ఒక సినిమా సెట్స్‌లో ఓ నటుడు మాదక ద్రవ్యాల మత్తులో తనతో అసభ్యకరంగా ప్రవర్తించాడని నటి విన్సీ సోనీ అలోషియస్ ఆరోపణ చేశారు. మరోవైపు, మాదక ద్రవ్యాల ఆరోపణలతో నటుడు షైన్ టామ్ చాకో తోపాటు మరికొంతమంది సినీ పరిశ్రమకు చెందిన వ్యక్తులను పోలీసులు కొన్నిరోజుల క్రితం అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే.

# ఆయన వల్లే ఇదంతా సాధ్యమైంది: 'కుబేర'పై రష్మిక పోస్ట్

%హైదరాబాద్: ధనుష్ ( నాగార్జున ( ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'కుబేర' . ప్రపంచంలోనే అత్యంత ధనవంతుడైన వ్యక్తికి.. వీధుల్లో జీవించే ఓ అతి పేదవాడికి మధ్య జరిగే సంఘర్షణే ప్రధాన ఇతివృత్తంగా రూపొందిన ఈ చిత్రంలో రష్మిక కథానాయికగా నటించారు. సమీరా పాత్రలో ఒదిగిపోయి నటించారామె. సినిమాలో తన పాత్రకు వస్తోన్న ఆదరణను దృష్టిలో ఉంచుకొని రష్మిక తాజాగా ఆసక్తికర పోస్ట్ పెట్టారు. శేఖర్ కమ్ముల వల్లే తాను ఆవిధంగా యాక్ట్ చేయగలిగానని అన్నారు.



"శేఖర్ కమ్ముల దర్శకత్వం వహించిన 'కుబేర'లో సమీరా పాత్రలో నటించా. ఆయన వల్లే సమీరా పాత్రలో ఆవిధంగా ఒదిగిపోగలిగాను. వృత్తిపై ఆయనకున్న ప్రేమ తన సినిమాల్లో ఎప్పుడూ కనిపిస్తుంటుంది. అందుకే ఆయనతో కలిసి వర్క్ చేయాలని ఎప్పటినుంచో అనుకుంటున్నా. 'కుబేర'తో నాకు అవకాశం దొరికినప్పుడు.. ఒక నటిగా ఆయన నాకు పూర్తి స్వేచ్ఛనిచ్చారు. అందుకే ఆయన చెప్పినవిధంగా ప్రతి సన్నివేశంలో యాక్ట్ చేయగలిగాను. ఆయన వల్లే ఈరోజు నాకు ఇంతటి ప్రశంసలు దక్కుతున్నాయి.

అద్భుతమైన నటీనటులతో పనిచేసినప్పుడు వారికి సమానంగా యాక్ట్ చేయాల్సిన బాధ్యత ఉంటుంది. ధనుష్ లాంటి గొప్ప నటుడు పక్కన యాక్ట్ చేస్తున్నప్పుడు.. ప్రతి సీన్‌లో శ్రమించాల్సిందే. దేవాతో కలిసి సమీరా పాత్రలో నటించినందుకు ఎంతో సంతోషిస్తున్నా. నాగార్జున సర్ గురించి చెప్పడానికి మాటలు సరిపోవు. ఆయన నుంచి నేనెంతో స్ఫూర్తి పొందాను. ఒక్క మాటలో చెప్పాలంటే ఆయన ది బెస్ట్. ఆయన జీవితం ఎంతోమందికి స్ఫూర్తిదాయకం. ఈ సినిమాలో భాగమైన టీమ్ అందరికీ, నా అభిమానులకు, సినీ ప్రియులకు ధన్యవాదాలు. సమీరా.. ఒక అందమైన గందరగోళం లాంటిది. సినిమా చూసిన తర్వాత నేను ఎందుకు ఇలా చెబుతున్నానో మీరే అర్థం చేసుకుంటారు" అని ఆమె రాసుకొచ్చారు. ప్రతిఒక్కరూ వీక్షించాల్సిన చిత్రమిదన్నారు.

నాగచైతన్య రివ్యూ:

'కుబేర' చిత్రాన్ని నటుడు నాగచైతన్య శుక్రవారం రాత్రి వీక్షించారు. సినిమా అద్భుతంగా ఉందన్నారు. టీమ్ అందరికీ సెల్యూట్ చేశారు. ప్రతిఒక్కరూ ఈ సినిమాను వీక్షించాలని కోరారు.

# 'హరిహర వీరమల్లు' కొత్త రిలీజ్ డేట్ ఫిక్స్.. ఎప్పుడంటే?

'హరిహర వీరమల్లు' పార్ట్ 1 కొత్త విడుదల తేదీ ఖరారైంది. ఈ సినిమాని జులై 24న () రిలీజ్ చేయనున్నట్టు చిత్ర బృందం శనివారం ఉదయం ప్రకటించింది. ఈ సినిమా విడుదల పలుమార్లు వాయిదా పడిన సంగతి తెలిసిందే. ఎట్టకేలకు ఈ నెల 12న బాక్సాఫీసు ముందుకు రావాల్సి ఉండగా మరోసారి పోస్ట్‌పోన్ అయింది.




పవన్ కల్యాణ్ ( రాజకీయాల్లో బిజీగా ఉండటం తదితర కారణాలతో ఈ మూవీ షూటింగ్ వాయిదా ఆలస్యమవుతూ వచ్చింది. క్రిష్ కొంతభాగం తెరకెక్కించిన తర్వాత నిర్మాత ఎ.ఎం. రత్నం తనయుడు జ్యోతికృష్ణ దర్శకత్వ బాధ్యతలు తీసుకున్నారు. పవన్ ఇందులో చారిత్రక యోధుడిగా మునుపెన్నడూ చూడని శక్తిమంతమైన పాత్రలో కనిపించనున్నారు. బిజీ షెడ్యూల్ కారణంగా పవన్ రాత్రి 10 గంటలకు డబ్బింగ్ మొదలుపెట్టి ఏకధాటిగా నాలుగు గంటల్లో పూర్తి చేయడం విశేషం. కొన్నాళ్ల పాటు సినిమా సెట్స్‌పైనే ఉండటంతో నిర్మాతపై ఆర్థికంగా అదనపు భారం పడిందని భావించిన పవన్.. తాను అడ్వాన్స్‌గా తీసుకున్న పారితోషికం మొత్తాన్ని తిరిగి ఇచ్చేశారు. 'అసుర హననం' పాటలోని ఫైట్స్ అన్నీ పవన్ కల్యాణే డిజైన్ చేశారని జ్యోతికృష్ణ ఓ సందర్భంలో తెలిపారు. ఈ సినిమా కోసం పవన్ మార్షల్ ఆర్ట్స్ ప్రాక్టీస్ చేశారు.

ఈ పీరియాడికల్ యాక్షన్ మూవీలో నిధి అగర్వాల్ హీరోయిన్. బాబీ దేవోల్, అనుపమ్ ఖేర్, సత్యరాజ్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. తొలి భాగం 'హరి హర వీరమల్లు: పార్ట్ 1- స్వోర్డ్ వర్సెస్ స్పిరిట్' పేరుతో రానుంది.

# 'కుబేర' రన్‌టైమ్‌పై కామెంట్స్.. శేఖర్ కమ్ముల ఏమన్నారంటే..?

హైదరాబాద్: ధనుష్ (, నాగార్జున ( ప్రధాన పాత్రల్లో శేఖర్ కమ్ముల రూపొందించిన చిత్రం 'కుబేర' రష్మిక కథానాయిక. శుక్రవారం ఇది ప్రేక్షకుల ముందుకు వచ్చింది. తాజాగా ఈ సినిమా సక్సెస్ ప్రెస్‌మీట్ హైదరాబాద్‌లో జరిగింది. సినిమాకు వస్తోన్న పాజిటివ్ రిపోర్ట్స్‌పై టీమ్ ఆనందం వ్యక్తంచేసింది. ఇందులోభాగంగా ఈ సినిమా రన్‌టైమ్‌పై వస్తోన్న కామెంట్స్‌ను ఉద్దేశించి దర్శకుడు ఆసక్తికర కామెంట్స్ చేశారు. ఈ సినిమాకు అంత నిడివి అవసరమన్నారు.

"ఇది నాకొక ఎమోషనల్ టైమ్. మేము ఈ కథ అనుకున్నప్పటినుంచి వాస్తవికతకు దగ్గరగా తీయాలనుకున్నాం. అనుకున్న దానికంటే బడ్జెట్ మించిపోయినప్పుడల్లా కథలో ఏదైనా కోతలు విధించాలనుకునేవాడిని. ఆ సమయంలో నా టీమ్ నాకెంతో సపోర్ట్‌గా నిలిచింది. ఈ సినిమాను ఇలాగే రూపొందించాలని ధైర్యాన్నిచ్చింది. ఇప్పటివరకూ నేను చేసిన చిత్రాల్లో ఇది అద్భుతమైన చిత్రం. నిడివి విషయంలో కొంతమంది కామెంట్స్ చేస్తున్నారు. అవసరమైనప్పుడు సినిమాకు కత్తెర వేయాలనేది దర్శకుడు లేదా టీమ్‌కు తెలియని విషయం కాదు. కానీ, ఆయా సన్నివేశాలు ఉండాలి, చెప్పాలనుకున్నప్పుడు దానిని ఆవిధంగా రూపొందించడమే ధర్మం. ఈ సినిమాకు ఇది అవసరం. ఇందులో ఎన్నో కోణాలు ఉన్నాయి. సినిమా విషయంలో గర్వం, సంతోషంగా ఉన్నా. ఇదొక కంప్లీట్ ఫిల్మ్. ప్రేక్షకులు సినిమా చూస్తున్నప్పుడు సాగదీతగా ఉందని అనుకోరనుకుంటున్నా" అని శేఖర్ కమ్ముల చెప్పారు.

నాగార్జున మాట్లాడుతూ.. "శేఖర్ దర్శకత్వం వహించిన చిత్రాలన్నీ విజయాలే అందుకున్నాయి. సినిమా విడుదలైన ప్రతిసారీ ఆయన సక్సెస్‌మీట్స్‌లో కూర్చోవడం పరిపాటి. ఈ సినిమాతో ఆయన మరో విజయాన్ని అందుకున్నారు. ఆయన విషయంలో నాకెంతో సంతోషంగా ఉంది. థాంక్యూ శేఖర్ ఇలాంటి అద్భుతమైన చిత్రాన్ని ఇచ్చినందుకు. చాలారోజుల తర్వాత అందరినుంచి పాజిటివ్, హిట్ రివ్యూ వచ్చింది. ప్రేక్షకులందరికీ అంతలా నచ్చిందీ చిత్రం. సుమంత్, అమల, నాగచైతన్య కంటే ముందునుంచే శేఖర్‌తో సినిమా చేయాలని అనుకున్నా. మేమిద్దరం అప్పుడప్పుడూ కలుస్తుంటాం. సినిమా చేయాలనుకుంటాం. నాతో స్టైలిష్ సినిమా చేయాలనుందని శేఖర్ చెబుతుండేవాడు. మా ఇద్దరి కాంబోలో ఇలాంటి సినిమా రావాలని రాసి ఉంది. నాకొక అద్భుతమైన పాత్రను ఆయన ఇచ్చాడు. రొటీన్ సినిమాలకు దూరంగా ఒక కొత్త పాత్ర పోషించాలనే ఆశ ఉండేది. అలాంటి పాత్ర ఇందులో దక్కింది. ఇది శేఖర్ కమ్ముల చిత్రం. ఈ సినిమా కోసం ఆయన ప్రాణం పెట్టారు. మా కాంబోలో మరో సినిమా కోసం ఎదురుచూస్తున్నా" అని తెలిపారు.



ఈ పాత్ర ఎంచుకోవడానికి ప్రధాన కారణం ఏమిటి?

నాగార్జున: శేఖర్ కమ్ముల కోసమే ఈ కథకు ఓకే చెప్పా. ఆయనతో పనిచేయాలని ఎప్పటినుంచో అనుకుంటున్నా. ఆయనపై ఉన్న నమ్మకం అలాంటిది. ఆయన తెరకెక్కించిన చిత్రాలన్నీ చూశా. పాత్రలను ఆయన ఏవిధంగా తీర్చిదిద్దుతారో మనకు తెలుసు. కథ వినగానే ఇందులో ప్రధాన పాత్ర నాదే అనిపించింది. ప్రతిఒక్కరి పాత్ర నా పాత్ర చుట్టూ తిరుగుతుందనిపించింది. ఒకవేళ స్క్రీన్ స్పేస్ వేరే నటీనటులకు ఎక్కువగా ఉండొచ్చు. దానిని నేను ఏమాత్రం పట్టించుకోలేదు. కథ వినగానే ఇది పూర్తిగా దీపక్ (నాగార్జున పోషించిన పాత్ర పేరు) ఫిల్మ్ అనిపించింది. శేఖర్ నాకు ఆవిధంగానే కథ చెప్పారు.

ఈ కథను రూపొందించడం వెనక ఉన్న నిజమైన ప్రేరణ ఏమిటి?

శేఖర్: ప్రపంచంలో పేద, ధనిక అనే వ్యత్యాసం ఉంది. ఇప్పుడున్న రోజుల్లో అది మరింత పెరుగుతుంది. అందుకే ఇలాంటి సినిమా చూపించాలనే ఆలోచన వచ్చింది. అందులోనుంచే మా కథ పుట్టింది.

ప్రమోషన్స్‌లో రిలీజ్ చేసిన రష్మిక పాట ఇప్పుడు సినిమాలో లేదు. రన్‌టైమ్ తగ్గించి ఆ పాటను యాడ్ చేయొచ్చు కదా?

శేఖర్: దానిని కేవలం ప్రమోషనల్ సాంగ్‌గా రూపొందించాం. సినిమాలో పెడితే సమస్య అవుతుందనిపించింది. అందుకే యాడ్ చేయలేదు. వేరే సీన్స్ తొలగించి ఇప్పుడు ఆ పాటను యాడ్ చేయడం అంత సులభం కాదు. ఈజీ అయితే అలా చేయడం నాకు ఇష్టమే. అనవసరంగా సన్నివేశాలను రూపొందించి.. ఫైనల్ కట్‌లో వాటిని తొలగించే పని మేము చేయలేదు. అనుకున్నవిధంగా సినిమాని రూపొందించాం. ఇప్పుడు మీరు చూస్తున్న రన్‌టైమ్‌కు మరో అరగంట ఎక్కువ మాత్రమే ఒరిజినల్ నిడివి ఉండొచ్చు.

రిలీజ్‌కు ముందు వివిధ విషయాల వల్ల మీరెంతో ఒత్తిడిలో ఉన్నారు. ఇప్పుడెలా ఉంది?

సునీల్: వర్క్ విషయంలోనే ఎంతో ఒత్తిడికి గురయ్యా. సెన్సార్ విషయంలో టెన్షన్ పడ్డా. వేరే టెన్షన్ ఏమీ లేదు. సాధారణంగా నేను టెన్షన్ ఇస్తాను. తీసుకోను. నాగార్జున మాకెంతో సాయం చేశారు. ఆయన వల్లే సినిమా అనుకున్న సమయానికి విడుదల చేయగలిగాం.

ఏపీలో టికెట్ ధర పెంచారు?

సునీల్: టికెట్ ధరలు మేము ఏమీ భారీగా పెంచలేదు. అక్కడ మరీ తక్కువ ధరలు ఉన్నాయి. అందుకే రూ.25, రూ.50 మాత్రమే పెంచాం.

# వర్షాకాలంలో ఇమ్యూనిటీని పెంచే సూపర్ ఫుడ్స్ ఇవే..!



: వర్షాకాలంలో బ్యాక్టీరియా, వైరస్‌లు, ఫంగస్, ఇన్ఫెక్షన్‌లు దాడితో అస్వస్థతకు లోనయ్యే అవకాశం ఉంటుంది. ఈ కాలంలో మెరుగైన ఆహారం తీసుకోవడం ద్వారా ఇమ్యూనిటీని పెంచుకుని వ్యాధుల బారినపడకుండా చూసుకోవచ్చని నిపుణులు చెబుతున్నారు. వాతావరణంలో మార్పులతో మన రోగనిరోధక శక్తి బలహీనపడే అవకాశం ఉండటంతో జలుబు, ఫ్లూ, కడుపుబ్బరం, డయేరియా వంటి అనారోగ్యాలు తలెత్తుతుంటాయి.

ఇక పోషకాలతో కూడిన కొన్ని సూపర్ ఫుడ్స్ ద్వారా ఇమ్యూనిటీని పెంచుకోవచ్చని పోషకాహార నిపుణులు సూచిస్తున్నారు. వర్షాకాలంలో ప్రధానంగా యాంటీ ఇన్‌ఫ్లమేటరీ, యాంటీ ఆక్సిడెంట్స్ అధికంగా ఉండే అల్లం ఆహారంలో భాగం చేసుకోవాలి. ఇందులో ఉండే జింజెరాల్ వంటి పదార్థాలు ఇన్‌ఫ్లమేషన్‌ను తగ్గించి శరీరంలో ఆక్సిడేటివ్ స్ట్రెస్ నిరోధిస్తాయి.

యాంటీ ఇన్‌ఫ్లమేటరీ, యాంటీఆక్సిడెంట్స్ సమృద్ధిగా ఉండే కర్కుమిన్ అనే పదార్థం పసుపులో ఉండటంతో ఇది మన ఇమ్యూనిటీని బలోపేతం చేస్తుందని న్యూట్రిషనిస్టులు చెబుతున్నారు. ఇక యాంటిమైక్రోబల్, యాంటీవైరల్ పదార్థాలు కలిగిన వెల్లుల్లి కూడా ఆహారంలో భాగం చేసుకోవాలి. వర్షాకాలంలో తీసుకోవాల్సిన సూపర్ ఫుడ్స్ విషయానికి వస్తే..

# చేప కళ్లను తీసిపారేస్తున్నారా..



చేపలు ఆరోగ్యానికి చాలా మంచిది. వీటిలో ఒమేగా 3 ఫ్యాటీ ఆసిడ్స్, ప్రొటీన్లు, విటమిన్లు ఇలా ఇంకా ఎన్నో పోషకాలు ఉంటాయి. అందుకే వైద్యులు చేపలను ఎక్కువగా తీసుకోవాలని చెబుతుంటారు. ఇది తెలిసి కూడా చాలామంది నాన్ వెజ్ ప్రియులు చేపల కంటే చికెన్, మటన్‌కే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తారు. కొందరు ముళ్ళు ఉంటాయని భయపడితే, ఇంకొందరు ఇళ్లంతా కవుసు వాసన వస్తుందని దూరం పెడుతారు. ఇగ కొందరు చేపలు తిన్నా దాని తల భాగాన్ని పడేస్తారు. వాస్తవానికి చేపల తలలో అధిక పోషక విలువలు ఉంటాయి.

కొంత మంది చేప తల తింటారు. కానీ, ఆ తలలో ఉండే కళ్లను ఛీ అంటూ వదిలేస్తారు. నిజానికి ఆ కళ్ళల్లో కూడా అద్భుతమైన పోషకాలు ఉంటాయి. చేప కళ్లను తింటే కంటిచూపు మెరుగుపడుతుంది. కళ్లకు మాత్రమే కాదు, గుండె ఆరోగ్యానికి కూడా చేప కళ్లు చాలా మంచిది. చేప కళ్లలోని పోషకాలు గుండె పనితీరును మెరుగుపరుస్తాయి. గుండెపోటు లాంటి సమస్యలను దూరం చేస్తాయి. అంతేగాక మెదడులో రక్త ప్రసరణను క్రమబద్ధీకరించడం ద్వారా పక్షవాతం లాంటి సమస్యలు రాకుండా తోడ్పడుతాయి.

ఆటిజం లాంటి మానసిక సమస్య నుంచి బయటపడేందుకు కూడా చేపల కళ్లు సహకరిస్తాయి. ఆటిజం ఉన్న వ్యక్తులు ఊరికెనే అలసిపోతారు. ప్రతి చిన్న విషయానికి ఆత్రుతను ప్రదర్శిస్తుంటారు. వీరిలో ఆసక్తి లోపం కూడా ఉంటుంది. అలాంటి వారు చేపల కళ్లు తింటే అందులో ఉన్న ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్స్ ఉపశమనం కలిగిస్తాయి. అంతేకాదు మెదడు పనితీరు మెరుగై జ్ఞాపకశక్తి పెరుగుతుంది. భావోద్వేగాలను సమతౌల్యమవుతాయి. కడుపులో ఉండే దీర్ఘకాలిక యాసిడ్ మంట తగ్గుతుంది.

అదేవిధంగా చేపల కళ్లల్లో విటమిన్ డి పుష్కలంగా ఉంటుంది. ప్రశాంతమైన నిద్రకు విటమిన్ డి ఉపకరిస్తుంది. ఇక ట్యూనా, సాల్మన్ చేపలు ఆరోగ్యానికి చాలా మంచివి. పైగా వాటిలో విటమిన్ డి మోతాదు మరింత ఎక్కువగా ఉంటుంది. చేపలు క్యాన్సర్ ప్రమాదాన్ని చాలా వరకు తగ్గిస్తాయి. జీర్ణ క్రియను మెరుగుపరుస్తాయి. నోరు, స్వర పేటిక, పెద్ద పేగు, క్లోమం వంటి అవయవాలకు వచ్చే క్యాన్సర్‌ను చేప మాంసం తగ్గిస్తుందని అమెరికన్ జర్నల్ ఆఫ్ టెక్నికల్ న్యూట్రిషన్ అధ్యయనం తెలిపింది.

# పోహా వహ్వా!







పోహాను మనం అటుకులు అని పిలుస్తాం. ఇవంటే శ్రీకృష్ణ భగవానుడికి ఎంతో ఇష్టమని తెలిసిందే. అందుకే, కష్టాల్లో ఉన్న కుచేలుడు తన మిత్రుడికి గుప్పెడు అటుకులు తీసుకువెళ్తాడు. అపారమైన సంపదలు వరంగా పొందుతాడు. ఉదయం వేళ, సాయంత్రాల్లో ఉపాహారంగా పోహాను మించిన మంచి ఆహారం ఇంకోటి లేదంటే అతిశయోక్తి కాదు. భూమ్మీద మనిషి తొలి చిరుతిండ్లలో పోహా ఒకటి.

పోహాను పిల్లలు మొదలుకొని పెద్దల వరకు ఎవ్వరైనా సరే నిరభ్యంతరంగా తినేయవచ్చు. తేలికగా అరిగిపోతాయి. అంతేకాదు వీటితో ఉపాహారం చేసుకోవడం క్షణాల్లో పని.

శక్తిదాయినిజి

పోహా శరీరానికి శక్తిని ఇచ్చే ఆహారపదార్థం. దీంతో తిన్న వెంటనే కొంతసేపటి వరకు చురుగ్గా ఉంటాం. పిండిపదార్థాలు మాత్రమే ఉండే ఇతర పదార్థాలతో పోలిస్తే పోహా ఆరోగ్యకరమైనది. ఇందులో ఫైబర్ ఉంటుంది. రక్తంలోకి చక్కెరను నిదానంగా విడుదలయ్యేలా చేస్తుంది కాబట్టి, డయాబెటిస్ ఉన్నవారికీ పోహా మంచి ఆహారమే. ఎక్కువసేపు కడుపు నిండుగా ఉన్న భావన కలిగిస్తుంది. పైగా ఇది గ్లూటెన్ ఫ్రీ కూడా. గ్లూటెన్ అలర్జీ ఉన్నవాళ్లూ ఎంచక్కా తినొచ్చు.

పోషకాల పెన్నిధి

పోహాలో ఐరన్ కొద్దిమొత్తంలో ఉంటుంది. ముడిబియ్యంతో చేస్తారు కాబట్టి బి విటమిన్ కూడా ఉంటుంది. బ్రేక్‌ఫాస్ట్ కోసం పోహాలో పల్లీలు జోడిస్తాం. దీంతో ప్రొటీన్లు, యాంటీఆక్సిడెంట్లు కలిసి పోహాను మరింత ఆరోగ్యకరంగా మారుస్తాయి. నిమ్మరసం చిలకరించడంతో విటమిన్ సి తోడవుతుంది. ఇది అటుకులు, పల్లీల్లో ఉండే ఐరన్ శరీరానికి అందేలా దోహదపడుతుంది.

మరింత ఆరోగ్యం కావాలా?

అయితే రెడ్ రైస్‌తో తయారైన అటుకులు తీసుకోవాలి. వీటికి ఎర్ర రంగును ఇచ్చేది ఆంథోసైనిన్ అనే పిగ్మెంట్. పైగా ఇది యాంటీఆక్సిడెంట్ కూడా. ఇందులో ఫైబర్, విటమిన్ బి, కాల్షియం, జింక్, ఐరన్, మాంగనీస్, మెగ్నీషియం కూడా ఎక్కువగానే ఉంటాయి.

రకరకాలుగా

%అటుకులను తీసుకుని. %ౌ% ఆవాలు, కరివేపాకు, పల్లీలు, ఆలుగడ్డ ముక్కలు, బఠానీలతో పోపు వేసుకోవాలి. దీనిపై నిమ్మరసం చిలకరించుకోవాలి. అవసరం అనుకుంటే పుట్టగొడుగులు, మిరియాలు, చీజ్ కలుపుకోవచ్చు. పాలకూర కూడా వేసుకోవచ్చు. టోఫు, మొలకలు, సోయా ఉండలు జోడించి మరింత రుచికరంగా మార్చుకోవచ్చు.

ఎలా తిన్నా మంచిదే

కొంతమంది అటుకులకు పెరుగు కలుపుకొనీ తింటారు. ఇలా చేయడం వల్ల శరీరానికి కాల్షియం అందుతుంది. అటుకులు, ఆవకాయ, పెరుగు మిశ్రమం రుచి తెలుగువారికి పాత అనుభూతే. కొంతమంది చక్కెర వేసిన పాలలో అటుకులు కలుపుకొని కూడా తింటారు. ఎలా తిన్నా అటుకులు మంచే చేస్తాయి.

# అల్లంతో అలసటకు చెక్!

మనం రోజూవారి వంటల్లో వాడే పదార్థాల్లో ఒకటి అల్లం. కూరలు, గ్రేవీల్లోనే కాకుండా స్నాక్స్, చాట్‌లలోనూ మంచి ఘాటు రుచికి దీన్ని వాడతారు. ఇక వర్షాకాలంలో తరచూ పలకరించే జలుబు, గొంతునొప్పి వంటి సమస్యలకు అల్లం చాయ్, అల్లం పాలతో చెక్ పెట్టేయొచ్చు.

అల్లంలో మన శరీరానికి కావాల్సిన కాల్షియం, మెగ్నీషియం, పొటాషియం, విటమిన్ సి, యాంటీ ఆక్సిడెంట్స్, ప్రొటీన్స్ లభిస్తాయి. అయితే, అల్లాన్ని కూరల్లో భాగంగా తీసుకుంటే ఫలితం పరిమితంగానే ఉంటుందట. పరగడుపున చిన్న ముక్కలు తీసుకుంటే అధిక ప్రయోజనాలు ఉంటాయని నిపుణుల మాట.



ఉదయాన్నే ఒక టీ స్పూన్ అల్లం రసం తీసుకున్నా.. మంచి ఫలితం వస్తుందట. ఇలా చేస్తే రోజంతా హుషారుగా ఉంటారట. ఉదయాన్నే అర అంగుళం అల్లం ముక్కను, తేనెతో తీసుకుంటే.. జీర్ణవ్యవస్థ పనితీరు మెరుగవుతుంది. ఫలితంగా గ్యాస్, ఎసిడిటీ, మలబద్ధకం, కడుపు ఉబ్బరం తదితర సమస్యలు దూరమవుతాయి.

క్రమం తప్పకుండా అల్లం తీసుకోవడం వల్ల కీళ్లనొప్పుల నుంచి ఉపశమనం కలుగుతుంది. నోటి దుర్వాసన కూడా పారిపోతుంది. రోగనిరోధక శక్తి పెరగడంతోపాటు దగ్గు, జలుబు లాంటి సీజనల్ వ్యాధులు పీడించకుండా అల్లం అడ్డుగా నిలుస్తుంది.

# సందెపొద్దుల కాడ.. ఒళ్లు వంచెయ్ నరుడా!



ఈరోజుల్లో వ్యాయామం చాలామంది దినచర్యలో భాగంగా మారిపోయింది. ఆధునిక జీవనశైలి, మారుతున్న ఆహారపు అలవాట్ల వల్ల ఎదురయ్యే సమస్యల బారినపడకుండా ఉండాలంటే క్రమం తప్పకుండా వ్యాయామం చేయాల్సిందే! ఈ క్రమంలో ఉద్యోగులు, గృహిణులు, పిల్లలు, వృద్ధులు వారికి వీలైన సమయాల్లో వర్కవుట్లు చేస్తూ ఆరోగ్య ప్రయోజనాలను పొందుతున్నారు. వ్యాయామం ఎంతసేపు చేశామన్నది కాదు.. ఎప్పుడు చేశామన్నది కూడా చాలా ప్రధానం అంటున్నారు నిపుణులు. ఏ వేళలో చేసే వ్యాయామం వల్ల ఎలాంటి ఉపయోగాలు ఉంటాయో తెలుసుకుందాం..

చాలామంది వ్యాయామానికి ఉదయం వేళ సరైన సమయంగా భావిస్తారు. వేకువజామున చేసే వ్యాయామం జీవక్రియను ప్రేరేపిస్తుంది. రోజంతా క్యాలరీలను కరిగించే ఎండార్ఫిన్‌లను విడుదల చేస్తుంది. సానుకూల మానసిక స్థితిని ప్రోత్సహిస్తుంది. రోజంతా ఉల్లాసంగా ఉంచుతుంది. అయితే ఉదయం వేళ కండరాలు వేడెక్కడానికి ఎక్కువ సమయం పడుతుంది. వ్యాయామం సరిగా చేయకుంటే గాయాల ముప్పు పొంచి ఉంటుంది. బిజీ షెడ్యూల్స్ ఉన్నవారికి, వర్కవుట్స్ కోసం ఉదయాన్నే సమయాన్ని వెచ్చించడం సమస్యగా మారుతుంది.

మధ్యాహ్నం శరీర ఉష్ణోగ్రత,

కండరాల కార్యకలాపాలు మధ్యాహ్నం అధికంగా ఉంటాయి. అందువల్ల ఈ సమయంలో వ్యాయామం అవయవాల పనితీరును మెరుగుపరుస్తుంది. పగటిపూట వ్యాయామం ఒంటరిగా కాకుండా స్నేహితులు, కుటుంబసభ్యులతో కలిసి చేస్తే మంచి ఫలితం ఉంటుంది. కానీ, ఆరగింపు సేవలు, ఆర్జిత సేవలు పూర్తయ్యాక ఏదో నాలుగు నిమిషాలు వర్కవుట్లు చేస్తామంటే కుదరదు. పని ఒత్తిడి కారణంగా వాయిదాలకూ అవకాశం ఉంది.

సాయంత్రం

సాయంకాలం చేసే వ్యాయామం ఒత్తిడిని తగ్గించడంలో సాయపడుతుంది. పొద్దంతా పనిచేశాక సాయంత్రం ఓ ఇరవై నిమిషాలు వర్కవుట్లు చేస్తే శరీరం కొత్త ఉత్సాహాన్ని సంతరించుకుంటుంది. శరీర ఉష్ణోగ్రత, కండరాల కార్యకలాపాలు పెరిగే సమయంలో వ్యాయామం చేయడం వల్ల ఫలితం మెరుగ్గా ఉంటుంది. అయితే సాయంత్రం 5 నుంచి 7 గంటల మధ్యలో మాత్రమే వ్యాయామానికి సమయం కేటాయించాలి. నిద్రకు ఉపక్రమించే ముందు వ్యాయామం చేయకూడదు. ఇది అడ్రినలిన్ స్థాయులను పెంచడం వల్ల నిద్రలేమి సమస్యకు దారి తీయొచ్చు.

# సంతానయోగం ఆలస్యం!

అమ్మతనం వరం. దాన్ని అందుకోవాలని ప్రతి ఇల్లాలూ కోరుకుంటుంది. నాన్నగా పిల్లలను లాలించాలని పురుషుడూ భావిస్తుంటాడు. అందుకోసం ఆలుమగలు నోములు నోస్తారు. ముడుపులు కడుతుంటారు. అయితే, ఆధునిక జీవనశైలి, ఒత్తిళ్లు, ఉద్యోగ బాధ్యతలు ఈ తరం దంపతులకు గండాల్లా పరిణమిస్తున్నాయి. గర్భధారణ ఆలస్యం కావడానికి కారణాలు తెలిస్తే.. వాటిని పరిష్కరించుకునే మార్గాలు అన్వేషించొచ్చు. జీవనశైలిలో మార్పులను సరిచేసుకోకపోతే.. సంతానయోగం అందని ద్రాక్షగా మిగిలిపోవచ్చు.



ఉద్యోగం, వ్యాపారం, దైనందిన జీవితంలో చాలామంది ఒత్తిడికి గురవుతున్నారు. దీని కారణంగా స్త్రీలలో సంతానోత్పత్తి సామర్థ్యం తగ్గుతుందని అధ్యయనాల్లో వెల్లడైంది. ఒత్తిడి ప్రభావం మహిళల కన్నా పురుషులపై ఎక్కువగా ఉంటుందట. ఈ ప్రభావం వారి దాంపత్య జీవితం మీదా పడుతుంది.

సంతానోత్పత్తి వయసుతోపాటు మారుతుంది. వయసు పెరిగే కొద్దీ అండాల పరిమాణం, సామర్థ్యం తగ్గుతాయి. దీంతో గర్భధారణ కష్టమవుతుంది. 40 ఏండ్లు పైబడిన తర్వాత పురుషుల్లో శుక్ర కణాల సంఖ్య కూడా తగ్గుతుంది.

హార్మోన్ల అసమతుల్యత కూడా స్త్రీ, పురుషులపై ప్రభావం చూపుతుంది. వయసు పెరిగే కొద్దీ శృంగార జీవితంపై ఆసక్తి తగ్గుతూ వస్తుంది. దీంతో భార్యాభర్తలు సరైన సమయంలో కలవలేకపోతుంటారు. ఫలితంగా గర్భధారణ ఆలస్యమవుతుంది.

అనారోగ్యమైన జీవనశైలి కూడా సంతానోత్పత్తిని దెబ్బతీస్తుందని పలు అధ్యయనాల్లో తేటతెల్లమైంది. పోషకాలు లేని ఆహారం, కల్తీ పదార్థాలు, నిద్రలేమి, శారీరక శ్రమ%ౌ% వీటన్నిటినీ సంతానోత్పత్తికి గండాలుగానే పరిగణించాలి. వీటిని అధిగమించినప్పుడే ఆలుమగలు అమ్మానాన్నలయ్యేది!

Printed,Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed at Sri Muktheswara Publications, D.No. 10-1-70/A, Lingojiguda, Opp. H.P Gas Agency, Karmanghat, Saroornagar ,RangaReddy( Dist.), Hyderabad - 500035, Telangana .Published at Plot No.43,Flat No.210,Raja Rjeswari APTS,HUDA Complex,Saroornagar,Ranga Reddy(Dist),Hyderabad.500035, Telangana
Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy